
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం 30-7-2023
www.navatelangana.com
సంపుటి : 9 | సంచిక : 210 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00



త్వరలో రుణమాఫీ.?

రూ.లక్ష వరకూ అన్నదాత అప్పులు చెల్లింపు

- కేసీఆర్ యోచన
- ప్రతిపక్షాల నోరు మూయించే వ్యూహం
- రైతు బంధు, బీమాతోపాటు రుణమాఫీనీ ఎన్నికల్లో వాడుకునే ఎత్తుగడ
- కాంగ్రెస్ ప్రకటించకముందే వెల్లడించనున్న గులాబీ దళపతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న శాసనసభ ఎన్నికల కోసం గులాబీ దళపతి కేసీఆర్ తన అమ్ములపొదిలోంచి మరో అస్త్రాన్ని వదలనున్నారా..? అంటే అవుననే అంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు. ఇదే విషయాన్ని ఇటు అధికారులు సైతం ధృవీకరిస్తున్నారు. ఆ అస్త్రమే రైతు రుణమాఫీ. కారు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా ఆ పార్టీకి ప్రతి ఎన్నికల్లోనూ ఓట్లను గుమ్మరించాయి. కానీ రుణమాఫీ చేయకపోవటాన్ని ప్రతి పక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ప్రతీసారి ఎత్తి చూపుతూ వస్తోంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు అది కూడా ఆగస్టు, సెప్టెంబరు లోపే రుణమాఫీ చేయటం ద్వారా ప్రతిపక్షాల నోళ్లను మూయించేందుకు కేసీఆర్ వ్యూహం పన్నుతున్నారు. తద్వారా అన్ని రకాలుగా ఆదుకుంటున్నాం కాబట్టి.. మాకే ఓట్లేయాలంటూ ఆయన అన్నదాతలకు విజ్ఞప్తి చేయనున్నారు. మరోవైపు 'అబ్ కీ బార్-కిసాన్ సర్కార్' అనే నినాదంతో జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలి, అందుకనుగుణంగా ఇతర రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌ను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయటం ద్వారా రాష్ట్రంతోపాటు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు తమ పార్టీని వేలెత్తి చూపకుండా ఉండాలన్నదే కేసీఆర్ వ్యూహమని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి రూ.లక్ష లోపున్న రైతు రుణాలను మాఫీ చేస్తామంటూ సీఎం కేసీఆర్ 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ...11లో

ఐఐపీఎస్ డైరెక్టర్‌పై
కేంద్రం వేటు

- మోడీ సర్కార్‌ను ఇబ్బంది పెడుతున్న సర్వేలు
- వాస్తవాలను జీర్ణించుకోలేకపోతున్న వైనం



న్యూఢిల్లీ : ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాప్యులేషన్ సైన్సెస్ (ఐఐపీఎస్) డైరెక్టర్ కేఎస్ జేమ్స్‌ను సస్పెండ్ చేస్తూ మోడీ ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుంది. నియామకాలలో అవకతవకలు జరిగాయని,అందుకే సస్పెన్షన్ వేటు వేశామని ...11లో

యూసీసీ అమలు చేస్తే
ఎన్డీఏకు గుడ్‌బై


- మిజోరం సీఎం జోరాంతంగా హెచ్చరిక
- మణిపూర్ సమస్యకు రాజకీయ పరిష్కారం అవసరమని వ్యాఖ్య



ఐజ్వాల్ : కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తే ఎన్డీఏ నుండి వైదొలుగుతామని మిజోరం ముఖ్యమంత్రి, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) నేత జోరాంతంగా హెచ్చరించారు. 'మా పార్టీ ...11లో

బుద్ధదేవ్ భట్టాచార్యకు
తీవ్ర అస్వస్థత

గ్రీన్ ఛానెల్ ద్వారా ఆస్పత్రికి తరలింపు


(ఫైల్)

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బుద్ధదేవ్ భట్టాచార్య (79) శనివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనను నగరంలోని ఉడ్‌ల్యాండ్స్ ఆస్పత్రికి తరలించారు. బుద్ధదేవ్ కొంతకాలంగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. ఊపిరాడేందుకు నెబ్యులైజర్ వినియోగిస్తున్నారు. శనివారం ఉదయం బుద్ధదేవ్‌ను పరీక్షించిన వైద్యులు నెబ్యులైజర్ ఉపయోగించినా..ఊపిరి ఆడటం కష్టమవుతోందని గుర్తించి తక్షణమే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. దీంతో గ్రీన్ ఛానెల్ ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ఆయనను సమీపంలోని ఉడ్‌ల్యాండ్స్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో బుద్ధదేవ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఆక్సిజన్ స్థాయిలు 70శాతం మేర పడిపోయాయని వైద్యులు తెలిపారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో వెంటిలేటర్‌పై వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నామని ఉడ్‌ల్యాండ్స్ ఆస్పత్రి ఎండీ, సీఈఓ డాక్టర్ రూపాలి బసు శనివారం సాయంత్రం విడుదల చేసిన బులిటెన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. బుద్ధదేవ్ ఆరోగ్య పరిస్థితిని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, ఇతర నాయకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భట్టాచార్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం ...11లో

బీజేపీకి కష్టకాలమే

ఎన్నికల ముంగిట సవాళ్లతో సతమతం | ఒకే మాట ఒకే బాటగా ఇండియా

లోక్‌సభ ఎన్నికలలో తొలి విడత పోలింగ్ జరగడానికి ఎనిమిది నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది. వివిధ రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. ప్రధాని నరేంద్ర మోడీ సందర్భం వచ్చిన ప్రతిసారీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ప్రసంగాలు చేస్తున్నారు. ఆయన మాటలు, చేష్టలు ఆ దిశగానే సాగుతున్నాయి. బీజేపీ కీలక నేతలది కూడా అదే దారి. అటు ప్రతిపక్ష పార్టీలు కూడా ఎన్నికల గోదాలోకి దిగేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నాయి. ఈసారి ప్రతిపక్షాల ఎత్తుగడలు ఆషామాషీగా లేవు. బీజేపీని ఎలాగైనా మట్టికరిపించాలన్న లక్ష్యంతో కసిగా ముందుకు సాగుతున్నాయి.

ఫైనల్స్‌కు సిద్ధమవుతున్న పార్టీలు



అవిశ్వాసం ఎందుకంటే...

ఓటమి తప్పదని తెలిసి కూడా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాలను ఎందుకు ప్రతిపాదిస్తాయి? ఎందుకంటే తీర్మానంపై తప్పనిసరిగా చర్చ జరుగుతుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రతిపక్షాలకు తగిన సమయం లభిస్తుంది. చర్చ ముగిసిన తర్వాత ప్రధాని సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. నిజానికి ఈ అవిశ్వాస తీర్మానం ప్రధానిని పెద్దగా ఇబ్బంది పెట్టేది కాదు. ఆయనను కలవరపాటుకు గురి చేసే విషయం ఏమంటే ప్రతిపక్షాలు ఈసారి సంఘటితమయ్యాయి. అయితే ఇప్పుడు వారంతా ఒకే మాటగా, ఒకే బాటగా ముందుకు కదులుతున్నారు. అవిశ్వాస ...11లో

న్యూఢిల్లీ : 2019 ఎన్నికలకు ముందు జరిగిన పుల్వామా ఘటన ప్రతిపక్షాల ఆశలపై నీళ్లు చల్లింది. ఎవరూ ఊహించని మెజారిటీతో బీజేపీ అధికారాన్ని సొంతం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. పైగా ప్రతిపక్షాలు సంఘటితమవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా 2019లో మాదిరిగా డీలా పడి లేదు. అందువల్ల 2024 బీజేపీకి నల్లేరుపై నడకలా లేదు. ప్రస్తుతం అందరి దృష్టీ లోక్‌సభ ఎన్నికల పైనే తప్పించి త్వరలో జరగబోయే మూడు హిందీ రాష్ట్రాలు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై పెద్దగా లేదు. చిన్న రాష్ట్రమైన మిజోరంలో కూడా శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. మొత్తంగా చూస్తే సెమీఫైనల్స్ కంటే ఫైనల్‌లో తలపడేందుకే అన్ని పక్షాలు సిద్ధపడుతున్నట్టు కన్పిస్తోంది.

కలగూరగంప కాదు

ఈసారి మోడీ, ఆయన నేతృత్వంలోని బీజేపీ ప్రధానంగా మూడు సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇటీవలే ఏర్పడిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ప్రస్తుత బలం కేవలం 144 మంది ఎంపీలు మాత్రమే అయినప్పటికీ అవి గత ఎన్నికల ఫలితాలు. ఈ కూటమి బలం 20 రాష్ట్రాలు, కేంద్ర ...11లో

కేంద్రం నిద్రపోతోందా?

- మణిపూర్‌లో హింస దేశ ప్రతిష్టకు దెబ్బ
- అక్కడి ప్రజలను కలుసుకుంటున్న ప్రతిపక్ష ఎంపీలు

వివరాలు 5లో..

బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు
దుష్ప్రచారం



కీలకమైన ఓ నాయకుడే నా స్థాయిని దిగజారుస్తున్నారు

- ఏ ప్రభుత్వంతోనూ వ్యాపార, భూ ఒప్పందాలు లేవు
- నిరాధారమైన, తప్పుడు కథనాలు బాధ కలిగిస్తున్నాయి : కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటన

వివరాలు 5లో..

బాలుడిని కరిచిన
రెండు పాములు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


(ఫైల్)

నవతెలంగాణ-నవీపేట్

వర్షాలు.. వరదలకు గ్రామాలకు చేరిన పాములు మనుషుల ప్రాణం తీస్తున్నాయి. తల్లిదండ్రుల పక్కన పడుకున్న బాలున్ని అర్ధరాత్రి ఒకేసారి రెండు పాములు కాటేశాయి. దాంతో బాలుడు మృతిచెందాడు.. ఈ విషాద ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని బినోల గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. భూమేష్ భార్య హర్షిత, ఇద్దరు పిల్లలతో కలిసి శుక్రవారం రాత్రి నిద్రపోయారు. అర్ధరాత్రి పెంకుటిల్లు పైనుంచి రెండు పాములు ఇంట్లోకి వచ్చాయి. తల్లిదండ్రుల పక్కలో పడుకున్న రెండేండ్ల బాలుడు మంగలి రుద్రాన్ష్‌ను కాటువేశాయి. బాలుడు ఒక్కసారిగా గట్టిగా ఏడవడంతో తల్లి లేచింది. పాములను పట్టుకొని విసిరేసింది. వెంటనే బాలున్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించినా.. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

నీటి సంబంధిత వ్యాధులు నివారించండి

- మున్సిపల్ అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వర్షాలు తగ్గుముఖం పడుతున్నందున పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. కలుషిత నీరు, నీటి సంబంధ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. శనివారంనాడాయన పురపాలక శాఖ ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన వారికి ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. వరద సహాయ చర్యల్ని సవాలుగా తీసుకొని మరింత నిబద్ధతతో పనిచేయాలని కోరారు. దీనికోసం అవసరమైన సంపూర్ణ సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఇప్పటికే అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ నష్టం జరగకుండా చూసేందుకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పట్టణాల్లో చెరువులు పూర్తిగా నిండాయనీ, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సాగునీటి శాఖతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అవసరాలను బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని సూచించారు. సహాయ కార్యక్రమాల సమన్వయం కోసం హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రధాన రహదారులపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించి, తాత్కాలిక మరమ్మత్తులు ...11లో

వ్యవసాయం తప్పదు

- వారం రోజుల్లోనే ఏడాది వర్షపాతం... మూడోసారి విత్తాల్సిందే
- వరదల నివారణ శాస్త్రీయంగా జరగాలి... భారీగా పంట నష్టం
- వ్యవసాయ, సాగునీటి రంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి



'ఏడాది వర్షపాతం వారం రోజుల్లోనే పడింది.. వరద నివారణ చర్యలు శాస్త్రీయంగా చేపట్టాలి.. రైతులు మూడోసారి విత్తనాలు వేయాల్సిందే.. మళ్లీ వానలొస్తే వానాకాలం సీజన్ పోయినట్టే.. భారీగా పంటలనష్టం ఉండే అవకాశం.. గణాంకాలు సేకరించి రైతులకు సాయం చేయాల్సిన అవసరం ఉందని' ప్రముఖ వ్యవసాయ, సాగునీటి రంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. వెంటనే వర్షాలు, వరద కష్టాలు, నష్టాల నుంచి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరదల నిర్వహణ, పంటల సాగు, నష్టం, సర్కారు సాయానికి సంబంధించి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి బి.బసవపున్నయ్యకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలివి..

ముఖాముఖి

రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయం పరిస్థితి ఎలా ఉందంటారు ?

62 లక్షల ఎకరాల విస్తీర్ణానికిగాను 52 శాతమే సాగైంది. అతివృష్టి, అనావృష్టిని తలపించేలా వర్షాల పరిస్థితి ఉంది. తాజా వానలు 30 నుంచి 40ఏండ్లల్లో ఎప్పుడూ లేదు. వారం రోజుల్లోనే ఏడాది మొత్తం పడాల్సిన వర్షం వచ్చింది. మిల్లీమీటర్ల లెక్కపోయింది. ఇప్పుడు సెంటీమీటర్లల్లో లెక్కించాల్సి వస్తున్నది. పదుల సంఖ్యలో జనం చనిపోయారు. రైతులు రెండుసార్లు ఇప్పటికే విత్తనాలు వేశారు. భారీ వానలతో మూడోసారీ విత్తాల్సి రావచ్చు. వరదనీటి ప్రవాహానికి దారి చూపించే వ్యవస్థ లేదు. ప్రాజెక్టుల గేట్ల నిర్వహణా దారుణంగా ఉంది. ఉన్న నీటిని క్రమపద్ధతిలో బయటకు పంపిస్తే సమస్యలే రావు.

వరదల నివారణకు సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోవాలి ?

భారీ వర్షాలతో వరదలు రాగానే ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు, సిబ్బందిని పంపించి ప్రభుత్వాలు చేతులు దులుపేసుకుంటున్నాయి. మంత్రులు, కార్యదర్శులు వెళ్లి కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నారు. అలా కాకుండా నిధులు, వనరులు అందుబాటులోకి తేవాలి. ఆదేశాల అమలుకు ప్రయత్నించాలి. బాధితులను ఆదుకోవాలి. ఆహారం, వైద్యం, ఇతర సౌకర్యాలు కల్పించాలి. సాంకేతిక అభివృద్ధి జరిగినా, 17 మంది చనిపోవడం ఆవేదన కలిగించేదే. ఇది ప్రభుత్వ అలక్ష్యమే తప్ప, మరోకటికాదు. జపాన్‌లాంటి దేశంలో భారీ వరదలు, భూకంపాలు వచ్చినా మృతుల సంఖ్య ఇంతలా ఉండదు. సర్కారుతోపాటు ప్రజలూ బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రాణ, ఆస్థినష్టం ...11లో



వరద విలయం

నిన్న మోరంచపల్లి.. నేడు పోతన నగర్

- భద్రకాళి చెరువుకు గండి
- కాలనీలను ముంచెత్తిన వరద
- శాంతించిన మున్నేరు
- గోదావరిలో 55 అడుగులకు చేరిన నీరు
- 30 గేట్ల ద్వారా జూరాలకు నీటి విడుదల

వర్షాలు.. వరదలు తగ్గుముఖం పట్టినా.. అవి సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు.. రాత్రి వేళల్లో భారీ వర్షం కురవడం.. ఆ నీటితో చెరువులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించి గ్రామాలను ముంచేశాయి.. ఊహించని పరిణామంతో వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయిన ప్రజల కన్నీటిని ఎవరూ ఆపలేని పరిస్థితి నెలకొంది. పంట పొలాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయి. ఇసుక మేటలతో నిండాయి. వరద తాకిడి తట్టుకోలేక అనేక చోట్ల రహదారులు కోతకు గురికాగా.. వంతెనలు కొట్టుకుపోయాయి. భూపాలపల్లి మండలం మోరంచపల్లిలో చాలా మంది నిరుపేదలు నిరాశ్రయులయ్యారు. ఇప్పుడా కష్టం పోతన నగర్ వాసులకు వచ్చింది. చరిత్ర ప్రసిద్ధికెక్కిన కాకతీయుల కాలం నాటి వరంగల్ భద్రకాళి చెరువుకు గండి పడింది. కాలనీలను ఆ నీరు చుట్టుముట్టింది. మరోవైపు భద్రాద్రిలో గోదావరి 55.70 అడుగులకు చేరుకుంది. మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. రెండ్రోజులు ముంచెత్తిన మున్నేరు వాగు శనివారం శాంతించింది. జూరాల 30 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

వివరాలు 5లో..

'ఆమె'కు ఆరోగ్య పరీక్షలు

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మహిళా క్లీనిక్స్

- 8 రకాల వ్యాధులకు ఉచిత స్క్రీనింగ్, చికిత్స
- ప్రతి రోజూ ఒక్కో సెంటర్‌కు 40-45 మంది బాధితులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్, బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, పట్టణ దవాఖానలతో ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలకు దగ్గరైన వైద్య, ఆరోగ్యశాఖ మరో అడుగు ముందుకేస్తూ.. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తల్లి బాగుంటేనే ఇల్లు బాగుంటుంది అన్నట్టుగా మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'ఆరోగ్య మహిళ' పేరుతో మరో సర్వీస్‌ను మహిళా దినోత్సవం సందర్భంగా అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. ఈకార్యక్రమంలో భాగంగా 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్రతి మంగళవారం 8 రకాల రుగ్మతలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్ జిల్లాలో 85, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 35 కేంద్రాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా 'ఆరోగ్య మహిళ' క్లినిక్స్ కొనసాగుతున్నాయి. ప్రతి మంగళవారమూ ఆయా కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీంతో వ్యాధి ముదరక ముందే చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుంది. ఒక్కో సెంటర్‌లో ప్రతి రోజూ 50 మంది మహిళలకు పరీక్షలు చేయాలనే లక్ష్యం ఉండగా.. ప్రస్తుతం ఒక్కో సెంటర్‌లో 40-45 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. స్క్రీనింగ్ తర్వాత మందులు, ఉచిత చికిత్స అందిస్తున్నారు. శాంపిల్స్ సేకరించి ఫలితాల కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌కు పంపిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, నిమ్స్ వంటి హాస్పిటల్స్‌కు రెఫర్ చేసి చికిత్స అందిస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఈ 'ఆరోగ్య మహిళ' క్లినిక్స్ ఏర్పాటు చేశారు.

మహిళా వైద్య సిబ్బందితోనే పరీక్షలు

స్క్రీనింగ్ క్యాంపుల్లో మహిళా సిబ్బంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. వీరు వ్యాధులను నిర్ధారించడమే కాకుండా భవిష్యత్‌లో మహిళలు దీర్ఘకాలిక రుగ్మతల బారిన పడకుండా సూచనలు, సలహాలు ఇస్తున్నారు. దీంతో దాదాపు చాలా వరకు ఇక్కడే పరిష్కారం దొరుకుతుందని వైద్యులు చెబుతున్నారు. రెండు జిల్లాల వ్యాప్తంగా 18 ఏండ్లు నిండిన మహిళలు సాధారణ రక్తహీనత, అయోడిన్ లోపం, అధిక బరువు, మధుమేహం, అధిక రక్తపోటు, విటమిన్ లోపం, మూత్ర సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, నెలసరి సమస్యలు, సంతాన లేమి, మోనోపాయిజ్, గర్భాశయ ముఖద్వార, రొమ్ము ఓరల్ క్యాన్సర్, థైరాయిడ్, హెచ్‌ఐవీ, ఫోలిక్ యాసిడ్, ఒబెసిటీ,

వంటి దీర్ఘకాలిక రుగ్మతలకు చికిత్స అందిస్తున్నారు. ఆయా వ్యాధి లక్షణాలు పెద్దగా బయటకు కనిపించవు. ఆరోగ్యంపై అవగాహన లేక, చికిత్సకు డబ్బులు లేక చాలా మంది తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఆర్థికపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని మహిళలు తమ సమస్యలను బయటికి చెప్పుకోవడానికి నిరాకరిస్తుంటారు. తీరా వ్యాధి ముదిరి, బయటపడే సమయానికి కోలుకోలేని నష్టం సంభవిస్తుంది.

8 రకాల పరీక్షలు ఇలా..

- మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు చేస్తారు.
- ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్ నిర్వహిస్తారు.
- థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్‌యాసిడ్, ఐరన్‌లోపంతోపాటు విటమిన్ బీ12, విటమిన్ డీ పరీక్షలు చేస్తారు.
- మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు చేస్తారు.
- మెనోపాజ్ దశకు సంబంధించి పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ చేయడంతోపాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- నెలసరి, సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి, వైద్యంతోపాటు అవగాహన కల్పిస్తారు. అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు.
- సెక్స్ సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు చేసి, అవగాహన కల్పిస్తారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తారు.
- బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన కల్పిస్తారు.

ఇలాంటి పరిస్థితులు ఏర్పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల 'మహిళ క్లినిక్స్'ను అందుబాటులోకి తెచ్చింది.

మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. మహిళా క్లినిక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి. 8 రకాల రుగ్మతలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తున్నాం. మరింత మంది మహిళలకు కూడా ఈ మహిళా క్లినిక్స్ గురించి వివరించి అవగాహన కల్పించాలి. తల్లి బాగుంటేనే ఇల్లు బాగుంటుంది అన్నట్టు మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి.

దాక్టర్ జె.వెంకటీ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్

ఇది రొటీన్ కార్యక్రమం కాదు



'ఆరోగ్య మహిళా' రొటీన్ కార్యక్రమం కాదు. మహిళలకు ఉపయోగపడేది. వారు బయటికి చెప్పుకోలేని రుగ్మతలు, సమస్యలకు ఇక్కడ పరిష్కారం లభిస్తుంది. మహిళలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి. మహిళా క్లినిక్‌లను సంప్రదించిన చెకప్‌లు చేయించుకోవాలి. జిల్లాలోని 18 ఏండ్లు దాటిన మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

దాక్టర్ పుట్ల శ్రీనివాస్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

సీపీఎస్‌ను రద్దు చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలి

సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేస్తూ ఈనెల 31న నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని రెండు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57ను రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. 2004, సెప్టెంబర్ ఒకటి కంటే ముందు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలై ఆ తర్వాత నియామకం అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని సీపీఎస్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పునరావాస చర్యలను వేగవంతం చేయాలి

కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ. 10 వేలు ఆర్థిక సాయమందించాలి : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలను వేగవంతం చేయాలనీ, పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించాలనీ, కుటుంబానికి 50కేజీల బియ్యం,రూ.10వేలు ఆర్థిక సాయమందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ గూడేలు, మారుమూల గ్రామాలు, పట్టణాల మధ్య తెగిన రోడ్లు, కరెంట్ సౌకర్యాలను తక్షణం పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వానలకు తడిసి, కూలి పోయిన ఇండ్ల స్థానంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. మొబైల్ వైద్య కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని కోరారు. ప్రతి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలనీ, డ్రైనేజీ కాల్వల పూడిక తీయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామానికి రక్షిత తాగునీటిని అందించాలని కోరారు. వరదల్లో కొట్టుకు పోయి చనిపోయిన వారి కుటుంబాలను ప్రత్యేకంగా ఆదుకోవాలనీ, తల్లి తండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా విద్యను అందించాలని విజ్ఞప్తి చేశారు.

సత్తుపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో కొత్తగా ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు కానున్నది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 కోట్లతో కాలేజీ నిర్మాణానికి అనుమతిలిచ్చినట్టు తెలి పారు. ఇందుకవసరమైన అన్ని చర్య లు తీసుకోవాలని డీఎంఈ, టీఎస్ ఎంఐడీసీ ఎమ్‌డీని ఆదేశించారు.

తొర్రూరులో వంద పడకల ఆస్పత్రి

మహబూబాబాద్ జిల్లా తొర్రూ రులో 100 పడకల ఏరియా ఆస్పత్రి ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ మార్చి 2న రాసిన లేఖను ఆమోదిస్తూ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్త ర్వులు జారీ చేశారు. రూ.36 కోట్లను మంజూరు చేశారు. ఆస్పత్రి నిర్మాణా నికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని టీవీవీపీ కమిషనర్ ను ఆదేశించారు.

భారీగా పెరగనున్న రోడ్ల డ్యామేజీ నష్టం

రూ. 1047.68 కోట్లకు చేరిక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీరాజ్ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. శనివారం నాటి లెక్కల ప్రకారం 1064 రోడ్లు ధ్వంసమయ్యా యి. 1416.36 కిలోమీటర్ల మేర రోడ్లు కోసుకుపోవడం, తెగడం, కొట్టుకుపోవడం, కల్వర్లు బ్రిడ్జీలు కూలిపోవడం తదితర పరిణా మాలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా తక్షణం ప్రభుత్వం రూ.1047.68 కోట్లు కేటాయిస్తే తప్ప వాటిని పునరుద్ధరించే అవ కాశం లేదని సమాచారం. ఈమేరకు పంచా యతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ ఉన్నతాధికా రులు ప్రతిరోజూ జరిగిన నష్టం వివరాలతోపాటు పునరుద్ధరణకు కావాల్సిన నిధుల సమాచారంతో కూడిన నివేదికను సర్కారుకు పంపుతున్నారు. ఇందులో ఎక్కువగా రోడ్ల ధ్వంసానికి రూ.539.44 కోట్లు, కల్వర్టు బ్రిడ్జీల మరమ్మతుల కోసం రూ.380.57 కోట్లు అవసరమని అధికారిక సమాచారం. అలాగే రోడ్లు పూర్తిగా తెగిపోయిన వాటికి రూ.57.95కోట్లు కావాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

మా కుమారుడి వివాహానికి రండి

కేసీఆర్‌కు బ్రహ్మానందం దంపతుల ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో జరగబోయే తమ కుమారుని వివాహానికి హాజరు కావాల్సిందిగా బ్రహ్మానందం దంపతులు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావును ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని ప్రగతి భవన్‌లో వారు సీఎంను కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భం గా ఆ దంపతులకు సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'రేవంత్ చిల్లర రాజకీయాలు మానుకో...'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. ప్రతిపక్షాలను, పేద ప్రజలను హీనమైన పద జాలంతో దుర్భాషలాడడం, అందరినీ కించపరచడం మంచిది కాదని చెప్పారు. ఇలాగే మాట్లాడతానంటే ఆయనకు ప్రజలు కర్ర కాల్చి వాత పెడతారని తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణకు చర్యలు తీసుకోండి

- సీఎం కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 50 వేల మంది కార్మికులు ఏండ్లుగా పనిచేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో కారోబార్లు, డ్రైవర్లు, వాచ్‌మెన్స్, స్వీపర్లు, బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 14 డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల ఆరు నుంచి సమ్మె ప్రారంభించారని గుర్తు చేశారు. 24 రోజులు గడుస్తున్నా సీఎం, సంబంధిత మంత్రిగానీ జేఏసీ నాయకత్వంతో చర్చించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయకపోవడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం వెంటనే జేఏసీతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలనీ, పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని కోరారు. వర్షాకాలం కావడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమ్మె వల్ల గ్రామాల్లో పరిశుభ్రత తీవ్రంగా లోపించిందని వివరించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్రైస్తవులకు రూ.ఒక లక్ష ఆర్థిక సహాయం

- ఆగస్టు 14లోగా దరఖాస్తు చేసుకోవాలి
- రాష్ట్ర క్రైస్తవ మైనార్టీల ఆర్థిక సహాయ సంస్థ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థిక సహాయ పథకం కింద క్రైస్తవులకు వంద శాతం సబ్సిడీతో ఏదైనా ఒక యూనిట్ నెలకొల్పుకునేందుకు రూ.ఒక లక్ష అందించనున్నట్టు రాష్ట్ర క్రైస్తవ మైనార్టీల ఆర్థిక సహాయ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కాంతి వెస్లీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల వారైతే ఏడాదికి రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.రెండు లక్షలలోపు ఆదాయం కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తుదారుల వయస్సు 21 ఏండ్ల నుంచి 55 ఏండ్ల లోపుండాలి. ఊఊ.ంశీఎఎఎం.ట్రశీఙ.ఱఅ లో ఈ నెల 31 నుంచి ఆగస్టు 14లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ అధికారిని గానీ లేదా 040-2339 1067లో సంప్రదించాలని ఆ సంస్థ సూచించింది.

ఉరి తాళ్లు వేసుకుని జీపీల నిరసన

- కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



నవతెలంగాణ- విలేకరులు

నల్లగొండ జిల్లా తిప్పర్తిలో జీపీ కార్మికులు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు. మునుగోడులో 'బతుకమ్మ మా బతుకులు మార్చమ్మ' అంటూ బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కేతెపల్లిలో పెరిగిన ధరలకు ఈ వేతనం ఏమిటికీ సరిపోదు, మేము గడ్డి తిని బతకాల్సిందే అని వరిగడ్డి నోట్లో పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. చండూరులో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. చిట్యాలలో గుండు చేయించుకొని నిరసన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో జీపీ కార్మికులు ఎంపీడీవో ఆఫీసు నుంచి ప్రదర్శనగా వచ్చి బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్ఎస్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాలు సంఘీభావం తెలిపాయి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. కడ్తాల్‌లో చేపట్టిన సమ్మెకు రైతుసంఘం, గొర్ల మేకల పెంపకందారుల సంఘాల జిల్లా నాయకులు కాస్తుల వెంకటయ్య, జల్లెల్ల పెంటయ్య జీపీ కార్మికులకు మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు పడుకుని నిరసన తెలిపారు.

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో ముంపు గ్రామాల్లో పర్యటనకు వచ్చిన ఎంపీ నామా నాగేశ్వరరావుకు జీపీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కల్లూరులో మానవహారం నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చిన కార్మికులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తూ.. పారిశుధ్య పనులు చేశారు. అశ్వారావుపేటలోనూ పారిశుధ్య పనులు చేసి నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం కేంద్రంలో వాంటావార్పు చేసి, భైంసా అంతర్రాష్ట్ర రహదారిపై కూర్చొని భోజనం చేశారు. దస్తురాబాద్ మండల కేంద్రంలో కార్మికులు వాంటావార్పు చేసి తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరసన తెలిపారు.

జంట జలాశయాల్లోని నీరు దిగువకు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌కు వరద నీరు పోటెత్తింది. అయితే, శనివారం వరద ప్రవాహం కాస్త తగ్గింది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ రెండు గేట్లను రెండు అడుగుల మేరకే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం హిమాయత్‌సాగర్‌కు 1300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 1350 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50అడుగులు కాగా, ప్రస్తుతం 1761.70 అడుగులుగా ఉంది. ఉస్మాన్‌సాగర్ (గండిపేట్) రిజర్వాయర్‌కు 500 ఇన్‌ఫ్లో రాగా, 852 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా, ప్రస్తుతం 1787.90 అడుగులుగా ఉంది. నాలుగు గేట్లను రెండు అడుగుల వరకు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్

న్యూఢిల్లీ : బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు కొత్త జాతీయ కార్యవర్గ సభ్యులను బీజేపీ శనివారం ప్రకటించింది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి జాతీయ కార్యవర్గంలో మార్పులు చేర్పులను చేశారు. ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సెక్రటరీలుగా ఉన్న ఎక్కువ మంది ఆఫీసు బేరర్లను కొత్త జాబితాలో కొనసాగించారు. మొత్తంగా 13 మంది ఉపాధ్యక్షులు, తొమ్మిది మంది ప్రధాన కార్యదర్శులు, 13 మంది సెక్రటరీలు ఈ జాబితాలో ఉన్నారు. తొమ్మిది మంది ప్రధాన కార్యదర్శులు కొత్తగా ఇద్దరు రాగా, ఏడుగురు పాతవారే తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. రాష్ట్ర ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి సివి రమణ్ సింగ్‌లకు జాతీయ స్థాయి బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. యూపీ నుంచి రాధామోహన్ అగర్వాల్, రాజస్థాన్ నుంచి సునీల్ బన్సాల్, మధ్యప్రదేశ్ నుంచి కైలాష్ విజయవర్గీయలకు జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. మొత్తంగా 8 మందిని జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో నియమించారు. ఏపీకి చెందిన సత్యకుమార్‌ను జాతీయ కార్యదర్శిగా, తెలంగాణకు చెందిన డికె అరుణను జాతీయ ఉపాధ్యక్షులు నియమించారు.

జీవో ఉన్నా..అమలు సున్నా

- ఉపకారవేతన పెంపు లేక ఎనిమిదేండ్లు
- చాలకపోవటంతో హోమియో వైద్యవిద్యార్థుల ఇబ్బందులు
- ఇక సర్కారుతో తాడోపేడో తేల్చుకుంటామంటున్న పీజీలు, హౌస్ సర్జన్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'దేశ వైద్యారోగ్య రంగంలో రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. చాలా కొలమానాల్లో నిటిఅయోగ్ ర్యాంకుల్లో మొదటి స్థానాన్నికైవసం చేసుకుంది. కేరళ, తమిళనాడు తర్వాత పలు విషయాల్లో మనమే అగ్రగామి. అయితే ఈ మూడో స్థానంతో సరిపెట్టుకోవద్దు. మొదటి స్థానంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి....' ఇది వైద్యారోగ్యశాఖ మంత్రి దగ్గర నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ తమ సిబ్బందికి పదే పదే చెప్పే మాటలివి. తెలంగాణ వైద్యరంగంలో దేశంలోనే మూడో స్థానంలోకి రావడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలతో పాటు వైద్య, నర్సింగ్ సిబ్బంది చేసిన కృషి కూడా కారణం. కానీ అదే సిబ్బంది తమకున్న అనేక సమస్యలను ఉన్నతాధికారుల నుంచి ప్రజా ప్రతినిధులు, మంత్రుల వరకూ ఏకరవు పెడుతున్నా పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

వైద్యవిద్యార్థులకు ప్రతి రెండేండ్లకు ఒకసారి 15 శాతం చొప్పున ఉపకారవేతనాలు పెంచాలనే ఉత్తర్వులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి అమల్లో ఉన్నాయి. అవి అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా ఆయుష్ విద్యార్థులకు కూడా వర్తిస్తాయి. హైదరాబాద్ రామాంతపూర్‌లోని హోమియో వైద్య కళాశాలలో చదువుకుంటూ సేవలందిస్తున్న పీజీలు, హౌస్ సర్జన్లకు చివరిసారిగా 2014లో (తెలంగాణ ఏర్పడక ముందు) 15 శాతం ఉపకార వేతనం పెంపును అమలు చేశారు. ఆ పెంపుతో హౌస్ సర్జన్లకు నెలకు రూ.10,500, పోస్ట్ గ్రాడ్యుయేట్లు మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ.23,800, రెండో సంవత్సరం విద్యార్థులకు రూ.25,128, మూడో ఏడాది విద్యార్థులకు రూ.26,450 ఇస్తున్నారు. గత ఎనిమిదేండ్లతో పెంపుదల జీవోను అమలు చేయకపోవడంతో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని తట్టుకుంటూ వారు వీటితోనే నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పీజీలుకు వరసగా రూ.35,589, రూ.37,566, రూ.39,543 ఇస్తుండగా, దేశంలో మొదటి స్థానంలో ఉన్న కేరళలో పీజీలకు వరసగా రూ.42,560, రూ.45,600, రూ.48,640 ఇస్తున్నారు. ప్రస్తుతం హోమియో వైద్యకళాశాలలో 109 మంది పీజీలు ఉండగా, వంద మంది వరకు హౌజ్ సర్జన్ సేవలందిస్తున్నారు.

ముగ్గురు మంత్రులకు వినతులు

తమకు ఉపకారవేతనాలను పెంచాలని పీజీలు, హౌజ్ సర్జన్లు గతంలో వైద్యారోగ్యశాఖ మంత్రులుగా పని చేసిన డాక్టర్ సి హెచ్.లక్ష్మారెడ్డి, ఈటల రాజేందర్‌తో పాటు ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును సైతం కలిసి విన్నవించుకున్నారు. గతంలో పని చేసిన ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేయడమే కాకుండా 2018 ఎన్నికల ముందు కూడా కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఏడాది జరిగే కళాశాల వార్షికోత్సవానికి వచ్చే స్థానిక ఎమ్మెల్యేతో పాటు ముఖ్యనేతల ముందు కూడా తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. నేతలు కలవడం, హామీలివ్వడం వరకే పరిమితం కాగా అవి అమలుకు మాత్రం నోచుకోవటం లేదు. దీంతో విద్యార్థులు ఈ సారి ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. గత నాలుగు రోజులుగా ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నాలతో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

వారం రోజుల్లో అమలు చేయాలి

ఉపకారవేతనాల పెంపు జీవోను వారం రోజుల్లో అమలు చేయాలని హోమియో వైద్య విద్యార్థులు ప్రభుత్వానికి హెచ్చరించారు. లేకపోతే విధులు బహిష్కరిస్తామని విద్యార్థి నాయకులు డాక్టర్ సంతోష్, డాక్టర్ శివరాజు, డాక్టర్ వినయ్, డాక్టర్ అశీష్, డాక్టర్ షణ్ముఖ్, డాక్టర్ రతన్ హెచ్చరించారు. 2014తో పోలిస్తే నిత్యావసర వస్తువులు, వసతి సౌకర్యాలు, ప్రయాణ ఖర్చులు, ఇతర ఖర్చులు పెరిగిపోయాయనీ, పాత ఉపకారవేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

మహిళల నగ్న ఊరేగింపు అమానవీయ చర్య

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-అంబర్ పేట

మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించడం అమానవీయ చర్య అని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర సీఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ.. కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట శ్రీ రమణ థియేటర్ చౌరస్తా వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో బీజేపీ తన రాజకీయ లబ్ది కోసం కుకి ఆదివాసీ గిరిజనులపై మోతీలను ఉసిగొల్పి దారుణ ఘటనలకు కారణమ వుతోందని చెప్పారు. ఆ రాష్ట్ర ముఖ్య మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలని అమలు చేయడం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని.. దానికి నిదర్శనమే మణిపూర్ ఘటనలని అన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం, టర్కీ భూకంపం, గుజరాత్ వరదలపై స్పందించిన మోడీ మణిపూర్ ఘటనపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు.

దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. మణిపూర్‌లో శాంతి చర్యలు చేపట్టకపోతే రాబోయే కాలంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

అలాగే, తెలంగాణలో బీజేపీ పెరిగితే మరిన్ని మణిపూర్‌లు అవుతాయన్నారు. మణిపూర్ ఘటనపై స్పందించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అడిగిన విలేఖరిని అవమానించారని చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.దశరథ్, జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు, నాయకులు ఎం.మహేందర్, సీఐటీయూ జిల్లా నాయకులు జి.రాములు, కేవీపీఎస్ అంబర్‌పేట జోన్ నాయకులు మల్లికార్జున్, యు.గోపి, వై. శ్రీనివాస్, గోవిందు, ఆంజనేయులు, బి గోపి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 204 అంబులెన్సులు, 228 అమ్మ ఒడి వాహనాలు

- అదనంగా 34 పార్థివ వాహనాలు అందుబాటులోకి
- మొత్తం 466 వాహనాలు ఆగస్టు 1న ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 108 అంబులెన్సులు, 102 (అమ్మ ఒడి), హర్సె (పార్థివ వాహనాల) సేవల కోసం కొత్తగా 466 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు వైద్యారోగ్య శాఖ నూతనంగా 204 అంబులెన్సులు, 228 అమ్మ ఒడి వాహనాలు, 34 హర్సె వాహనాలను కొనుగోలు చేసింది. వీటిని ఆగస్టు 1వ తేదీన ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలందిస్తున్న 108, 102, పార్థివ వాహనాల పనితీరుపై మంత్రి హరీశ్ రావు గత నెలలో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

వాహనాల పనితీరు, రిపేర్లు, మెయింటెనెన్స్ వంటివి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదికలు రూపొందించుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కాలం చెల్లిన అంబులెన్సులు, అమ్మ ఒడి, హర్సె వాహనాలను వెంటనే తొలగించి, వాటి స్థానంలో నూతన వాహనాలను చేర్చాలని ఆదేశించారు. తద్వారా గర్భిణులు, రోగులను వేగంగా దవాఖానలకు చేర్చేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఈ మేరకు అధికారులు కొత్త వాహనాలను కొనుగోలు చేసి, బ్రాండింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 426 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి. 175 అంబులెన్సుల స్థానంలో కొత్తవి రిప్లేస్ చేస్తుండగా, మరో 29 అంబులెన్సులను అవసరమున్నట్టు గుర్తించిన కొత్త ప్రాంతాల్లో వినియోగించనున్నారు. ఈ 204 కొత్తవి కలిపితే రాష్ట్రంలో 108 అంబులెన్సుల సంఖ్య 455కు పెరగనున్నది. గర్భిణుల కోసం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి వాహనాలు (102 వాహనాలు) ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 300 ఉపయోగంలో ఉన్నాయి. ఇందులో 228 వాహనాలకు కాలం చెల్లిపోవడంతో వాటిని తొలిగించి, వాటి స్థానంలో కొత్తగా 228 వాహనాలను రిప్లేస్ చేస్తున్నారు.

ప్రధాన ప్రభుత్వ దవాఖానల్లో మరణించినవారి పార్థివ దేహాలను స్వస్థలాలకు తరలించడం కోసం ప్రభుత్వం ఉచితంగా హర్సె వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ హర్సె వాహనాలు ప్రస్తుతం 50 ఉన్నాయి. ఇందులో 34 వాహనాలకు కాలం చెల్లిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా 34 వాహనాలను వీటి స్థానంలో రిప్లేస్ చేస్తున్నది.

మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు కొత్తగా సమకూర్చుకున్న మూడు రకాల వాహనాలకు సరికొత్తగా బ్రాండింగ్ చేశారు. 108, 102 అనే హెల్ప్‌లైన్ సేవల నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ ఫోటో, తెలంగాణ ప్రభుత్వ లోగో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అమ్మఒడి వాహనాలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. వాహనం వెనుక భాగంలో అమ్మకు ఆత్మీయతతో.. బిడ్డకు ప్రేమతో.. అనే ట్యాగ్‌లైన్‌తో పాటు, సీఎం కేసీఆర్ ఓ బాలింతకు కేసీఆర్ కిట్‌ను అందిస్తున్న ఫొటోను ముద్రించారు. చూడటానికి ఆహ్లాదంగా ఉండే రంగుల్లో, అమ్మ ఒడి కార్యక్రమ లోగో, శిశువు ఫొటోలతో 102 వాహనాలు కొత్త లుక్‌తో అందుబాటులోకి రానున్నాయి. పార్థివ వాహనాల సేవలు ఉచితంగా అందిస్తామనే విషయాన్ని తెలిపే విధంగా ఉచిత సేవ అని ముద్రించారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తెలంగాణ రైతు సంఘం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల ఎకరాల్లో పంటలు మునిగిపోయాయని పేర్కొంది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరింది. నష్టపోయిన ఆహార ధాన్యాలకు ఎకరాకు రూ.10వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి శోభన్ విలేకర్లతో మాట్లాడారు. అధిక వర్షాలు, వరదలతో పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయలు, సోయా, వేరుశనగ, కంది, పెసర, పంటలు మునిగి పోయాయని తెలిపారు. రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడం వల్ల రైతులకు భరోసా లభించడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల వల్ల ఏటా లక్షల ఎకరాల్లో పంటల నష్టం జరుగుతున్నదని అన్నారు. ఇందులో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని పేర్కొన్నారు. తక్షణమే వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు జరిగిన నష్టాలపై అంచనా వేసి కేంద్ర బృందాన్ని పిలవాలని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాలకు పరిహారం చెల్లించేందుకు 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం జరిగిన నష్టంపై స్పందించకపోతే రైతాంగాన్ని కూడగట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

వరద బాధితులకు అండగా నిలవండి

- సహాయక, పునరావాస చర్యల్లో పాల్గొనాలి
- పార్టీ శ్రేణులకు టీడీపీ అధ్యక్షులు కాసాని పిలుపు



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరదల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారికి సహాయ, పునరావాసం అందించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ నుంచి రాష్ట్రంలో అన్ని జిల్లాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల వారీగా వరద, పంట నష్టం వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు.

భారీ వర్షాలతో గోదావరి పరివాహక జిల్లాల్లో అల్లకల్లోలంగా మారిందన్నారు.ప్రాణాలు కోల్పోయిన కుటుంబా లకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన సహాయం అందజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర నాయకులు షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అభ్యర్థులు ఒకే జిల్లాలో పరీక్ష రాయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల బోర్డు ఆధ్వర్యంలో వచ్చేనెల ఒకటి నుంచి 23 వరకు నిర్వహించే రాతపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒకే జిల్లాలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గురుకుల పోస్టుల పరీక్షలను నిర్వహిస్తున్న తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. దీంతో అభ్యర్థులకు ఒక్కో పరీక్ష ఒక్కో జిల్లాలో పరీక్షా కేంద్రాలను కేటాయించడంతో వారు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. చాలా మంది అభ్యర్థులకు మూడు పరీక్షలను మూడు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించడంతో వారు అయోమయానికి లోనవుతున్నారని తెలిపారు. చాలా మంది అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. ఒకే జిల్లాలో పరీక్షా కేంద్రాలను కేటాయించాలని కోరారు. ఒక పరీక్షకు, మరో పరీక్షకు రెండు, మూడు రోజుల వ్యవధి ఉండాలని సూచించారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు : పీవైఎల్

గురుకులాల్లో జేఎల్, డీఎల్, టీజీటీ, పీజీటీ, లైబ్రేరియన్ ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణ కోసం కేంద్రాల కేటాయింపు చూస్తుంటే నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నట్టు ఉందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె కాశీనాథ్, కెఎస్ ప్రదీప్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష కేంద్రాలు ఒక్కో పరీక్షకు ఒక్కో కేంద్రంలో పెట్టి, అభ్యర్థులకు పరుగు పందెం పెట్టినట్టుందని పేర్కొన్నారు. పరీక్ష రాసే వారిలో వికలాంగులు, గర్భిణులు, బాలింతలు, సైతం ఉంటారని తెలిసి కూడా ఇలా కేంద్రాలు కేటాయించడం సరైంది కాదని విమర్శించారు. ఈ సమస్యను గురుకుల బోర్డ్ కన్వీనర్ మల్లయ్య బట్టుకి గతనెల 30నే తాము వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. అయినా పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని తెలిపారు. ఇలా కేంద్రాలు వేసి, అభ్యర్థులు కోర్టుకి వెళ్లేలా చేసి, పరీక్షలు జరగకుండా చేసేలా చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. తక్షణమే రోజుకి రెండు విడతల్లో పరీక్షలను జిల్లా కేంద్రాల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అక్కడక్కడా సాధారణ వర్షాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణా రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ప్రత్యేకించి వాతావరణ హెచ్చరికలు ఏమీ లేవని పేర్కొన్నారు.

సుభాష్ ముండా హత్య అత్యంత దారుణం

- దుండగులను కఠినంగా శిక్షించాలి
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్(ఏఎఆర్ఎం) జాతీయ నాయకులు సుభాష్ ముండా హత్య అత్యంత దారుణమనీ, దీనికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిడియం బాబూరావు, పూసం సచిన్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జార్ఖండ్‌లోని ఆదివాసీల హక్కులకోసం సుభాష్‌ముండా నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. ఆదివాసీల జీవనోపాధికోసం పేదరిక నిర్మూలన, అన్యాయాలకు వ్యతిరేకంగా వారిని సంఘటితం చేయటానికి అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. భూ నిర్వాసితులకు, జమీందారీ అణచివేతకు వ్యతిరేకంగా ఆదివాసీలను సంఘటితం చేశారని పేర్కొన్నారు. 1960వ దశకంలోనే ఆయన తాత సుక్ర ముండా భూస్వాములకు వ్యతిరేకంగా దళదాలీలో అనేక భూ పోరాటాలకు ఆదివాసీలకు నాయకత్వం వహించారని తెలిపారు. సుభాష్‌ముండా2010 నుంచి జార్ఖండ్‌లోని ఛోటానాగ్‌పూర్ ప్రాంతంలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ ప్రాంతీయ కన్వీనర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

- సమ్మెను విరమింపచేయాలి
- సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. ఇటీవల భారీవర్షాలకు 18 మంది మరణించగా, పది మంది గల్లంతయ్యారని తెలిపారు. వందలాది పశువులు వరదల్లో కొట్టుకుపోయాయని పేర్కొన్నారు. వరదలు, భారీ వర్షాల కారణంగా చెత్తపేరుకుపోయి గ్రామాల్లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ఫలితంగా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియాలాంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. పరిసరాలను శుభ్రం చేయడంలో గ్రామపంచాయతీ సిబ్బందిదే కీలకపాత్ర అని వివరించారు. గత 23 రోజులుగా వారు సమ్మెలో ఉన్నారని గుర్తు చేశారు.



నగరాలలో చెరువులు, కుంటలు రియలెస్టేట్ వ్యాపారుల కబ్జాలకు గురయ్యాయి. వర్షాలు వస్తే నీరు పారటానికి కాలువలూ మూసుకుపోయి ఉంటున్నాయి. ఇక చెరువుల్లోనూ ఇండ్లు మొలిచాక నీటికి మాత్రం నివాసం అక్కరలేదా! ప్రజలంతా ఆలోచించాల్సిన సమస్య. నష్టపోయిన ప్రజలకు ఓదార్పునిచ్చి, ప్రభుత్వం వారిని ఆదుకోవాలి వరదలను శాశ్వత ప్రాతిపదికన అరికట్టటానికి ప్రణాళికలు వేయాలి.

కన్నీటి వరద

సంపాదకీయం

"మనిషి ఊపిరి కొయ్యడానికి కత్తే కానక్కరలేదు, జీవితాల్ని చెరచడానికి మరుక్షణం మృత కళేబరం చెయ్యడానికి, తుపాకులూ యుద్ధాలే రానక్కరలేదు. నూరేళ్ల నవ్వుతూ తుళ్లుతూ వేయిరేకలతో వెలుగులు వెదజల్లుతూ పుష్పించవలసిన బతుకుల్ని భగ్గున మండించడానికి పెట్రోలే అక్కర్లేదు. దాహం తీర్చి ప్రాణం నిలబెట్టవలసిన నీరే గొంతు పిసగ్గలదు" అని 1977 నాటి దివి సీమలో తుఫాను బీభత్సాన్ని గూర్చి 'కొయ్యగుర్రం' కావ్యంలో నగ్నముని పేర్కొంటాడు. నిజమే కదా! ప్రాణం నిలిపే నీళ్ల ప్రాణాన్ని తీస్తాయి కూడా! అయితే కారకులు, కాపాడవలసినవారు మాత్రం కొయ్యగుర్రాలై కదలక మెదలక నిలుస్తారని కావ్య సారాంశం! ఇది ఇప్పటికీ వాస్తవం. మానవుని మేధోపరిజ్ఞానం వల్ల తుపానులు వస్తాయని ముందుగానే తెలుసుకోగలిగాడు. తుఫానులొస్తే ముంచెత్తుతాయనీ తెలుసు. మరి ఎదుర్కోవడానికి ఎందుకు సిద్ధపడటం లేదనేది ఒక సమస్య! ఇక రెండవది అసలు ఇంత బీభత్సాన్ని సృష్టించే వరదలు ఎందుకు పెరుగుతున్నాయి? ప్రకృతిలో వచ్చిన మార్పులకు కారకులెవ్వరన్నది మౌలిక ప్రశ్న.

వర్షం ప్రకృతి. వరద స్వయంకృతి. సూర్యుడు ప్రకృతి. మండి మసైపోవటం మన స్వయంకృతి. లేదంటే ప్రకృతి ఎందుకో మానవ సమూహం మీద మహాద్వేషాన్ని వెల్లగక్కుతోంది. కోపావేశంతో మనుషుల్ని ముంచెత్తుతోంది. నిజమే మరి! ఎందుకు! ప్రకృతే మన ఎదుగుదలకు, అభివృద్ధికి కారణ భూతమయ్యింది. ప్రకృతే అండగా లేకపోతే మనమెక్కడ? మరి ప్రకృతికి మనమేమిచ్చాము! పొందినదాంట్లో పదోవంతన్నా ప్రకృతికిస్తున్నామా లేదు. అడవుల్ని మింగాం. గనులను తవ్వాం. నదులనూ, చెరువులనూ, కాలువలనూ కబ్జా చేస్తున్నాం కదా! నేలను సరుకును చేసి వ్యాపారం కొనసాగిస్తున్నాం. చెట్లను నరికాం, పుట్టలు తవ్వాం. ప్లాస్టిక్ భూతాన్ని గుట్టలుగా పడదోసాం. భూమితల్లి కడుపు చీల్చి ఖనిజాలను అమ్మేసాం. ఇంకా ఎన్నెన్నో చేశాం. కానీ ఒక్క పచ్చని కలనైనా కన్నామా! లేదు లేదు. ప్రకృతికి మాత్రం కోపం రాదా! ప్రతీకారజ్వాల ఎగయదా! అమ్మకు కూడా కోపం రాదూ! వస్తుంది. నియమం తప్పితే, నీతి తప్పితే, ధర్మం తప్పితే ఎవ్వరికైనా కోపం వస్తుంది. ప్రకృతిని నిందించి ఫలితం లేదు. అన్నిటికి కారకుడు మనిషే, మానవ సమూహమే. దుఃఖం ఎక్కడుందో దాని కారణాలూ అక్కడే ఉన్నాయి. ఇప్పుడు కనీసంగా కన్నీళ్లను తుడవాల్సిన వాళ్లే కరువైనారు.

మొన్న బుధవారం రాత్రి ఎప్పటిలాగే వర్షం వస్తోందని భావించారు. వానలు పడటం లేదని బెంగపడిన వాళ్లకు ఊరడింపనే అనుకొన్నారు. అకస్మాత్తుగా వరద మొదలైంది. భూపాలపల్లి జిల్లా మోరంచగ్రామం ఆసాంతం వరదలో మునిగింది. నిద్రిస్తున్న ఇండ్లలోకి నీళ్లు ముంచెత్తాయి. 280 కుటుంబాలు నీళ్లపాలయ్యాయి. తెల్లారేసరికి ఏమున్నది వాళ్లకి వరద బురద తప్ప. వాళ్లుతినే బియ్యం కొట్టుకుపొయ్యాయి. దుస్తులు, విత్తనాలు, ఎరువులు, దాచుకున్న నగలు, పశువులు సమస్తమూ కొట్టుకుపోయాయి. మనుషులూ కొట్టుకుపోయారు. ఊరు ఊరంతా నిరాశ్రయలయ్యారు ఎన్ని కన్నీళ్లు గుండెకోతను ఆపుతాయి. ఇక ఏటూరునాగారం ములుగు జిల్లా జంపన్నవాగు వరద దిగ్బంధనంలో కొట్టుకుపోయిన ఎనిమిదిమందీ మృతదేహాలై బయటపడ్డారు. ఉమ్మడి వరంగల్‌జిల్లా, ఉమ్మడి ఖమ్మంజిల్లా, కరీంనగర్, నిజామాబాద్ వరదలతో హెూరెత్తింది. ఇప్పటికే పదిహేడుమంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మరెంతో మంది ప్రజల బతుకుల్లో కన్నీళ్లు ముంచెత్తుతున్నాయి. సర్వం కోల్పోయారు. దుఃఖమొకటే వారికి తోడుగా మిగిలింది.

నగరాలు కూడా వరదలమయమవుతున్నాయి. బురదవీధులు తాండవమాడుతున్నాయి. మహానగరమైన భాగ్యనగరమూ అందుకు మినహాయింపు కాదు. ఎక్కడ నాళాలుంటాయో, ఎక్కడ గుంతలు దిగబడతాయో, ఎక్కడ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి. నగరంలోని అనేక ప్రాంతాలు, బురదలతో నిండిపోయి ఉన్నాయి. మురికివాడల బాధలు వర్ణనాతీతం. వరదలు చేసిన నష్టం ఎంతో ఇంకా అంచనా వేయాలి. వేలాది పంట పొలాలు ఇసుకమేటలు వేసి, నీళ్లలో మునిగి నష్టం జరిగింది. పాతిండ్లు, గోడలు కూలి చనిపోయినవారూ, నిరాశ్రయులూ ఉన్నారు. జాతీయ రహదారులనేకం వరదకు కొట్టుకునిపోయాయి. ఇక గ్రామాల మధ్య దారులు మూసుకుపోయాయి. చుట్టుముట్టిన నీటి నుండి మనుషుల్ని కొందర్ని రక్షించి ఒడ్డుకు చేర్చినా, వారి భవిష్యతేమిటి? నిరాశ్రయులైన వేలాది మందికి ఆశ్రయం కల్పించడం ఆదుకోవడం తక్షణావసరం. ఇక పోలవరం ప్రాజెక్టుతో మునిగిపోయే ప్రాంతాల గోస ఇలాంటి వరదల్లో మరింత పెరుగుతుంది. ఇది ప్రతిసారీ కొనసాగే ఘోష.

నగరాలలో చెరువులు, కుంటలు రియలెస్టేట్ వ్యాపారుల కబ్జాలకు గురయ్యాయి. వర్షాలు వస్తే నీరు పారటానికి కాలువలూ మూసుకుపోయి ఉంటున్నాయి. ఇక చెరువుల్లోనూ ఇండ్లు మొలిచాక నీటికి మాత్రం నివాసం అక్కరలేదా! ప్రజలంతా ఆలోచించాల్సిన సమస్య. నష్టపోయిన ప్రజలకు ఓదార్పునిచ్చి, ప్రభుత్వం వారిని ఆదుకోవాలి వరదలను శాశ్వత ప్రాతిపదికన అరికట్టడానికి ప్రణాళికలు వేయాలి.

అవిశ్వాసంతో మోడీ సర్కారుకు రాజకీయ సవాలు



తెలకపల్లి రవి

మణిపూర్ ఘోరదురంతాలపై ప్రకటన చేయడానికి, చర్చ జరపడానికి నిరాకరిస్తున్న ప్రధాని మోడీ వైఖరితో పార్లమెంటు విలువైన కాలం వృథా అయిపోతున్నది. మణిపూర్ పుత్రికలపై జరిగిన అమానుషానికి దేశమంతా సిగ్గు పడాలని చెప్పిన మోడీ అదే మాట సభలో చెప్పడానికి సిద్ధం కాకపోవడం ఇంతకు కారణమైంది. చర్చకు మొహం చాటేస్తున్న మోడీని దారికి తేవడానికి, మణిపూర్‌తో సహా దేశ పరిస్థితిని సాకల్యంగా చర్చించడానికి ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో ఈ ఎత్తుగడకు బ్రేక్ పడింది. నోటీసును ఆమోదించి కూడా చర్చకు సమయం నిర్ణయించకుండా కాలయాపన చేయడంలో బీజేపీ సర్కారు డొల్లతనం వెల్లడైపోయింది. తాము చర్చకు సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షాలు ముందుకు రాలేదని హోంమంత్రి అమిత్‌షా ఆరోపించడం ఇందులో భాగమే. వాస్తవానికి ఈ వ్యవహారంలో రెండవ ప్రధానపాత్రధారి అమిత్ షానే, హోంమంత్రిగానూ, ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ బాధ్యుడుగానూ ఆయనకు కీలకమైన బాధ్యత ఉంది. మహిళలపై సామూహిక అత్యాచారం మే3-4 తేదీల్లో జరిగితే మరో పదిహేను రోజుల తర్వాత పర్యటనకు వెళ్లింది ఆయనే, ఇప్పుడు తెలిసివస్తున్న సమాచారం ప్రకారం అప్పటికే ఆ దారుణఘటనపై పోలీసు స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదైంది. బాధితులే వచ్చి ఫిర్యాదు చేశారు. ఒక కల్లోలిత రాష్ట్రంలో ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత కూడా పరిస్థితి తెలుసుకోలేకపోవడం హోంమంత్రి అసమర్థతకు అద్దం పడుతుంది. నిఘా సంస్థలకు ఆధ్వర్యం వహించే మంత్రికి ఈశాన్య రాష్ట్రంలో ఎగుస్తున్న మంటలు కనిపించలేదంటే ఎలా విశ్వసించడం? అక్కడకు పర్యటనకు వెళ్లినప్పుడైనా ప్రభుత్వం పోలీసుశాఖ నిఘా వర్గాలు చెప్పలేదా?

> దేశవ్యాపితంగా ఇంతగా ఆగ్రహావేశాలు రగిలించిన ఈ కేసులోనే కేంద్రం చేసిందేమిటి? ఆ రోజు వీడియో తీసిన వ్యక్తిని అరెస్టు చేశారట! జరిగింది షూట్ చేసి దేశమంతా అందుబాటులోకి తెచ్చినందుకు కేసు నమోదు చేశారట. ఇదే గాక ఇలాంటి ఘటనలు ఎలా ఎన్ని జరిగాయో దర్యాప్తు చేసే బాధ్యత సిబిఐకి అప్పగించారట! ఏదో సామెత చెప్పినట్టు సిబిఐ, ఐబి రా వంటి సంస్థలు సక్రమంగా పనిచేస్తే ఈ పరిస్థితి ఎందుకు వచ్చేది? పైగా పంజరంలో చిలకగా పేరు మోసిన సిబిఐ ఇలాంటి వాటిని సమర్థంగా వెలికితీసిన ఉదాహరణ ఒకటైనా ఉందా? అన్ని సందర్భాల్లోనూ మారణకాండ జరిగిన తర్వాతనే కదా సిబిఐ రంగంలోకి వచ్చేది?

వందల సంఖ్యలో జరిగితే ఇదొక్కటి పట్టుకుంటారేమని నిస్సిగ్గుగా వాదించిన ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ చెప్పలేదా? ఈశాన్య చాణక్యుడుగా చెప్పుకునే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ నివేదించలేదా? ఇంతకన్నా ఆత్మవంచన మరేముంటుంది? అలా అయితే ఇందుకు గాను హోంశాఖ అధికారులు అమాత్యులపై చర్య తీసుకోవద్దా?

వీడియో తీసిన వారి అరెస్టు

ఈ ఘటనతో పాటు మణిపూర్‌లో జరిగిన మరెన్నో అఘాయిత్యాల బాధాకర వివరాల్లు ఇప్పుడు బయటకొస్తున్నాయి. వాటిపై ఏ చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. దేశవ్యాపితంగా ఇంతగా ఆగ్రహావేశాలు రగిలించిన ఈ కేసులోనే కేంద్రం చేసిందేమిటి? ఆ రోజు వీడియో తీసిన వ్యక్తిని అరెస్టు చేశారట! జరిగింది షూట్ చేసి దేశమంతా అందుబాటులోకి తెచ్చినందుకు కేసు నమోదు చేశారట. ఇదే గాక ఇలాంటి ఘటనలు ఎలా ఎన్ని జరిగాయో దర్యాప్తు చేసే బాధ్యత సిబిఐకి అప్పగించారట! ఏదో సామెత చెప్పినట్టు సిబిఐ, ఐబి రా వంటి సంస్థలు సక్రమంగా పనిచేస్తే ఈ పరిస్థితి ఎందుకు వచ్చేది? పైగా పంజరంలో చిలకగా పేరు మోసిన సిబిఐ ఇలాంటి వాటిని సమర్థంగా వెలికితీసిన ఉదాహరణ ఒకటైనా ఉందా? అన్ని సందర్భాల్లోనూ మారణకాండ జరిగిన తర్వాతనే కదా సిబిఐ రంగంలోకి వచ్చేది? ఈ విషయమైనా ప్రభుత్వం పార్లమెంటుకు చెప్పలేదు. సుప్రీం కోర్టులో అఫిడవిట్‌ద్వారా తెలియజేసింది. మీరు చర్య తీసుకుంటారా లేక మేమే రంగంలోకి దిగాలా అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ అక్షింతలు వేశాక అనివార్యంగా ఇచ్చిన జవాబిది. సుప్రీం కోర్టు ఇలా అడగడం కూడా ఇష్టంలేని బద్రిశేషాద్రి అనే తమిళ పాత్రికేయుడు యూట్యూబ్ ఇంటర్వ్యూలో సిజెఐపైనే అవాకులకు దిగారు. ప్రధాన న్యాయమూర్తికి ఒక తుపాకి ఇచ్చి పంపిస్తే ఘర్షణలను నివారిస్తారేమో చూడాలని అపహాస్యం చేశారు. అది పర్వతమయమైన సంక్లిష్ట ప్రాంతం. అక్కడ హత్యలు జరుగుతాయి. హింసాకాండ మనం ఆపలేం అని తేల్చిపారేశాడు. దీనిమీద కవి అరసు అనే అడ్వకేట్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అరెస్టు చేశారు. దేశంలో ఎందరో రచయితలు పాత్రికేయులను నిరంకుశంగా అరెస్టు చేసిన బీజేపీకి ఇది మాత్రం మహాపరాధమైపోయింది. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వెంటనే తీవ్రంగా ఖండించారు. అంటే అక్కడ ఆదివాసులపై దాడులను, ఈశాన్యంలో అంతర్యుద్ధాన్ని ఆపకపోగా దేశప్రధాన న్యాయమూర్తినే అపహాస్యం చేసిన వ్యక్తిని విచారించ కూడదన్నమాట. ప్లాటినం తరహా ఖనిజాలతో పాటు అపార సంపదలకు నిలయమైన ఆ ప్రాంతాన్ని బడా కంపెనీల పాలు చేయడానికే కావాలని కల్లోలం సృష్టించి నట్టు కూడా మీడియా సంస్థలను పేర్కొంటున్నాయి.

వంకర వాదనలతో పక్కదారి

మణిపూర్‌పై మాట్లాడే బదులు అలవాటైన అధ్వాన్న వ్యూహాలన్నిటినీ అమ్ములపొదిలోంచి తీసింది బీజేపీ. బెంగాల్, రాజస్థాన్‌లలో మహిళలపై ఇలాంటి ఘటనలే జరిగాయని పోటీ పెడుతోంది. బెంగాల్‌లో జరిగిన ఘటనలను మొన్న ఇదే పేజీలో చర్చ చేశాం. ఆ కుట్రలో బీజేపీకి కూడా వాటా ఉంది. అదలావుంచితే అమానుషాలను నివారించడానికి బదులు ఒకదానికి ఒకటి పోటీ పెట్టడం ఏం రాజనీతి? ఇంకోటి మయన్మార్‌ను చైనాను ఇందుకు కారణంగా నిందించడం. మయన్మార్ సైనిక పాలకుల అణచివేత కారణంగా శరణార్థులు వచ్చి తలదాచుకుంటున్న మాట నిజమే. కాని మైతేయి, కుకీ తెగల మధ్య బీజేపీ సృష్టించిన అంతర్యుద్ధానికి వారెలా కారణమవుతారు? ఇక భారత మాజీసైనాధికారి నవరత్నే ఏకంగా చైనానే ఇవన్నిటికీ కారణమని తేల్చిపారేశారు! ఒకవైపున విదేశాంగ మంత్రి జైశంకర్ అంతకు ముందు మోడీ చైనానేతలతో చర్చలు జరిపి సంబంధాల మెరుగుదల గురించి మాట్లాడుతుంటూ మాజీ సైన్యాధిపతి ఇలా అనడం దానికి విస్తారమైన ప్రచారం కల్పించంలో విదేశాంగ నీతీ కనిపించదు. బీజేపీకి కేంద్రానికి కావలసింది ఈ గండం నుంచి గట్టెక్కడమే. అందుకు మార్గం ఇతరులపై దాడి చేయడం, చర్చను దారిమళ్లించడం. వాస్తవానికి మణిపూర్ అంటున్నా ఈ జ్వాలలు ఈశాన్యమంతటినీ కబళించే ప్రమాదం ఉందని గతవారం ఈ శీర్షికలో చెప్పుకున్నాం. మిజోరాం ముఖ్యమంత్రి జోమర్తంగా ఇప్పటికే పలురకాల నిరసనలలో, ఆందోళనలలో పాల్గొన్నారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఇది తమ భద్రతకు కూడా ముప్పని హెచ్చరించారు. మిజోరాంలో కుకి, జో, ఉపజాతిప్రజలు అధికంగా ఉంటారు. అక్కడ శరణార్థి శిబిరాలు నిర్వహించడం కూడా బీజేపీ సహించలేకపోతున్నది. వీటన్నిటినీ అస్సాంకు తరలించాలని కేంద్రం ప్రతిపాదించడం అందుకే. అయితే అసాం ముఖ్యమంత్రి హిమంత ఈశాన్య కల్లోలం సూత్రధారులలో ఒకరు. సరిహద్దు రాష్ట్రాలన్నిటితో దానికి తగాదాలున్నాయని గుర్తుచేసుకుంటే ఇదెంత ప్రమాదకరమైన సూచనో స్పష్టమవుతుంది. హిందూ, ముస్లిం తగాదాలను ఇతర జాతి కలహాలను రాజేయడంలో అస్సాంకు దారుణమైన చరిత్ర ఉంది. పాలనాపరంగానూ ప్రజాస్వామిక చర్చలతోనూ



సమస్యను పరిష్కరించేబదులు రాజకీయ కోణంలో ఉపయోగించుకోవడమే బీజేపీ పరమ సూత్రంగా ఉందని ఈ ఉదాహరణలన్నీ విశదీకరిస్తాయి. అత్యాచారానికి గురైన మహిళలను సాటి మహిళలే పట్టించారని మరో విపరీత వాదన కూడా పాలకపార్టీ ప్రచారంలో పెట్టింది. విద్వేషాలు రగిలించిన తర్వాత ఎవరు ఏం చేస్తారో ఎవరు చెప్పగలరు? అందులోనూ మైతేయి ప్రజలను కుకీలపైకి ఉసిగొల్పిన తర్వాత... మైదాన ప్రాంత ప్రజలను కూడా గిరిజనులుగా గుర్తించాలని ఇంఫాల్ హైకోర్టు బాధ్యతా రహితంగా ఇచ్చినతీర్పును సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ నాయకత్వం ఆమోదించాయి. ఆ రాష్ట్రంలోనే గాక మొత్తం ఈశాన్యంలో రాజకీయ మద్దతు పెంచుకోవడానికి ఆడిన నాటకమే ఇంతటి విపత్కర పరిస్థితికి కారణమైంది. ఇప్పుడు మరెవరిపైనో నిందలా?

ప్రతిపక్షాల ప్రతిఘటన, వైసీపీ టీడీపీ వంత

ఒకవైపు ఇంత దారుణమైన నిందలేస్తూనే అమిత్ షా ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులైన మల్లికార్జున ఖర్గే, అధీర్ రంజన్ చౌదరిలకు లేఖలు రాస్తారు. చర్చకు సహకరించాల్సిందిగా లేఖలు రాయడం కన్నా కపటం ఏముంటుంది? ఖర్గే అన్నట్టు ఒకవైపున మోడీ ప్రతిపక్షాలను దేశవ్యతిరేక శక్తులతోనూ. టెర్రరిస్టులతోనూ పోల్చి మాట్లాడుతూ మరోవైపున ఇలాంటి మెత్తటి లేఖలు ప్రయోగిస్తే ఫలితం ఏముంటుంది? ప్రతిపక్షాలు ఇండియా అని తమ

> ఖర్గే అన్నట్టు ఒకవైపున మోడీ ప్రతిపక్షాలను దేశవ్యతిరేక శక్తులతోనూ. టెర్రరిస్టులతోనూ పోల్చి మాట్లాడుతూ మరోవైపున ఇలాంటి మెత్తటి లేఖలు ప్రయోగిస్తే ఫలితం ఏముంటుంది? ప్రతిపక్షాలు ఇండియా అని తమ కూటమికి పేరు పెట్టుకున్నారు గాని ఇండియన్ ముజాహిదీన్‌లోనూ, ఈస్టిండియా కంపెనీలోనూ కూడా ఇండియా ఉందని అవహేళన చేసిన మోడీ మాటలు దేన్ని సూచిస్తాయి?

కూటమికి పేరు పెట్టుకున్నారు గాని ఇండియన్ ముజాహిదీన్‌లోనూ, ఈస్టిండియా కంపెనీలోనూ కూడా ఇండియా ఉందని అవహేళన చేసిన మోడీ మాటలు దేన్ని సూచిస్తాయి? నిజానికి చర్చ సంగతి అటుంచి పార్లమెంటులో మణిపూర్‌పై వేసిన ప్రశ్నలకు కూడా ఈ అంశం కోర్టు పరిధిలో ఉందంటూ సమాధానాలు ఇవ్వకుండా తిరస్కరిస్తున్నారు. నేను మూడోసారి అధికారంలోకి వచ్చాక దేశాన్ని మూడో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రధాని ప్రగల్భాలు పలుకుతున్నారు. సహజంగా భారతదేశం పెద్దదేశంగా ఇప్పుడు ఐదో స్థానంలో ఉంది. అయితే మనకన్నా చైనా ఆరురెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా పెంపొందుతున్నది. అయిదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ కావడమే పెద్ద గొప్ప విషయంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పుకున్న రోజులు ఎవరూ మర్చిపోరు. ఇప్పటికీ కూడా మన ఆర్థిక వ్యవస్థ 3.2 ట్రిలియన్లు దాటలేదు. చైనా 17.3ట్రిలియన్ల దగ్గర దూసుకుపోతున్నది. జీడీపీ గొప్పలు అలా ఉంచి తలసరి ఆదాయంలో మన వెనుకబాటును, అంతులేని అసమానతలను విమర్శకులు మోడీకి సరిగానే గుర్తు చేశారు.

పరిస్థితికి సంబంధించిన పూర్తినిజాలు దేశానికి తెలియడం కోసం ప్రతిపక్ష పార్టీలకు చెందిన 21మంది ఎంపిలు మణిపూర్‌లో స్వయంగా పర్యటన చేస్తున్నారు. దీనివల్ల అక్కడ పర్యటించకుండా దాటేసిన మోడీ తీరుకు అది సమాధానమూ అవుతుంది. ఇంత కీలకమైన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానపాలక పార్టీలైన వైసీపీ, టీడీపీ, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం అవకాశవాదానికి పరాకాష్ట. ఏపీకీ అనేక విధాల అన్యాయం చేసిన మోడీ సర్కారును నిలదీయడానికి ఈ అవకాశం ఉపయోగించుకునే బదులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించాలని వైసీపీ నిర్ణయించింది. అమిత్‌షా చెప్పడమే సరైందని ప్రతిపక్షం వైఖరి తప్పని ఆ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రవచించారు. ఢిల్లీ ఆర్డినెన్సు బిల్లుపైనా మద్దతు ప్రకటించారు. టీడీపీ ఎంపీ గల్లాజయదేవ్ మొదట్లో బలపరుస్తామని సూచించారు. అయితే ఎన్‌డీఏలో చేరుతామన్నా చేర్చుకోలేదని, అధికార పూర్వకంగా తమ మద్దతు కోరలేదని ఆపార్టీ కొంత సమయం తీసుకుంటున్నట్టు కనిపిస్తుంది. ఇంతవరకూ మణిపూర్ విషయంలో కేంద్రాన్ని బీజేపీని పల్లెత్తు మాట అన్నది లేదు. కొంత జాప్యం వ్యూహం అనుసరిస్తున్నా టీడీపీ ప్రతిపక్షాలతో ఓటు చేస్తుందన్న అంచనా ఎవరికీ లేదు. కాంగ్రెస్‌తో కలసి వేదిక పంచుకోబోమన్న బీఆర్ఎస్ మాత్రం వ్యతిరేకంగా ఉంటాననే చెబుతున్నది. ఏది ఏమైనా ప్రభుత్వం పడిపోయే ముప్పు లేకున్నా ఈ అవిశ్వాస పర్వం అయిదు రాష్ట్రాల ఎన్నికల తరుణంలో బీజేపీకి పెద్ద రాజకీయ సవాలుగానే మారింది. ■

'ఇంటింటికీ పడవ' పథకం!



జంధ్యాల రఘుబాబు
9849753298

వాన పాటంటే జనాలు చచ్చేంత పడిచస్తారు. పాత కాలం నుండి ఇప్పటి కాలం వరకూ బాగా తీసిన అలాంటి పాటల్ని జనం మెచ్చుతూనే ఉన్నారు. మనిషికి వర్షానికి ఉన్న సంబంధం అటువంటిది మరి. ఎండాకాలమంతా విసిగిపోయి ఏ ఊటీకో, కొడైకెనాల్‌కో పోయొస్తే కొంత సేద తీరినా వచ్చినాక మళ్ళీ అదే స్థితి, అదే పరిస్థితి. ఎక్కడికిపోయినా, దేశమంతా తిరిగినా మన ఇంటికి, మన ఊరికి మనం రావలసిందే. అయితే బయటి ప్రాంతాలకు, దేశాలకు పోయినప్పుడు మన గురించి గొప్పలు ఎన్నో చెప్పుకోవచ్చు. ఇక్కడ జనాల మధ్య చిచ్చు పెట్టి అందరూ కొట్టుకొంటున్నా అక్కడ నీతి వాక్యాలు, శాంతి వాక్యాలు చెప్పొచ్చు. జపం జపం జపం...కొంగ జపం, తపం తపం తపం... దొంగ తపం అన్న పాటకు న్యాయం చేకూర్చేలా నటనలో ఆరితేరిన వారిలా కూడా ప్రవర్తించొచ్చు. వానొస్తే బురద ఫ్రీ అని మనకంతా తెలుసు. అయితే ఆ వానపాటలో బురద ఉండే నీళ్ళే పోసినవే పోసి షూటింగు అయ్యేంత వరకూ నానా కష్టాలు పడ్డామని నటీనటులు చెప్పడం వింటూ ఉంటాం. అది నిజం. హాయిగా ఏసీ హాలులో వానపాట చూసి డిటిఎస్‌లో పక్కనుండు వాన శబ్దాలు, ఉరుముల శబ్దాలు వస్తుంటే అది ఎండాకాలమైతే ఇంకా చల్లగా అనుభవమవుతుంది చూసేవాళ్ళకి.

వాన తనంతట తాను వచ్చిపోతే పెద్ద ఇబ్బంది ఉండనే ఉండదు, పరేషాన్ అసలే ఉండదు. కాని అది పోకుండా, మనుషుల్ని బయటకు పోనీయకుండా పడుతూ ఉంటేనే ఇబ్బంది. ఎక్కువరోజులు వాన కురిస్తే దుర్యోధనుడు, కర్ణుడి కథ గుర్తొస్తుంది. వాళ్ళిద్దరిలో ఎవరు నిజంగా దానగుణం ఉన్నవారు అని ఇంద్రుడు పరీక్ష పెడతాడు. అతణ్ణి ఎవరైనా ఆ పరీక్ష పెట్టమన్నారో గుర్తుకు రావడం లేదు. బ్రాహ్మణుడి వేషంలో ఇద్దరి దగ్గరికీ పోయి పెళ్ళిలో వంట చేయడానికి కట్టెలు కావాలని అడుగుతాడు. ఆ తేదీకి ముందు వారం రోజులు ఇప్పుడు పడుతున్న వర్షాల్లాగే వాన కురిపిస్తాడు. దేశంలోని కట్టెలన్నీ నానిపోయాక పోయి అడుగుతాడు నాకిస్తాను అన్న వంట చెరకు ఇప్పించమని. ఎక్కడ చూసినా తడిసిపోయిన కట్టెలే ఉన్నాయని దుర్యోధనుడు ఇవ్వలేనని చేతులెత్తేస్తాడు. కర్ణుడు మాత్రం తానున్న భవనం పడగొట్టి అందులో ఉన్న దూలాలను తీయించి, ముక్కలు ముక్కలుగా చేయించి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడు. అది కథ కావచ్చు కాని రాజుల పాలన ఎలా ఉంటుంది, ఇచ్చిన మాట ఎలా నిలబెట్టుకుంటారు అన్నది తెలుపుతుంది. ఆ కాలంలో ఎన్నికల మ్యానిఫెస్టోలు ఉండేవి కాదసలు.

ఆ మధ్య ఓ చిరుత అడవిలోనుంచి వచ్చి నగరంలోని జనాల్ని భయపెట్టింది. అలాగే ఇతర జంతువులు. తమ అడవుల్ని మనిషి ఆక్రమించుకుంటే అవి మాత్రం ఏం చేస్తాయి చెప్పండి. అలాగే నీరు కూడా మౌనంగా తన పని తాను చేసుకుంటూ నీరు పల్లమెరుగు అన్న సూత్రాన్ని వదలకుండా తన తడాఖా చూపిస్తోంది. తన చెరువుల్ని, కాల్వల్ని, వాగుల్ని మనిషి ఆక్రమించుకొని ఇళ్ళు, సినిమా హాళ్లు, హోటళ్లు ఇలా కబ్జా చేసి కట్టుకున్న కట్టడాల్ని ముంచేసి తన కోపం తెలియజేస్తుంది. నిజం చెప్పాలంటే మనిషి నైజాన్ని జనాలకి కళ్ళకు కట్టేలా చూపించి మనిషి కళ్ళు తెరవాల్సిన సమయం వచ్చిందని చెప్పకనే చెబుతోంది. అసమదీయులు, తసమదీయులు అన్నట్టు తమకు కావలసిన వారికి చెరువుల్ని రాసిచ్చిన నాయకులే ఇప్పటి పరిస్థికి సంజాయిషీ ఇవ్వాలి. ఇదేమీ ఒక్కరోజుతో పోయే సమస్య కాదు. ప్రతి సంవత్సరం వానలొస్తాయి, ప్రతి ఐదేండ్లకీ ఎన్నికలొస్తాయి. మనిషికి తెలివి మాత్రం రాదు. అలా అనుకొని పట్టించుకోని వాళ్ళుంటారు, ప్రజల్ని మేలుకొలిపే వాళ్ళూ ఉంటారు. నాయకులు మాత్రం మేలుకోరన్న సత్యం కుండపోత వర్షాల వల్ల

సురుకు



తెలుస్తోంది.

ఈసారి ఎన్నికల వాగ్దానాలలో వర్షాకాలంలో మేము ఇవి చేస్తాము, అవి చేస్తాము అని మాత్రం చెప్పాల్సిందే. లేదంటే పుట్టి మునిగిపోతుందంతే. మచ్చుకి కొన్ని వాగ్దానాలు చూద్దాం. ఇంటింటికీ పడవ పథకం, ట్యూబు మాది గాలి మీది, రాత్రికే ఇంటికి చేరే పథకం, పడవ కారు బోటు షికారు, మీరు నీరు ఒక ప్రాణం ఒక వాహనం, నిర్బంధ ఈత సూత్రం, వానా వానా వెల్లువాయే ఉచిత గొడుగులు, నీళ్ల దూరని గృహ పథకం, రోడ్డే మన కాలువ స్కీము, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మెట్రో పడవ లైన్లు, చినుకు మాది కునుకు మీది ఇలా ఉండే అవకాశం ఉంది. ఇంటింటికీ ఉచిత నీరు అన్న వాగ్దానం మాత్రం నిజంగా ఉచితంగా ఏమాత్రం కష్టపడకుండా నెరవేర్చేదిగా కనిపిస్తోందిప్పుడు. జాగా లేదు కాని ఈ వరదనీటితో ఒక విద్యుత్ ప్రాజెక్టు కూడా కట్టొచ్చని బాగా విజన్ ఉన్న పెద్ద మనిషి చెప్పొచ్చు కూడా. కావాలని వర్షాలు కురిపిస్తున్నారు అని తమ తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి మాటల తూటాలు వేయొచ్చు కూడా. నోరు తెరిస్తే వరద లాగా వచ్చే మాటలు నిజంగా వరదలు వస్తే కాని గుర్తుకు రాని వాస్తవాన్ని చూపుతున్నాయి. రుతువులు మారిపోయినట్టు రాజకీయాలూ మారుతూ ఉన్నాయి. వాటిమీద నియంత్రణ ఎలాగైతే లేదో వీటిమీదా అదే పరిస్థితి.

వరదరాజ స్వామి గురించి అందరూ వినే ఉంటారు. అయితే వరద రాజకీయ స్వాముల గురించి కూడా తెలుసుకోవలసిన సమయం ఇది. ఇక్కడ రోడ్లన్నీ నదులైనాయని, కాంప్లెక్సులన్నీ చెరువులైనాయనీ చెప్పే ఈ బడా స్వాములు తాము పాలించే రాష్ట్రాల్లో వర్షాలు, వరదలు వచ్చి సముద్రాలైనా ఇక్కడ మాత్రం ఫలానా విధంగా చేస్తాం, ఇంతటి ఘోరాన్ని రానివ్వం అని ఘోరాలకీ నేరాలకి తాము దూరమని బుకాయిస్తారు. ప్రజల్ని నిజంగా కులాలు, మతాలను చూపి మత్తుమందు ఇచ్చినట్టు తయారు చేసినోళ్ళే ఇప్పుడు మీరు మేలుకోవాలనడం విడ్డూరం. అసలు మొదటినుండీ పాలించిన కొందరు ఇదేందిర భై అసలు ప్రభుత్వం నిద్రపోతుందా అనీ అంటారు. అసలు రాష్ట్రాన్ని ఇచ్చిందే మేము అంటారు కాని ఇలా ఎందుకు ఉంది అంటే మాత్రం సమాధానం ఉండదు. వరదలాంటి ఎన్నో ప్రశ్నలకి మాటలు కరువే మరి. వాన వెల్లువవ్వడం తమకు ఓట్లు వెల్లువలా పడాలనుకోవడం వరదల్ని కూడా క్యాష్ చేసుకునే రాజకీయాలు నడుస్తున్నాయి. ■

నాజీలు, తాలిబాన్లను గుర్తుచేస్తున్న మణిపూర్ పాలన!



జస్టిస్ బి. చంద్రకుమార్
8978385151

నాకు అత్యంత బాధేసిన ఘటన ఏదైనా ఉందంటే మణిపూర్‌లో కొంత మంది స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగించడం. లైంగికదాడి చేసి హత్యలు చేయడం. దేశంలోని తాజా పరిణామాలను చూస్తుంటే ఆనాడు నాజీలు చేసిన దుర్మార్గాల్లాగే ఉన్నాయి. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో బైరాన్‌పల్లిలో రజాకార్లు స్త్రీలను బట్టలు విప్పించి బతుకమ్మ ఆడించిన ఘటనను గుర్తుచేశాయి. నేడు ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల దుశ్చర్యలను మణిపూర్‌లాంటి దారుణాలు తలదన్నుతున్నాయి. బాధిత మహిళను కాపాడేందుకు అడ్డువచ్చిన వారి సోదరుడిని, తండ్రిని చంపడం, గ్యాంగ్‌రేప్ చేయడం, భారతీయ ఏ సంస్కృతి, సాంప్రదాయాలు అనిపించుకుంటాయి? అలా చేసిన నింది తులకు నాయకులైన బీజేపీ- ఆర్ఎస్ఎస్‌కు ఈ చర్య అత్యంత పాశవికమైన చర్యగా, భారతీయ సంస్కృతికి మాయని మచ్చగా అనిపించడం లేదా? ఇతర మతాల వారి మీద దాడులు చేయడం, చంపడం వారి స్త్రీలను మానభంగం చేయడం, వారి ఆస్తులను తగలబెట్టడం, హిందూ ధర్మం మూల సూత్రాలకు వేద విజ్ఞానానికి ఉపనిషత్తుల సారానికి పూర్తి వ్యతిరేకం. సనతన ధర్మమని చెప్పే వారికి అందరిలో ఆత్మ ఒక్కటేననే ప్రాథమిక విషయం పట్ల అవగాహన అవసరం. మతాలన్నీ మంచిని బోధిస్తాయి మానవత్వాన్ని చాటుతాయి. సాధనా పద్ధతులు చూపుతాయి. కానీ వాటిని రాజకీయాలకు వాడుకోవడం, ప్రజల్ని బలిపశువుల్ని చేయడం అత్యంత శోచనీయం.

ఏ మతం వారికి ఆ మతాన్ని అవలించే స్వేచ్ఛను మన రాజ్యాంగం అందించింది. భిన్నమైన కులాలు, మతాచారాలు ఉన్న విషయాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు నాడే గుర్తించి అందరికీ సమాన అవకాశాలిచ్చారు. కుల, మత, జాతి, ప్రాంతీయ భేదం లేకుండా అందరికీ సమన్యాయం దొరికే హక్కులు కల్పించారు. నేరస్తులు ఏ కులం వారైనా, ఏ మతం వారైనా ఒకే రకమైన శిక్షకు అర్హులు. కానీ బీజేపీ ప్రభుత్వం వీటన్నింటినీ మార్చే ప్రయత్నమే చేస్తోంది. వాటి స్థానంలో మనువాదం తెచ్చే పనిలో నిమగ్నమైంది. వారికి రాజ్యాంగం అవసరం లేదు. ప్రజాస్వామ్యంపై పట్టింపు లేదు. ఉన్నదంతా ఒక్కటే దేశాన్ని హిందూత్వగా మార్చడం! వీటిని అమలు చేసే పనిలో ఉంటే మణిపూర్‌లాంటి ఘటనలు వారికేం కనిపిస్తాయి? పైగా నేరస్తులకు, నిందితులకు అండగా ఉండేందుకే వారు ఎన్నికల్లో గెలిచినట్టుగా ఉన్నారు! బీజేపీ ఈతొమ్మిదేండ్ల కాలంలో చాలా బాధాకరమైన ఘటనల్ని చూశాం. బిల్కిస్‌బానో కేసులో నిందితులకు శిక్షకాలం పూర్తి కాకుండానే వదిలివేసింది. బాధితురాలు గర్భిణీగా ఉన్న ఒక అబలను రేప్ చేసిన నిందితులు జైలునుండి బయటకు వచ్చాక హిందూమత చాందసులు వారికి సన్మానం చేశారు. అటువంటి వారికి సన్మానం చేశారంటే దేశానికి ఏం సందేశం ఇచ్చినట్టు? దీన్ని మనమెలా అర్థం చేసుకోవాలి.

ఢిల్లీలో మహిళా రెజ్లర్లు ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడైన బ్రిజ్‌భూషణ్ రెజ్లర్ల పట్ల లైంగికదాడులకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేస్తే ఆ కేసు నమోదు చేయలేదు. వారి కన్నీళ్లను పట్టించుకున్న నాథుడు లేడు. పార్లమెంట్ ఎదుటే రోదించినా వారిది అరణ్యరోదనే అయింది. బ్రిజ్‌భూషణ్ బీజేపీ నాయకుడైనంత మాత్రాన, పార్లమెంట్ సభ్యునిగా ఉన్నా అతడు చేసిన నేరాలపై వెంటనే కేసు రిజిస్టర్ చేయకపోవడం బీజేపీ నాయకత్వానికి మహిళల పట్ల ఉన్న వైఖరిని తెలియజేస్తున్నది. నేరస్తులు, పాలకులు ఒక్కటైతే సమాజం ఎలా పురోగమిస్తుంది? ఉగ్రవాదులు, మతోన్మాదులు ఏ మతం వారైనా, ఏ కులానికి చెందినా నేరస్తులే. ఏ మతం, ఏ కులం వారు అత్యాచారాలు, హత్యలు చేసినా



పౌరులందరూ ఖండించాల్సిందే. హిందూముస్లింలు ఐక్యంగా ఉండాలని మతసామరస్యాన్ని బోధించినందుకే ఆర్ఎస్ఎస్ భావజాలంతో ప్రభావితుడైన గాడ్సే మహాత్మాగాంధీని కాల్చిచంపాడు. అందుకే మతోన్మాదనేది అత్యంత ప్రమాదకరం, అభివద్ధికి ఆటంకం. ఇటీవల చూసినట్లయితే హిందూమతం నుంచి కొందరు మరోమతంలోకి మారుతున్నారంటే కారణమేంటని ఆలోచించాలి. హిందూమతంలోని కొందరు పాటిస్తున్న ఈ కుల వివక్షత కారణం కాదా! దళితులను కొందరు మందిరాల్లోకి అనుమతించడం లేదు. దేవాలయాల్లోని సహపంక్తి భోజనాల్లో కూర్చోనివ్వడం లేదు. అలా సాటి మనుషులను మనుషులుగా చూడనప్పుడు మరోచోట వారికి సమానత్వం కనబడినప్పుడు వారు మరోమతాన్ని ఎంచుకుంటారు.

భారతదేశం అభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు అవసరం. కులమత ఘర్షణల వల్ల భారత ప్రతిష్ట దెబ్బతింటుంది. ప్రజాస్వామ్య లౌకికవాదదేశమని మనం చెప్పుకోలేం. మత ద్వేషాలను పెంచి పోషిస్తే తాత్కాలికంగా ఎన్నికల్లో మెజారిటీ మతస్తుల ఓట్లు వేయించుకొని లాభపడవచ్చు కానీ మతోన్మాదం, మత విద్వేషాల వలన శాశ్వతంగా ఎదుటివారి మనోభావాలు దెబ్బతింటాయి. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఈనాడు కలిసిమెలిసి ఉన్నట్లు రేపటి రోజు ఐక్యంగా ఉండటం, పనిచేయడం కష్టమవుతుంది. ఒకరి మీద ఒకరికి విశ్వాసం సన్నగిల్లుతుంది. కులమత విభేదాలు, ప్రాంతీయ అసమానతలు మనదేశాన్ని బలహీనపరుస్తాయి. భవిష్యత్తులో ప్రాణాలు అరచేతిలో పెట్టు కొని బయటకు వెళ్లే పరిస్థితి రావచ్చు. నేడు మణిపూర్‌లో ఉన్న పరిస్థితి దేశమంతటా రావచ్చు. అందుచే విశాల దృక్పథంతో ఆలోచించాలి. విశాలమైన భావాలను వ్యాపింప చేయాలి. మతసామరస్యాన్ని బోధించాలి.విభేదాలను పోగొట్టాలి. ■





కేంద్రం నిద్రపోతోందా?

మణిపూర్‌లో హింస దేశ ప్రతిష్టకు దెబ్బ

- శాంతి నెలకొన్నదని కేంద్రం చెబుతున్నది
- మరి ప్రజలు ఇంకా తమ సొంత ఇండ్లకు ఎందుకు వెళ్లలేదు?
- తీవ్ర భయాందోళనలో ప్రజలు
- ప్రభుత్వంపై నమ్మకం పోయింది
- రెండు బృందాలుగా మణిపూర్ వాసులను కలుసుకుంటున్న ప్రతిపక్ష ఎంపీలు



నేడు రాష్ట్ర గవర్నర్‌తో భేటీ

న్యూఢిల్లీ : దాదాపు తొంబై రోజులుగా ఈశాన్య రాష్ట్రం మణిపూర్ కాలిపోతుంటే, కేంద్ర ప్రభుత్వం నిద్రపోతుందా? అని ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నించారు. మణిపూర్‌లో హింస దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నదని తెలిపారు. అక్కడ శాంతి నెలకొందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదనీ, అయితే ప్రజలు ఇంకా తమ సొంత ఇండ్లకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మణిపూర్‌కు శాంతి కావాలని, అందుకు ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 16 పార్టీలకు చెందిన 20 మంది ప్రతిపక్ష ఎంపీలు శనివారం మణిపూర్‌కు చేరుకున్నారు. పది మంది చొప్పున రెండు బృందాలుగా ఏర్పడి మణిపూర్‌లోని హింసాత్మక ప్రాంతాలను, సహాయ కేంద్రాలను సందర్శించారు. అక్కడ బాధితులను కలిసి వారి బాధలను విన్నారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. ప్రతిపక్ష ఎంపీలు తమ మద్దతును ప్రకటించారు. మణిపూర్‌లో శాంతి నెలకొని, సాధారణ పరిస్థితులు ఏర్పడేవరకూ అక్కడి ప్రజలకు అండగా ఉంటామని ఎంపీలు స్పష్టంచేశారు. అలాగే కుకీ, మైతీ తెగల నాయకులను కూడా కలిశారు. ఎంపీలు అధిర్ రంజన్ చౌదరి, ఫూలో దేవి నేతమ్ (కాంగ్రెస్), కనిమొళి (డీఎంకే), సుస్మిత సేన్ (టీఎంసీ), ఎఎ రహీం (సీపీఐ(ఎం)), పి. సంతోష్ కుమార్ (సీపీఐ), మనోజ్ కుమార్ ఝా (ఆర్జేడీ), జావిద్ అలీ ఖాన్ (ఎస్పీ), డి. రవి కుమార్, తిరుమవలవన్ (వీసీకే)లతో కూడిన ఇండియా కూటమి బృందం చురచంద్ పూర్‌లోని బాయ్స్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని సందర్శించింది. అక్కడ బాధితులతో మాట్లాడిన అనంతరం, కుకీ నాయకులు, పౌర సమాజ సభ్యులను కలుసుకుంది. అక్కడి నుంచి ఇంఫాల్ చేరు కుంది. అక్కడ బిష్ణుపూర్ జిల్లాలోని మోయిరాంగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని సందర్శించింది. అక్కడ బాధితులను, ముఖ్యంగా చిన్నారులు, మహిళలను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకుంది. అక్కడి నుంచి హింసాత్మక ప్రాంతాలను సందర్శించింది.

ఎంపీలు రాజీవ్ రంజన్ సింగ్, అనిల్ ప్రసాద్ హేగ్డే (జేడీయూ), గౌరవ్ గోగోయ్ (కాంగ్రెస్), పి.పి మహ్మద్ ఫైజల్ (ఎన్సీపీ), ఈ.టి మహ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), ఎన్.కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ), సుశీల్ గుప్తా (ఆప్), అరవింద్ సావంత్ (శివసేన, ఠాక్రే), మహువా మాఝీ (జేఎంఎం), జయంత్ చౌదరి (ఆర్ఎల్డీ)లతో కూడిన మరో ఇండియా కూటమి బృందం చురచంద్‌పూర్‌లోని డాన్ బాస్కో స్కూల్‌లోని సహాయ శిబిరాన్ని సందర్శించింది. అక్కడ ప్రజలతో మాట్లాడి వారి ఆవేదనలు తెలుసుకుంది. అక్కడ నుంచి ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలకు చేరుకుంది. అక్కడ అకంపేట్‌లోని ఐడిల్ గర్ల్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని సందర్శించారు. ఇంఫాల్ వెస్ట్‌లోని లంబోయిఖోంగాంగోన్‌లో సహాయక శిబిరాన్ని సందర్శిం చారు. రెండు బృందాలూ కుకీ, మైతీ కమ్యూనిటీ సభ్యులను కలుసుకున్నాయి.

ఈ సందర్భంగా అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ మణిపూర్‌లోని ఘర్షణలు దేశ ప్రతిష్టను దెబ్బతీశాయని అన్నారు. మణిపూర్‌లో జాతి వివాదం దేశ ప్రతిష్టను మాత్రమే కాకుండా రాష్ట్రం, ఈశాన్య ప్రాంతాన్ని కూడా దెబ్బతీసిందని అన్నారు. 'జాతి ఘర్షణల బాధితులను కలవడానికి, సమస్యను అర్థం చేసుకోవడానికి మేము ఇక్కడకు వచ్చాము. హింసకు ముగింపు పలకాలని, శాంతిని త్వరగా పునరుద్ధరించాలని మేము కోరుకుంటున్నాము. మణిపూర్‌లో ఏమి జరుగుతుందో ప్రపంచం మొత్తం గమనిస్తోంది' అన్నారు. 'కేంద్రం సీబీఐ దర్యాప్తు గురించి మాట్లాడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిద్రపోతుందా?' అని ప్రశ్నించారు. "మణిపూర్ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వారు ప్రభుత్వం పై పూర్తిగా నమ్మకం కోల్పోయారు. ప్రభుత్వం మాకు సహాయం చేయదని వారు అనుకుంటున్నారు' అని అన్నారు. ఇప్పటి వరకు మణిపూర్‌లో పర్యటించేందుకు కూడా ప్రధాని మోడీ ప్రయత్నించలేదని విమర్శించారు.

టీఎంసీ ఎంపీ సుస్మితా దేవ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లైంగిక దాడి బాధితురాలిని కలిసిన తరువాత డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మీడియాతో మాట్లాడుతూ.. మణిపూర్‌లో శాంతి నెలకొందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదనీ, అదే నిజమైతే సహాయక శిబిరాల్లోని ప్రజలు తమ ఇండ్లకు ఎందుకు వెళ్లలేకపోతున్నారని ప్రశ్నించారు.

నేడు గవర్నర్‌తో ప్రతిపక్ష ఎంపీల భేటీ

నేడు (ఆదివారం) రాజ్‌భవన్‌లో మణిపూర్ గవర్నర్ అనుసూయా ఉయికేతో ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు భేటీ కానున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న పరిస్థితి, శాంతిని నెలకొల్పడానికి సాధ్యమయ్యే చర్యల గురించి చర్చిస్తారు.

సహాయక శిబిరాన్ని సందర్శించిన గవర్నర్

ప్రతిపక్షాలు మణిపూర్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో మణిపూర్ గవర్నర్ అనుసూయా ఉయికే చురచంద్‌పూర్‌లోని సహాయక శిబిరాన్ని సందర్శించారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన, ఆస్తి నష్టానికి గురైన వారికి ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని ఆమె తెలిపారు. 'దాదాపు మూడు నెలలుగా ఈ ప్రజలు తమ తమ ఇండ్లకు దూరంగా ఉన్నారు. హింసలో చాలా మంది ప్రజలు తమ ఇళ్లను కోల్పో యారు. చాలా మంది తమ వస్తువులను కోల్పోయారు. వారికి ఏమీ మిగలలేదు. కనీసం ఈ వ్యక్తులు శిబిరంలో ఎటువంటి సమస్యలను ఎదుర్కోకుండా చూడాలని నేను ఇక్కడకు వచ్చాను' అన్నారు. 'నేను రెండు వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కలుసుకున్నాను. శాంతిని నెలకొల్పడంలో వారి సహకారం కోరాను. మనం రాజకీయాలకు అతీతంగా ఎదగాలి. మణిపూర్‌లో శాంతి, సాధారణ స్థితిని నెల కొల్పాలి' అని అనుసూయా ఉయికే అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు దుష్ప్రచారం

- కీలకమైన ఓ నాయకుడే నా స్థానాన్ని దిగజారుస్తున్నారు
- ఏ ప్రభుత్వంతోనూ, నాకు వ్యాపారం, భూ ఒప్పందాలు లేవు
- ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ రక్షణ కోసం పోరాడాను
- నిరాధారమైన, తప్పుడు కథనాలు బాధ కలిగిస్తున్నాయి : ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'నేను కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు మీడియాతో పాటు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం. ఎలాంటి ఆధారాల్లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలకమైన పదవిలో ఉన్న ఓ నాయకుడు పార్టీలో నా స్థానాన్ని దిగజార్చేందుకు, ప్రజల్లో నా ప్రతిష్టను తగ్గించేందుకు ఇలాంటి దుష్ప్రచారం చేయడం దురదృష్టకరం. సోషల్ మీడియా, మీడియాలో వస్తున్న ఈ పుకార్లను నేను ఖండిస్తున్నాను. అవి పూర్తిగా అవాస్తవం' అని ఎంపీ ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

'1994 తర్వాత ఎన్నికల్లో ఓడిపోకుండా, 30 ఏండ్లు నిరంతరంగా కాంగ్రెస్ పార్టీకి విధేయతతో పని చేసి, వరుసగా ఆరు ఎన్నికల్లో గెలుపొందినందుకు నేను గర్విస్తున్నాను. నా భార్య పద్మావతి రెడ్డి గతంలో కోదాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం వంద ఓట్ల తేడాతో ఓడిపోయారు. కోదాడలో ఉంటూ పీసీసీ ఉపాధ్యక్షురాలిగా కాంగ్రెస్ పార్టీ తరపున తన శక్తిమేరకు అక్కడి ప్రజల కోసం పనిచేస్తున్నారు. మాకు పిల్లలు లేరు. మేము ప్రజల్నే మా కుటుంబంగా మా పిల్లలుగా భావిస్తూ నిబద్ధతతో కూడిన ప్రజా జీవితంలో నిరంతరం పని చేస్తున్నాం' అని వారు పేర్కొన్నారు. గత రెండేండ్లుగా తమపై పూర్తిగా తప్పుడు, పరువు నష్టం కలిగించే కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి చాలా బాధాకరమైనవి తెలిపారు. పార్టీలో మా అనుచరులను అణగదొక్కడం, తొలగించడమే లక్ష్యంగా కూడా ఈ ప్రచారం జరుగుతున్నదని పేర్కొన్నారు. పార్టీలో కొన్ని సమస్యలు, పరిణామాల పట్ల అసంతృప్తిగా ఉండవచ్చు, కానీ జాతీయ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి సంబంధించిన విధి విధానాలను అనుసరిస్తానని ఉత్తమ్, పద్మావతి అభిప్రాయపడ్డారు. వాటిపై బయట మాట్లాడబోనని స్పష్టం చేశారు.

అధికారిక కార్యక్రమాల్లో తప్ప ఇప్పటివరకు కేసీఆర్‌ను కలవలేదు

ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా అసెంబ్లీలోనూ, రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలోనూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమస్యపై పి. చిదంబరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తప్ప ఇప్పటి వరకు సీఎం కేసీఆర్‌ను ఏనాడూ కలవలేదని ఉత్తమ్ వెల్లడించారు. తనకు ఎవరితోనూ ఎలాంటి వ్యాపార, కాంట్రాక్టులు, భూమి లావాదేవీలు లేవని స్పష్టం చేశారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన తర్వాత, రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి వెంకట్రామన్, శంకర్‌దయాళ్ శర్మ వద్ద సీనియర్ అధికారిగా పనిచేశానని పేర్కొన్నారు. ఆవిధంగా తాను కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజా జీవితంలో ఉండేందుకు ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్టు తెలిపారు.

ఉమ్మడి రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా దేశంలో ఎన్నడూ లేని విధంగా అతి పెద్ద గృహ నిర్మాణ కార్య క్రమాన్ని పర్యవేక్షించినట్టు గుర్తు చేశారు. తమ జీవితంలో మా సంపద, మా ఆరోగ్యం, మా కుటుంబ జీవితం, ఇలా జీవితంలోని ప్రతి దాన్ని కాంగ్రెస్ పార్టీ సేవలోనూ, సాధారణ ప్రజల కోసం అందించినట్టు పేర్కొ న్నారు. ఒక నాయకుడితో సన్నిహితంగా ఉన్న యూ ట్యూబ్ ఛానెల్‌లు, మీడియా సంస్థలు తన గురించి, తన సతీమణి గురించి తప్పుడు, పరువు నష్టం కలిగించే కథనాలను ప్రచురించడం తీవ్ర బాధను,వేదనను కలిగించాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారనే నిరాధారమైన, తప్పుడు కథనాలను ఆయన ఖండించారు.

మణిపూర్ వీడియోపై సీబీఐ దర్యాప్తు ప్రారంభం

ఎఫ్ఐఆర్ నమోదు

ఇంఫాల్ : మణిపూర్‌లో కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించి, ఆపై అత్యాచారం జరిపిన సంఘటనకు సంబంధించి వెలుగులోకి వచ్చిన వీడియోపై సీబీఐ శనివారం దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

ఇద్దరు మహిళలపై లైంగిక వేధింపులు, హింసకు సంబంధించిన ఉదంతంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టింది. సిబ్బంది, శిక్షణ (డీఓపీటీ) శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీలోని 153-ఏ, 398, 427, 436, 448, 302, 354, 364, 326, 376, 34 సెక్షన్లు, 25 (1-సీ) ఏ చట్టం ప్రకారం సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీడియో తీసిన మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

కేసు విచారణ చేపట్టిన సీబీఐ నిందితులను తన అధీనంలోకి తీసుకొని విచారిస్తుంది. బాధితుల స్టేట్‌మెంటును నమోదు చేస్తుంది. నేరం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తుంది. మణిపూర్ వైరల్ వీడియో కేసును సీబీఐ చేపడుతుందని కేంద్ర హోం శాఖ గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. విచారణను మణిపూర్ వెలుపల చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించింది. మణిపూర్ ప్రభుత్వాన్ని సంప్రదించిన అనంతరం కేసును సీబీఐని అప్పగించాలని నిర్ణయించినట్లు కేంద్ర హోం కార్యదర్శి అజయ్ భల్లా సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలియజేశారు.

వరద విలయం

నవతెలంగాణ-మట్టెవాడ/భూపాలపల్లి/విలేకరులు

వరంగల్ భద్రకాళి చెరువు మట్టకట్ట శనివారం కోతకు గురై తెగిపోవడంతో నీరు పోతన నగర్ వాసుల ఇండ్లను ముంచెత్తింది. మూడ్రోజుల కిందట వచ్చిన వరదలతో పునరావాస కేంద్రాల్లో తలదాచు కొని సర్వం కోల్పోయిన పోతననగర్ వాసులు శని వారమే ఇండ్లలోకి చేరారు. వచ్చిన కొద్దిసేపటిలోనే భద్రకాళి చెరువు కట్ట తెగడంతో ప్రాణ భయంతో పరుగులు పెట్టారు. ఉన్న సామాను కూడా కొట్టుకుపోయిందని కన్నీరు మున్నీరయ్యారు.

గతంలో ఎప్పుడూ కట్ట తెగిన దాఖలాలు లేవు. కానీ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం, కూడా, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యం కారణంగా మట్టికట్ట కోతకు గురై పోతన నగర్‌ను ముంచేసింది. భారీగా వరద వచ్చినప్పుడే కట్ట మీదుగా నీరు వస్తోందని, మట్టికట్ట కోతకు గురి అవుతుందని స్థానికులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఇప్పుడీ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొంది వాగు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు షట్టర్లు ఎత్తి నీటిని వాగు పక్కనే ఉన్న భద్రకాళి చెరువులోకి వదిలారు. దీంతో వరద ఉధృతి పెరిగి ఒక్కసారిగా మట్టి కట్ట కోతకు గురైంది. గండి పూడ్చివేతకు మంత్రి ఎర్రబెల్లి దయా కర్‌రావు, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, అధికారులు చర్యలు తీసుకున్నారు.

బురదలో మోరంచపల్లి

మోరంచపల్లి గ్రామంలో ఇండ్లన్నీ బురదతో నిండాయి. ఇంట్లో ఉన్నటువంటి వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. విలువైన వస్తువులు కొట్టుకు పోయాయి. కట్టు బట్టలు.. మొండిగోడల ఇండ్లు తప్ప వారికి మరేం మిగలలేదు. వరద బాధితుల నిమిత్తం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పర్యవేక్షణలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. వరదల్లో గల్లంతైన నలుగురిని పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా వెతకడంతో శనివారం గొర్రె ఒదిరెడ్డి, గొంగడి సరోజన మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇంకా గడ్డం మహాలక్ష్మీ, గంగిడి వజ్రమణి కోసం జిల్లా పోలీసులు, ఎన్డీ ఆర్ఎఫ్ బృందాలు చర్యలు చేపడుతున్నాయి. మోరంచ పరివాహక ప్రాంతంలో సుమారు 950 ఎకరాల పంట భూముల్లో ఇసుక మేటలు ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. మోరంచపల్లి గ్రామంలో 250 ఎకరాల్లో ఇసుక మేటలు గుర్తించారు.

గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం వద్ద గోదావరి వరద రాత్రి 7 గంటలకు 55.70 అడుగులకు చేరుకుంది. 15,642,50 క్యూసెక్కుల నీ టి ని దిగువకు విడుదల చేస్తున్నారు. 3వ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఖమ్మం నగరంలో రెండ్రోజులు ఉగ్రరూపం దాల్చి ప్రవహించిన మున్నేరు వాగు శనివారం శాంతించింది. కానీ తీరని నష్టాన్ని మిగిల్చింది. మున్నేరు ముంపు పరివాహక ప్రాంతాల్లోని ఇండ్లల్లో బురద చేరింది. గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీ, వాటర్ ట్యాంకర్ల సహాయంతో రోడ్లు శుభ్రం చేశారు.

సీపీఐ(ఎం) బృందం పర్యటన

భద్రాచలం పట్టణంలోని డిగ్రీ కాలేజీ, నన్నపనేని స్కూల్ పునరావాస కేంద్రాలను, సీఆర్పీఎఫ్ క్యాంప్, విస్తా కాంప్లెక్స్ స్లూయిజ్ తదితర ముంపు ప్రాంతాలను సీపీఐ(ఎం) బృందం పరిశీలించింది. వరద బాధితులకు ప్రభుత్వం రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ(ఎం) నేతలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రజలను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు పరిశీలన

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పొదెం వీరయ్య భద్రాచలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కరకట్ట పరిసరాలను పరిశీలించారు. బూర్గంపాడులో పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారికి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వర రావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్యే, విప్ రేగా కాంతారావు బూర్గంపాడు, అశ్వాపురం, భద్రాచలం ముంపు ప్రాంతాల్లో పర్యటించి, పునరా వాస కేంద్రాల్లో బాధితులను కలిశారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని సిరాల ప్రాజెక్టు ముంపు ప్రాంతాలైన ఇలేగాంలోని పంటపొలాలను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలిం చారు. బాధితులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇరిగేషన్ కార్పొరేషన్ డెవల ప్‌మెంట్ కమిటీ చైర్మెన్ సముద్రాల వేణుగోపాల చారి పంటలను, చెరువు తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

ఖమ్మం నగరంలోని 35, 48వ డివిజన్‌లో బాధితులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు పరామర్శించారు. ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్‌లో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పర్యటించారు. మోతీనగర్, బొక్కల గడ్డలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి పలువురిని ఓదార్చారు. నిత్యావసరాలు పంపిణీ చేశారు.

జూరాల 30 గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ- ధరూరు

జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 30 గేట్లను శనివారం అధికారులు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. ఎగువ ప్రాంతం నుంచి జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం వస్తోంది. జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి 1,90, వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుత నీటిమట్టం 1041.273 అడుగులు ఉందని పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ, దిగువ జూరాల నుంచి 6 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తికి నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 28వేల క్యూసెక్కుల నీరును వదులుతున్నారు. నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా, బీమా ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు.

త్వరలోనే భారత్ జోడో యాత్ర 2.0..!

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికలే టార్గెట్‌గా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'భారత్ జోడో యాత్ర' పేరుతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు పాదయాత్ర చేసిన ఆయన.. ఇప్పుడు రెండో విడతకు సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో 'యాత్ర 2.0' మొదలుకానుందని కాంగ్రెస్ విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. భారత్ జోడో యాత్ర నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ హెడ్ దిగ్విజయ్ సింగ్.. రెండో విడత యాత్ర కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. గత వారం నుంచి పలువురు పార్టీ కీలక నేతలతో యాత్ర గురించి ఆయన చర్చలు జరుపుతున్నారు. చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని.. యాత్ర 2 ప్రారంభ తేదీ, రూట్‌మ్యాప్ మీద ఇంకా చర్చలు జరపాల్సి ఉందని ఏఐసీసీ మెంబర్ ఒకరు చెబుతున్నారు. భారత్ జోడో యాత్ర 2022 సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి ప్రారంభమై.. 2023 జనవరి 30న శ్రీనగర్‌తో ముగిసింది. యాత్రను ప్రారంభించడానికి ముందు అహ్మదాబాద్‌లోని మహాత్మాగాంధీ స్మారకం వద్ద రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. దీంతో గాంధీ జన్మస్థలమైన పోర్‌బందర్ నుంచి రెండో విడత యాత్ర మొదలుపెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. పోర్‌బందర్ నుంచి పలు రాష్ట్రాల గుండా అగర్తలాతో యాత్ర ముగిసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని భావిస్తోంది.

బాణాసంచా గోడౌన్‌లో భారీ పేలుడు..

- తమిళనాడులో నలుగురు మృతి



చెన్నై:తమిళనాడులోని బాణా సంచా గోడౌన్లో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి గోడౌన్ బిల్డింగ్‌తో సహా చుట్టు పక్క ల మరో ఐదు ఇండ్లు నేలమట్ట మయ్యాయి. ఎగిసిపడుతున్న మంట లను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ దుర్ఘటన లో గోడౌన్ సిబ్బంది నలుగురు చనిపోయారని అధికారులు తెలిపారు. కృష్ణగిరి పాతపేటలోని ఓ బాణా సంచా ఫ్యాక్టరీ గోడౌన్ లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గోడౌన్ కు నిప్పంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. దీంతో నలుగురు చనిపోగా మరో 20 మంది గాయపడ్డారు. బాధితులను ఆస్పత్రికి తరలించామని, బిల్డింగ్ శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం వెతుకుతున్నామని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

సమ్మెకు సిద్ధమైన ఏపీ విద్యుత్ ఉద్యోగులు

అమరావతి : ఏపీలోని విద్యుత్ ఉద్యోగులు 24 ఏండ్ల తర్వాత సమ్మెకు సిద్ధమయ్యారు. వేతన సవరణ సహా 12 డిమాండ్లతో గురువారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టిన ఉద్యోగులు శుక్రవారం కూడా కొనసాగించారు. సర్కిల్, జోనల్, విద్యుదుత్పత్తి కేంద్రాలు, డిస్కమ్‌లు, జెన్కో, ట్రాన్స్‌కో ప్రధాన కార్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ నిరసన ప్రదర్శనల్లో చేరాలని అవుట్ సోర్సింగ్ కూడా నిర్ణయించారు. ఉద్యోగుల నిరసనలపై స్పందించిన ప్రభుత్వం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు చర్చిద్దామని, గుణదల విద్యుత్ సౌధలోని ఏపీపీసీసీ చైర్మన్ చాంబర్‌కు పదిమంది నేతలు రావాలని కబురుపెట్టింది. ప్రభుత్వంతో చర్చలు కొలిక్కి వచ్చేంత వరకు నిరసన ప్రదర్శనలు కొనసాగించాలని, ప్రభుత్వం మొండికేస్తే ఆగస్టు 10 నుంచి సమ్మెకు వెళ్లాలని ఉద్యోగులు నిర్ణయించారు. కాగా, 1999లో వేతన సవరణ సహా ఇతర డిమాండ్ల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. మళ్లీ ఇన్నేండ్లకు సమ్మెకు సిద్ధమవుతున్నారు.

న్యాయవాది విఠల్‌బాబు హత్య దారుణం : ఐలు ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది రాయసం ఆదిశేషు విఠల్ బాబును కిడ్నాప్ చేసి హత్య చేయడం దారుణమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఆయన మరణం పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ మేరకు ఐలు అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, కార్యదర్శి కె పార్థ సారథి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో తరచూ న్యాయవాదుల మీద దాడులు, హత్యలు, తప్పుడు కేసులు నమోదు చేయటం వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో న్యాయవాదులకు రక్షణ చట్టం చాలా అవసరమని గుర్తు చేశారు. ప్రకాశం జిల్లా అద్దంకి సివిల్ కోర్టులో కేసు చూసుకుని బయటకు వచ్చిన న్యాయవాది విటల్ బాబును గుర్తు తెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకున్నారని తెలిపారు. పోలీసులు వెంబడిస్తున్న తరుణంలో కారును మార్చి మరో కారులో తీసుకెళ్లి చంపి, శవాన్ని పూడ్చిపెట్టడం చాలా దారుణమని విమర్శించారు. దేశంలో న్యాయవాదులకు రక్షణ లేకుండా పోవడం బాధాకరమని ఈ సందర్భంగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసులోని దోషులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించండి

సీఎం కేసీఆర్‌కు టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఇంకా క్రమబద్ధీకరణ కాకుండా మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుతో పాటు మంత్రులు టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డికి శనివారం ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రం పంపించారు. 23 ఏండ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 474 మంది, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 577 కాంట్రాక్టు అధ్యాపకులను ఇంకా క్రమబద్ధీకరించలేదని తెలిపారు. పోస్టులు మంజూరు కాలేదు, వారికి సరైన విద్యార్హతల్లేవు, అవార్డు ఫాస్ట్ డివిజన్ లాంటి కారణాలను చూపుతూ, వారి తప్పు లేనప్పటికీ ఇంతవరకు క్రమబద్ధీకరణ చేయలేదని వివరించారు.

బోధించేటపుడు లేని సమస్యలు క్రమబద్ధీకరణ విషయంలో ఎందుకు వచ్చాయని తెలిపారు. సీఎం, మంత్రులు, అధికారులకు వినతిపత్రాలను సమర్పించినా ఫలితం లేదని పేర్కొన్నారు. దీంతో వారి కుటుంబాలు తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని వారి క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరగా అయ్యేటట్టు చూడాలని కోరారు.

ప్రజల ప్రాణం పోతుంటే రాజకీయాలా?

బొందల తెలంగాణగా మారుస్తున్న కేసీఆర్

- బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- సహాయక చర్యల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు

నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో ప్రజల ప్రాణం పోతుంటే సీఎం కేసీఆర్ రాజకీయాలు చేయడమేంటని మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్, ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం డివిజన్ ముంపు ప్రాంతాల్లో శనివారం ఆయన సందర్శించారు. ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ దేవుడెరుగు రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ బొందల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. ఇస్తాంబుల్ డల్లాస్ కాదని, కనీసం రోడ్లు బాగు చేయాలని కోరారు. మరో మూడు నెలల్లో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిందేనన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఇంత ఇబ్బందుల్లో ఉంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోకపోవడం ఏంటని, ఆయన నోరు మూగబోయిందా అని ప్రశ్నించారు. వరదల్లో ప్రాణం కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పంట నష్టపోయిన రైతులకు రూ.30 వేల పరిహారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని కోరారు. ప్రభుత్వాలు స్పందించకుంటే పార్లమెంటులో కేంద్ర మంత్రులను ప్రశ్నిస్తానన్నారు. రాష్ట్రంలో వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మందుముల పరమేశ్వర్ రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పసుల ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రచ్చకెక్కిన కాంగ్రెస్ విభేదాలు

ఉప్పల్ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. రేవంత్‌రెడ్డి పర్యటనలో ఫ్లెక్సీ వివాదంతో రాగిడి లక్ష్మారెడ్డి అనుచరులు, మందముల పరమేశ్వర్ రెడ్డి అనుచరుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రాగిడి లక్ష్మారెడ్డి అనుచరులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ప్రోటోకాల్ లేకుండా ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తారంటూ మందముళ్ల పరమేశ్వర్ రెడ్డి అనుచరులు తెల్లవారుజామున 3 గంటల సమయంలో వాటిని చించేశారు. లక్ష్మారెడ్డి రెడ్డి అనుచరులు మళ్లీ ఉప్పల్ బస్టాండ్ సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా.. కొంతమంది పరమేశ్వర్ రెడ్డి అనుచరులు వచ్చి ఫ్లెక్సీలు చించి దాడికి దిగారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ నెలకొనడంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి రెడ్డి అనుచరులు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మధుసూదనాచారిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-వనస్థలిపురం

తెలంగాణ తొలి మాజీ స్పీకర్, శాసన మండలి సభ్యులు సిరికొండ మధుసూదనా చారిని శనివారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, గ్రేటర్ హైదరాబాద్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు సంరెడ్డి భుజంగా రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు జగదీశవరులు చారీలు మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు.

వనస్థలిపురం ఎస్ఐ స్వామికి సీఐగా ప్రమోషన్



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన స్వామికి సీఐగా ప్రమోషన్ రావడం సంతోషంగా ఉందని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ జలంధర్ రెడ్డి అన్నారు. గతంలో స్వామి..కందుకూరు, ఉప్పల్, బొల్లారం, కాచిగూడ, బేగంపేట్‌లో విధులు నిర్వహించారని, వనస్థలిపురంలో సంవత్సరం పాటుగా ఎస్ఐగా పనిచేశారని సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు. త్వరలోనే పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం స్వామికి సీఐ జలంధర్ రెడ్డి మూడో స్టార్‌ను అందజేశారు.

మమతా నగర్‌ను సందర్శించిన రేవంత్ రెడ్డి



నవతెలంగాణ - నాగోల్

వరద ముంపునకు గురైన నాగోలు డివిజన్‌లోని మమతా నగర్ కాలనీని శనివారం మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మమతా నగర్‌లో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనుల కింద బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. తర్వాత నిర్మాణ పనుల్లో ఎందుకు ఆలస్యం అవుతుందని అక్కడున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినా..రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబించడం సరైనది కాదని మండిపడ్డారు. కురుస్తున్న వర్షాలకు ముంపు ప్రాంతాలలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపీ మల్లు రవి, రంగారెడ్డి జిల్లా బీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు జితేందర్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు మల్రెడ్డి రాంరెడ్డి, జెక్కిడి ప్రభాకర్ రెడ్డి, నాగోల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంజుల రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన



నవతెలంగాణ-హయత్‌నగర్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, కనకయ్య, ప్రభాకర్, శ్రీ రాములు, అశోక్, నర్సింహ, రాజు, భిక్షపతి, లక్ష్మమ్మ, వెంకటమ్మ, పోచమ్మ కవిత, లలిత, భిక్షపమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

అయ్యప్ప కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ - నాగోల్

నాగోలు డివిజన్‌లో వరదకు గురైన అయ్యప్ప కాలనీలో శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కాలనీలో డ్రైన్స్ కొన్నేండ్ల కిందట నిర్మించినవి అని తెలిపారు. ఇప్పుడు జనాభాకు అనుగుణంగా అవి సరిపోక పొంగిపొర్లుతున్నాయని..ఆ డ్రైన్స్ స్థానంలో నూతన డ్రైన్స్ నిర్మాణం చేపడుతామని చెప్పారు. అలాగే వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేస్తామన్నారు. నూతన డ్రైన్స్ నిర్మాణం వలన ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా చేపట్టే డ్రైన్ నిర్మాణ పనుల్లో ఎత్తుపల్లాలు సరిగ్గా చూసుకొని పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గతంలో ఏ పాటి వర్షం కురిసినా ఈ కాలనీ మునిగిపోలేదన్నారు. ఎస్ఎన్‌డీపీ పనులు చేయడం వలన కాలనీవాసులకు వరదనీటి ముప్పు నుంచి విముక్తి లభించిందని హర్షం వ్యక్తం చేశారు. అందుకే ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మీకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సతీష్, రమేష్, నరసింహచారి, గిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపడతాం : కార్పొరేటర్



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపడుతామని కార్పొరేటర్ సుజాతా నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన సాగర్ ఎంక్లేవ్ కాలనీ, రెడ్డి కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు డివిజన్‌లోని కాలనీల రోడ్లన్ని గుంతలమయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ రోడ్లకు మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఎస్ఎన్ డీపీ తోపాటు ఇతర నాలాల నిర్మాణ పనులు పూర్తయితే ముంపు కాలనీలకు వరద సమస్యలు భవిష్యత్‌లో తలెత్తకుండా ఉంటాయన్నారు. తమ దృష్టికి వచ్చిన డివిజన్ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ వెంట జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ కోటేశ్వరావు, డీఈ కనకయ్య ఏఈ హేము నాయక్, కాలనీ ప్రతినిధులు సత్యనారాయణ రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మర్యాద రోహిత్ రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

ఆగస్టు 6న నెక్లెస్ రోడ్డులో ఎస్ఎమ్ఏ అవగాహనా వాక్



- క్యూర్ ఎస్ఎమ్ఏ ఫౌండేషన్ ఇండియా నిర్వాహకులు
- యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు
- ఎర్రమంజిల్‌లో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎమ్ఎ) గురించి అవగాహన కల్పించేందుకు క్యూర్ ఎస్ఎమ్ఎ ఫౌండేషన్ ఇండియా ఈ అరుదైన వ్యాధిపై ఆగస్టు 6వ తేదీన నెక్లెస్ రోడ్డులో ఉదయం 6 గంటలకు అవగాహనా వాక్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎర్రమంజిల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ గిరిరాజ్ ఆర్.చందక్ మాట్లాడుతూ వెన్నెముక కండరాల క్షీణత జన్యుపరమైన వ్యాధి అనీ, ఇది వెన్నుపాములోని మోటారు నరాల కణాలను బలహీనపరుస్తుందన్నారు. ఇది శారీరక బలం, నడవడానికి, తినడానికి, శ్వాస తీసుకునే సామర్థ్యాన్ని కోల్పోతుందని వివరించారు. ఇది శిశువుల మరణానికి ప్రథమ జన్యు కారణం, సర్వైవల్ మోటార్ న్యూరాన్ జన్యువు 1లో ఉత్పరివర్తన వల్ల సంభవిస్తుంది అన్నారు. నగరంలోని విద్యార్థులు, యువకులు, ప్రజలు ఈ రన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్యూర్ ఎస్ఎమ్ఏ స్టేట్ కో-ఆర్డినేటర్ పి.సతీష్ మాట్లాడుతూ మెదడు, వెన్నుపామును శరీర కండరాలకు అనుసంధానించే నరాల కణాల క్షీణత కారణంగా ఎస్ఎమ్ఎ కండరాల బలహీనత, కదలికను క్రమంగా కోల్పోతుందన్నారు. ఈ విచ్ఛిన్నం కండరాలు బలహీనంగా, తగ్గిపోవడానికి దారితీస్తుందని తెలిపారు. క్రాల్ చేయడం, నడవడం, కూర్చోవడం, తల కదిలించడం, మింగడం వంటి కార్యకలాపాలను ప్రభావితం చేస్తుంది అని తెలిపారు. కో-ఫౌండర్, డైరెక్టర్, పేషెంట్ అడ్వకేసీ, క్యూర్ ఎస్ఎమ్ఎ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా శ్రీలక్ష్మి మాట్లాడుతూ వారి సంస్థ చేస్తున్న కుటుంబ కౌన్సెలింగ్, జెనెటిక్ కౌన్సెలింగ్, ఎస్ఎమ్ఎ క్లినిక్‌లు, ఫైనాన్షియల్ సపోర్ట్ మరియు అవేర్‌నెస్ యాక్టివిటీస్‌తో సహా వారి సంస్థ ద్వారా చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్వీ రామారావు, క్యూర్ ఎస్ఎమ్ఎ రీజినల్ కో-ఆర్డినేటర్ పి.సతీష్, రన్నర్ అండ్ యోగా ట్రైనర్ సంతోషి తమ్మూర్కర్ పాల్గొన్నారు.


ఘనంగా సురేష్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - సంతోషనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కాలనీ పరిధిలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంటల సురేష్ జన్మదిన వేడుకలను శనివారం దేవిలాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. బీచు నాయక్, డాక్టర్ ఉపేందర్, జగన్ నాయక్, పృథ్వీరాజ్ చౌహాన్, నవదీప్, ధనరాజ్, వెంకటేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర మీడియా ఇంచార్జి జర్నలిస్ట్ సింగ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు సీఐ జలంధర్ రెడ్డి శుభాకాంక్షలు



నవతెలంగాణ-వనస్థలిపురం

మొహర్రం సందర్భంగా ముస్లిం సోదరులు ఆహ్వానం మేరకు శనివారం వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి, ఎస్ఐ జగన్, ఎల్బీనగర్ నియోజక వర్గ ఎస్సీ సెల్ చైర్మన్ బోడ రాజశేఖర్‌లు.. ముస్లిం సోదరుల నివాసాలకు వెళ్లారు. ఈ సందర్భంగా వారికి మొహరం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

బేగం బజార్ స్వస్తిక్ మిర్చి సమీపంలో ప్రమాదకరంగా పాత భవనం

- యజమాని ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం..
- నోటీసులిచ్చిన కాలయాపన చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..
- జోనల్ కమిషనర్ ఆదేశాలు బేఖతర్..
- ఆందోళన చెందుతున్న స్థానికులు..



సారూ.. ఇండ్లు కూల్చేయండి..



నవతెలంగాణ - ధూల్ పేట్

గోషామహల్ జీహెచ్ఎంసీ సర్కిల్ - 14 పరిధిలోని బేగం బజార్ స్వస్తిక్ మిర్చి సమీపంలోని ఇంటి నెంబర్ 15-8-351 గల ఓ యజమాని..తన ఇండ్లు శిథిలావస్థకు చేరిందని అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాదు 'ఆ ఇంటిని వెంటనే కూల్చేయండని సార్' అంటూ కార్యాలయ అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోకపోవడం గమనార్హం.

భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను అధికారులు కూల్చివేస్తారు. ఒక వేళ ఇంటి ఓనర్ ఒప్పుకోకపోతే నోటీసులు ఇస్తారు. ఇంకా పోలీస్ బందోబస్తుతో పక్కవారికి, దారిపొడవునా పోయే వారికి ప్రమాదం సంభవించకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని మరి పాత భవనాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేస్తారు. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా జీహెచ్ఎంసీ సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్నారు. తన పాత ఇంటిని కూల్చేయండని ఓ యజమాని అధికారులకు ఫిర్యాదు చేసి, చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా కాలయాపన చేయడం విశేషం. ప్రస్తుతం కురుస్తున్న ఈ వర్షాలకు ఇంటి గోడలు కూలి దారి వెంబడి పోతున్న వారిపై పడి ప్రమాదం జరుగుతుందోనని ఆ ఇంటి యజమాని ఆందోళన చెందుతున్నాడు.

సెక్షన్ అధికారి నిర్లక్ష్యం..

కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఓ ఇంటిని కూల్చకుండా సెక్షన్ అధికారి, కింది స్థాయి సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు ఇంటి లోపలి భాగాలు, పైకప్పు పూర్తిగా కూలిపోయింది. బయటి గోడలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించే వారు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన వ్యాపార కూడలి కావడంతో నిత్యం ట్రాలీ ఆటో, రిక్షా, హమాలీ కార్మికులు, వ్యాపారులు, కొనుగోలు దారులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ విషయాన్ని పలుమార్లు టౌన్ ప్లానింగ్ ఏసీపీ అధికారి, సెక్షన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇంటి యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు ఖాళీ చేసి ఆరునెలలు అయినా..

పాత భవనం ఎప్పుడు కూలిపోతుందోనని ముందస్తుగానే ఆ యజమాని ఆరు నెలల కిందటే ఇళ్లు ఖాళీ చేసి అద్దెకు ఉంటున్నాడు. అక్కడే అద్దెకు ఉండి దుకాణాలు నడుపుకునే వారు కూడా ఖాళీ చేశారు. దీన్ని గమనించిన అధికారులు నోటీసులిచ్చి వదిలేశారు. దీంతో ఇంటి యజమాని డేమాలిషన్ చేయాలని ఫిర్యాదు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారని వాపోతున్నారు. వర్షాల నేపథ్యంలో కూలిపోయే భవనాన్ని అధికారులు కూల్చకుండా వదిలేయడం పై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎడతెరిపి లేని వర్షాలకు శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయి ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే..అది దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు అలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు చేసినా పట్టించుకోవడం లేదు. ఓ బాధితుడు తన పాత ఇంటి వలన ప్రమాదం ఉందని..దానిని కూల్చేయాలని అధికారులకు ఫిర్యాదు చేశాడు. కానీ అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారు. ఒకప్పుడు శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చేసే అధికారులే.. ఇప్పుడు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఓ పాత ఇంటి యజమాని ప్రశ్నిస్తున్నాడు.





కలెక్టర్, కమిషనర్‌లకు ఫిర్యాదులు..

గత 2017 నుండి బేగం బజార్ 15-8-351 ఇళ్ళు కూలి పోవడానికి ప్రమాదకరంగా ఉంది.. దాన్ని వెంటనే కూల్చి వేయాలని జేఎన్టీయూ నోటీస్ జారీచేసింది. బాధితులు ఎన్డెమోలిషన్ చేయాలని జీహెచ్ ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాలు గేండ్లుగా పట్టించుకోకుండా నోటీసులిస్తూ అధి కారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో బాధితులు స్థానిక నాయకులు పట్టించుకోక పోవడంతో ఎంఐఎం నాయకులను ఆశ్రయించారు. ఎంఐఎం ఎమ్మెల్సీ పరిశీలించి వెంటనే కూల్చి వేయాలని అధికారులకు ఆదేశించారు. అంతేకాక జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌లకు కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. అయినా అయినా అధికారులు స్పందించక పోవడం గమనార్హం.

'మట్టి రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు'



నవతెలంగాణ-హయత్‌నగర్

కుమ్మరి కుంట కట్టపై కేవలం మట్టిరోడు ఉండడంతో వర్షాలు పడిన ప్రతిసారి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆవే దన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కుమ్మరి కుంట చెరువును కార్పొరేటర్ సందర్శించి మాట్లాడారు. హయత్ నగర్ డివిజన్ నుండి సాహెబ్ నగర్, బీఎన్ రెడ్డి దాదాపు 25 కాలనీలకు ఇదే ప్రధాన రోడ్డు మార్గం అన్నారు. నిత్యం వందల కొద్ది వాహనాలు కట్ట పై నుండే వెళ్తుంటాయని చెప్పారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కట్టపై ఉన్న మట్టి రోడ్డుపై మొత్తం గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. రెండేళ్ల నుంచి కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణం కోసం అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కానీ ఇప్పటి వరకూ అధికారులు స్పందించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రామకృష్ణ, పస్పరి భిక్షపతి, రామకృష్ణ కిషోర్, వెంకట్ రెడ్డి, నరసింహ, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందా చారి, సెన్సార్ బోర్డ్ సభ్యులు అప్పారావు, మధు, శక్తి సింగ్, లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షులు ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు చేనేత దినోత్సవ ఆహ్వాన పత్రిక



నవతెలంగాణ-వనస్థలిపురం

జాతీయ చేనేత దినోత్సవ ఆహ్వాన పత్రికను శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఆటోనగర్ కర్నాటి గార్డెన్స్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆహ్వాన పత్రం అందజేసిన వారిలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు కటకం నర్సింగ్ రావు, రంగారెడ్డి జిల్లా అర్బన్ చేనేత సెల్ కన్వీనర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మ రఘురాం నేత, జ్ఞానేశ్వర్, కర్నాటి మాధవి, యాదగిరి తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని శనివారం రాష్ట్ర మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ మరిపి ప్రసన్న, స్టేట్ మీడియా కన్వీనర్ తాళ్ల వినయ్ శంకర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి శరత్ కుమార్, నాయకులు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో గ్రంథాలయాలకు మహర్దశ

తుర్కయాంజల్‌లో స్థల పరిశీలన చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ వెంకట రమణా రెడ్డి



నవతెలంగాణ-తుర్కయాంజల్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన గ్రంథాలయాలకు మహర్దశ పట్టనుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకట రమణా రెడ్డి అన్నారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలో ఆధునాతన గ్రంథాలయాన్ని నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, స్థానిక నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 25 గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే మరో 30 గ్రామీణ గ్రంథాలయాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అమెజాన్ సంస్థ సహకారంతో 10 గ్రంథాలయాల నిర్మాణం, వీటి నిర్వహణకు గ్రంథాలయ సంస్థ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 95 గ్రంథాలయాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి మరో 30 కొత్తవి నిర్మిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ స్థాయిలో యువతకు, పాఠకులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు సమకూర్చడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. తుర్కయాంజల్‌లో స్థానిక కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు కొరగానే ఎమ్మెల్యే గ్రంథాలయ నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరు చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, నాయకులు రొక్కం చంద్ర శేఖర్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, కాకుమాను చిన్నయ్య, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, నారని శేఖర్ గౌడ్, గుండా ధనరాజ్, మేతరి దర్శన్, బొక్క గౌతమ్ రెడ్డి, గౌని వినోద్ గౌడ్, లైబ్రేరియన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సమాజ సేవలో యువత ముందుండాలి'



నవతెలంగాణ-సంతోష్ నగర్

సమాజ సేవలో యువత ముందు ఉండాలని కిషన్ శర్మ అన్నారు. యాకూత్‌పూర నియోజకవర్గం పరిధిలోని న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ ఎదురుగా శనివారం సెంట్రల్ పీస్ అండ్ వెల్ ఫర్ కమిటీ సభ్యులు అడ్వకేట్ కిషన్ శర్మ, ఆల్ జూన్ ఆల్ జోన్స్ జనరల్ సెక్రటరీ ఖాజా ఘజవుద్దీన్, పీస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో పీస్ కమిటీ సభ్యులు ముందుండాలని సూచించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో వినాయక చవితిని నిర్వహించుకోవాలని కోరారు. ఈ ఉత్సవాలకు పీస్ కమిటీ సభ్యుల సహకారం ఎంతో దోహదపడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు తేజు, సంతోష్ నగర్, మాదన్నపేట్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్, హనుమంతరావు, సంపత్ తోసివాల్, ఈస్ట్ జోన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, పీస్ కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర మీడియా ఇంచార్జి జర్నలిస్టు సింగ్, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి పూజలు చేసిన కార్పొరేటర్



నవతెలంగాణ- సంతోష్ నగర్

యాకుత్ పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో ఉన్న ఆలయంలో శనివారం కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత వైఎస్ఆర్ మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు పోచమ్మ అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని అయ్యప్పకాలనీలో కంచుగంటి పోచమ్మ కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటుంది. ఈ నెల 28న పోచమ్మ(75) ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కమిషనర్ బదిలీ'

నవతెలంగాణ-బోడుప్పల్

అధికార పార్టీ నేతల ఒత్తిడిలకు అధికారులను బలి చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. పీర్జాదిగూడ నగర కమిషనర్ వంశీకృష్ణను అధికార పార్టీ వత్తిడిల మేరకే బలవంతంగా బదిలీ చేశారని వాపోయారు. పీర్జాదిగూడ నగరంలో కమిషనర్ వంశీకృష్ణ మేయర్ అరాచకాలకు సహకరించకపోవడం కారణంగానే అతడిని బలవంతంగా బదిలీ చేశారని అన్నారు. అడ్డగోలు అక్రమాలకు సహకరించలేదనే నెపంతో ఇలాంటి దారుణాలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. మీరు చేసే అక్రమాలను ప్రజలు నిత్యం గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్తారని అన్నారు. కమిషనర్ బదిలీ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తామని చెప్పారు.

అభివృద్ధిని ఓర్వలేకనే రాద్ధాంతం

- భౌతిక దాడులు చేసిన బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలి
- ప్రతిపక్షాలవి బురద రాజకీయాలు
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ నగరంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. శనివారం పీర్జాదిగూడ బీర్ఆఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పార్టీ నేతలు, కార్పొరేటర్లు మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పీర్జాదిగూడలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం నీరు చేరిందని పేర్కొన్నారు. ఆ నీటిని తొలగించడం కోసం కార్పొరేషన్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వారు వరదలతో బురద రాజకీయం చేయాలనే ఉద్దేశంతో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆపద సమయంలో సాయం చేయాల్సిన కాంగ్రెస్, బీజేపీ నేతలు ధర్నాలు చేయడం దారుణమని వాపోయారు. ప్రకృతి వైపరీత్యాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి రఘువర్ధన్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పెద్ది మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడటం చూస్తుంటే ఇంకా ఎప్పుడూ అధికారంలోకి రాలేమనే ఉద్దేశంతో విచక్షణ కోల్పోయిన ట్లు అనిపిస్తుందని అన్నారు. భౌతిక దాడులకు దిగడం దేనికి నిదర్శనమో బీజేపీ నేతలే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బురద రాజకీయాలు మానుకొని ప్రజలకు ఉపయోగపడేలా ప్రతిపక్షాలు కార్యచరణ రుపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బండి సతీష్ గౌడ్, ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి, బండారి రవీందర్, లేతాకుల రఘుపతిరెడ్డి, మనోరంజన్ రెడ్డి, బలరాం, శ్రీరాములు గౌడ్, టీ.శ్రీధర్ రెడ్డి, శ్యామల, సాయిలు, కార్పొరేటర్లు కె.సుభాష్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి
- పాదయాత్రలో పలు సమస్యపై వినతులు



నవతెలంగాణ-ఉప్పల్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాసేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం నమస్తే పాదయాత్రతో రామంతపూర్ డివిజన్‌లో పరిధిలోని గాంధీనగర్, శ్రీరామ కాలనీ, కేసీఆర్ నగర్, సాయికృష్ణ నగర్, అంబేద్కర్ విగ్రహం, బాలకృష్ణనగర్, సాబేరకాలనీ, కురుమనగర్, సత్యానగర్, బస్తీలలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాదయాత్ర చేశారు. జనంలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని జీహెచ్ఎం సీ అధికారులను ఆదేశించారు. గాంధీనగర్‌లో డ్రయినేజీ వ్యవస్థను ఆధునికరించాలని, పారిశుధ్య నిర్వహణ చేయించాలని, రోడ్లపై వర్షపు నీటి నిలువ లేకుండా చేయాలని, సాయి కృష్ణనగర్, సాబేర కాలనీ, కురుమనగర్, సత్యనగర్లలో, సీసీ రోడ్లు, డ్రయినేజీ నిర్మాణం చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఇంటి నెంబర్లు ఇప్పించి విద్యుత్ దీపాలు ఏర్పాటు, నీటి కనెక్షన్లు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. శనివారం పాదయాత్ర 18వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, భాస్కర్ ముదిరాజ్, లేతాకుల రఘుపతి రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, సాగర్ రవీందర్ తిప్పన సంపత్ పాల్గొన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- మాజీ మేయర్ బొంతు రామ్మోహన్



నవతెలంగాణ-కాప్రా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. చర్లపల్లి డివిజన్ విద్యా మారుతీ కాలనీ ప్రెసిడెంట్ ముస్కు నర్సిరెడ్డి ఆనారోగ్యానికి గురై ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఆస్పత్రి ఖర్చుల కోసం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను సంప్రదించగా ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఇటీవల సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2,15,000 రూపాయల చెక్కును రామ్మోహన్ ,కార్పొరేట ర్ శ్రీదేవి యాదవ్ నర్సిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సీఎం, రామ్మోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపా రు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

డాక్టర్ సి.నారాయణరెడ్డికి నివాళి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ సి. నారాయ రెడ్డి 92వ జయంతి సందర్భంగా శనివారం కమలానగర్ ఆఫీసులో నారాయణరెడ్డికి పలువురు నివాళులర్పించారు. అనంతరం పీబీచారి మాట్లాడుతూ.. డాక్టర్ సి నారా యణ రెడ్డి రచయితగా, జ్ఞానపీఠ అవార్డు గ్రహీతగా తెలుగువారి గుండెల్లో సుస్థిరంగా ఉన్నారని చెప్పారు. భావ కవిత్వం నుంచి విప్లవ కవిత్వం, భక్తి గీతాలు నుంచి అనేక పద్యాలను రచించారని చెప్పారు. సినారే ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరావు సినిమాలకు అనేక జనరంజకమైన పాటలు రాశారని గుర్తు చేశారు. సోవియట్ యూనియన్ కూలిన తర్వాత అందరూ కమ్యూనిజం పడిపోయిందని వ్యాఖ్యానాలు చేస్తుంటే.. ఎవడ్రా కమ్యూనిజం కూలిపోయిందని అన్నారు, అది ముందుకే సాగుతుందని ధైర్యంగా చెప్పిన ధీశాలి డాక్టర్ సి.నారాయణరెడ్డి అని చెప్పారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. అంతకుముందు జయప్రకాష్‌తో పాటు సభికులందరూ డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసు, శ్రీనివాసరావు, సునీల్, అంజలి, శోభ తదితరులు పాల్గొన్నారు.

రైలు బండ్లపై రాళ్లురువ్వడం నేరం



- రైల్వే పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవల కాలంలో తరచుగా రైళ్ల బండ్లపై కొంతమంది వ్యక్తులు రాళ్లురవడం ప్రయాణికులకు ఇబ్బందులకు గురి చేయడం, రైళ్ల బండి అద్దాలకు నష్టం కలిగించడం వంటి సంఘటనలు పెరగడం కారణంగా ఆర్పీఎఫ్ సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ ధర్మారావు, ఈరేష్, సిబ్బంది రైల్వేట్రాక్ పరిసర ప్రాంతాల్లోకి వెళ్లి అక్కడ ఉన్న పిల్లలకు వారి తల్లిదండ్రులకు, ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రైల్వే చట్టం ప్రకారం రైలుబండ్ల పైన రాళ్ల రువ్వడం నష్టం, కలిగించడం, ప్రయాణికుల ప్రాణాలకు నష్టం జరిగే విధంగా చేస్తే రైల్వే చట్టం సెక్షన్ 153 ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. వారం రోజుల్లో రైళ్లపై రాళ్లు రువ్విన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామని వివరించారు. ఇటీవల కాలంలో ముంబైలో రైళ్లపై రాళ్లు రువ్విన కేసులో 10 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. రైల్వే పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు, స్కూల్ యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు సదరు పిల్లలను కౌన్సిలింగ్ చేయాలని కోరారు. ముఖ్యంగా రైల్వే పరిసర ప్రాంతాల్లో ఫంక్షన్స్ పూజయాత్రలు జరుపుకునే సమయంలో ప్రజలు, ఆర్గనైజర్స్ ఇటువంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భోజనం పెట్టడం లేదని విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

18 రోజుల నుంచి నిజాం హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థులకు భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తూ శనివారం విద్యార్థులు హాస్టల్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. భోజనం ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి అక్కడికి వెళ్లి విద్యార్థులను సముదాయించారు. వెంటనే విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో హనుమంతరావు సెల్ ఫోన్‌లో మాట్లాడారు. ఆగస్టు 1వ తేదీ నుంచి విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ నెల 30, 31 తేదీలలో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ భోజన సౌకర్యం కల్పిస్తుందని హనుమంతరావు చెప్పారు. 1వ తేదీ నుంచి కళాశాల యాజమాన్యం విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కాప్రా

యాదాద్రి (యాదగిరగుట్ట)కు వెళ్లడానికి హౌజింగ్ బోర్డ్ నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్‌కు మీర్పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నుంచి ఈసీఐఎల్ 117హెచ్ సర్వీస్ వయా హౌజింగ్ బోర్డ్ నుంచి వెళ్లేలా సౌకర్యం కల్పించాలని కోరారు. కుషాయిగూడ నుంచి నాంపల్లి వయా హౌజింగ్ బోర్డ్ 136హెచ్ నూతన సర్వీస్ సౌకర్యం కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, నాగిల్ల బాల్ రెడ్డి, శేఖర్ గౌడ్, నవీన్ గౌడ్, నిస్సార్ అహ్మద్ ఘోరీ, కుమార్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వండి

- బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి మోహన్ రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నాలుగు సార్లు పోటీ చేసి, ఐదేండ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే ఎన్.వీ.ఎస్. ఎస్. ప్రభాకర్ బదులుగా తనకు అవకాశం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి మోహన్ రెడ్డి కోరారు. శనివారం చర్లపల్లి జైల్ సమీపంలోని శ్రీకృష్ణ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్నానని తెలిపారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రభాకర్ అనుచరులకే కార్పొరేటర్‌గా అవకాశం కల్పించారని తెలిపారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారిని విస్మరించి కార్యకర్తలను ఎదగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. టీడీపీ, బీజేపీ అలయన్స్‌తో విజయం సాధించినా ఏ ఒక్కరినీ పట్టించుకోలేదన్నారు. వ్యక్తికి వచ్చే ఎన్నికల్లో ఎలా అవకాశం కల్పిస్తారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని మర్రి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌రావు నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు రమేష్ యాదవ్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి సంపత్, హరి నాయక్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ ప్రభుత్వం పేదల వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని తెలంగాణ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని తులసినగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పులిజాల గేల్వయ్య, మిరియాల రవీందర్, వంజరీ నాగరాజ్, సంతోష్ తదితరు నాయకులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ నవోదయనగర్‌కు చెందిన అంబేద్కర్ సంఘం నాయకుడు తక్కెళ్లపల్లి రాములు (60) గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భూపతి, అశోక్, దూసరి నవీన్‌గౌడ్, కృష్ణ ,అలివేలు, భారతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన సందీప్ గౌడ్



నవతెలంగాణ- మేడ్చల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మేడ్చల్ మున్సిపాల్టీ పరిధిలోని 17వ వార్డులోని రోడ్లు బురదతో గుంతల మయంగా మారడంతో మొహర్రం పండుగ సందర్భంగా శనివారం నిర్వహించే పీర్ల ఊరేగింపునకు, ప్రజలు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బీఆర్ఎస్ నాయకుడు సందీప్ గౌడ్ వెట్ మిక్స్ వేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మున్సిపల్ వారి సహకారంతో లైటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చేశామన్నారు. కార్యక్రమంలో సందీప్‌గౌడ్, సాయి కమల్, ఫెరోజ్, యాదిగిరి,గౌర్ల మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనార్టీ కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మెన్‌గా బి.శంకర్‌లూక్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.శంకర్‌లూక్ తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మెన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బి.శంకర్‌లూక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనపై నమ్మకం ఉంచి రెండవ సారి వైస్ చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొ న్నారు. మైనారిటీల కోసం ప్రభు త్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానన్నారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగిం చిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవితలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు బి.శంకర్ లూక్ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆలయాల చుట్టూ గోడ ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతపూర్‌లోని శివాలయానికి ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) నాయకులు ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ఓల్డ్ రామంతపూర్ శివాలయానికి ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలు గంజాయి, మద్యం సేవిస్తూ దేవాలయాలను అపవిత్రం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రహరీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వరూప, రమాదేవి, కిరణ్ తదితరులున్నారు.

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

మొహర్రం పండుగ సందర్భంగా మీర్పేట్ హెచ్‌బీ కాలనీలోని ఇందిరానగర్, ఓల్డ్ మీర్పేట్ గ్రామాల్లో పీర్ల పండుగ ఉత్సవాలలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, నవీన్, మచ్చ భాస్కర్, సురేష్, శేఖర్, భానురి రాకేష్, సాయి, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగం



నవతెలంగాణ-బోడుప్పల్

పేదల ఆరోగ్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. శనివారం బోడుప్పల్‌లోని తన నివాసంలో రాపోలు రామస్వామికి మంజూరైన రూ.లక్ష చెక్కును మేయర్ సామల బుచ్చిరెడ్డి సమక్షంలో లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మీసాల యాదగిరి, బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ్మ నాయకులు కొత్త చక్రపాణి గౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, రాసాల మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం ఉత్సవాలు

- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, దట్టీలు సమర్పణ







నవతెలంగాణ-కాప్రా

మొహర్రం వేడుకలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. మీర్పేట్ డివిజన్‌లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొన్నారు. ఆయన వెంట గొల్లూరి అంజయ్య బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్ పట్టణంలో పీర్ల నిలబెట్టడంలో ధాత్రిక వంశీయులు ఆదర్శంగా నిలుస్తున్నారని పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధాత్రిక విఠల్ మనుమడైన గిరిబాబు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 1950వ సంవత్సరంలో తాతగారైన ధాత్రిగా విఠల్‌కు తన వ్యవసాయ బావిలో పీర్ల పంజా లభించగా అప్పటి నుంచి నేటివరకు విఠల్ వారసులు 1950 సంవత్సరం నుంచి పీర్లను నిలబడున్నారని తెలిపారు. కులమతాలకు అతీతంగా ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. వారి తాత నుంచి మా నాన్న కృష్ణ, ఆ తర్వాత వారి వారసులైన మేము పీర్లను నిలబెడుతున్నామని వెల్లడించారు. అన్ని మతాలు సమానమేనని తెలిపారు. కార్యక్రమంలో విఠల్ వారసులు, భక్తులు పాల్గొన్నారు.

మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, కౌన్సిలర్ మహేష్ పాల్గొన్నారు. 18వ వార్డు కౌన్సిలర్ భవాణీ రాఘవేందర్‌గౌడ్ కుటుంబ సమేతంగాదట్టీలు సమర్పించారు. డబీల్‌పూర్ నుంచి ఎల్లంపేట్‌కు వచ్చిన పీర్లకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు స్వాగతం పలికారు.

ఇమామ్-ఏ-ఖాసీం ఆలం నిర్వాహక అధ్యక్షుడు ఖాజా ఖలీలుద్దీన్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మంత్రి మల్లారెడ్డి కుమారుడు మహేందర్‌రెడ్డి పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.





బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి నివాళి



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ నవోదయ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు రాములు గుండె పోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, మానోధైర్యం కల్పించారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, సాయి కుమార్, చంద్ర శేఖర్ , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-బాలానగర్

గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బాలానగర్ సీఐ కె. భాస్కర్ తెలిపారు. వివరాల ప్రకారం బాలానగర్ నర్సాపూర్ ఎక్స్ రోడ్స్ పరిధిలో సుమారు 50-60 సంవత్స రాల వయస్సు గల వృద్ధుడు అచేతనంగా పడి ఉ న్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వ్యక్తి చనిపోయాడని గుర్తి ంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ... ప్రజల సమస్యల తీర్చడమే నా ప్రథమ కర్తవ్యం అని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను తన నివాసం వద్ద కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆ హ్వాన పత్రికలు అందజేశారు. తమ తమ కాలనీల నెలకొన్న డ్రయినేజీ, రోడ్ల సమస్యలకు సంబంధించిన వినతీ పత్రాలు అందజేశారు. వారి సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోనోలో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేసీఆర్ తీసుకొచ్చిన పథకాలు దేశానికే ఆదర్శం



- మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో, 91 మంది లబ్ధిదా రులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 16 వేల మందికి కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ పథకం ద్వారా లబ్ధి చేకూర్చామని అన్నారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలు ఆడపిల్ల పెళ్లి చేయాలంటే ఒకప్పుడు ఆలోచించాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ నేడు ఆడపిల్లకు పెద్దన్నగా నేనున్నానన్న భరోసా కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటువంటి పథకాలు తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, మహేశ్వరి శ్రీహరి, ముద్దం నరసింహ యాదవ్, జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఫతేనగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా నిలిచారని ఎమ్మెల్యే కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని ఆయన స్పష్టం చేశారు.



ఆగస్టు 1 నుంచి ఎమ్మెల్యే పాదయాత్ర



- కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ 1వతేదీ మంగళవారం నుండి శనివారం వరకు ఎమ్మెల్యే కృష్ణారావు పాదయాత్రలో భాగంగా ప్రతి కాలనీ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకుని అధికారులకు ఆదేశాలు ఇస్తారన్నారు. అన్ని డిపాట్‌మెంట్ అధికారులు పాల్గొని సమస్యలు ఉన్నవారు నేరుగా ఎమ్మెల్యేతో తెలియజేయాలని, సమస్యలను తెలుసుకుని వెంటనే అధికారులకు సూచించాలని తెలిపారు. ఆయా స్త్రీలు, కాలనీలలో ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ముఖ్య కార్యకర్తలకు ఎవరి కాలనీలో వారు పాదయాత్రను జయప్రదం చేయాలని, 5వ తేదీన శనివారం బహిరంగ సభ ఉంటుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి, నరేందర్ గౌడ్, బలవంత్ రెడ్డి, మక్కల నర్సింగ్ రావు, కర్రె జంగయ్య, ఇర్ఫాన్, అనురాధ, సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతికగా మొహరం పండుగ



నవతెలంగాణ-దుండిగల్

మతసామరాస్యానికి ప్రాతికగా మొహరం పండుగ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)ఈరోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మొహరం పండుగను హిందువులు ముస్లింలు అందరూ కలిసికట్టుగా పండుగ జరుపుకున్నారు. ఆసన్న హెూసన్నాలను ఊరేగింపు చేసి మసీదుకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళల బాలపీరు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.చంద్రశేఖర్, మొహరం ఉత్సవ కమిటీ నాయకులు మొహనుద్దీన్ ఖలీల్ వహీద్ పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల ను ండి తరతరాలుగా ఈ యొక్క మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో హిందువులు, ముస్లింలు కలిసి కట్టుగా జరుపుకునే పండుగ అని అన్నారు మతసామరస్యం వర్ధిల్లాలని కోరారు. మొహరం పండుగ త్యాగానికి గుర్తుగా జరుపుకునే పండుగ అని అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని మతసామరస్యం వర్ధిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆబిద్ వాజిద్ రుక్ముద్దీన్ సయ్యద్ జమారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహారం పండుగ : ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

త్యాగానికి ప్రతీక మొహరం పండుగని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు అన్నారు. శనివారం మొహరం సందర్భంగా నర్సింహా రెడ్డి నగర్ దర్గలో, ఓల్డ్ నేరేడ్‌మెట్ పీర్ల కొట్టంలో ఎమ్మెల్యే ప్ర త్యేక పార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సతిష్ కుమార్, రామూయాదవ్, గుండా నిరంజన్, ప్రభాకర్, సూరి, వినయ్ గౌడ్, భరత్, మోయిజ్ అలి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: మతసామరస్యాల ప్రతీకగా మొహరం (పీర్ల) ఉత్సవాలు నిలుస్తాయని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం మొహరం పండగ పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం, అంబేద్కర్ నగర్, దేవేందర్ నగర్, కట్ట మైసమ్మ బస్తీ, పరిధిలో పలుచోట్ల ఆయా కమిటీల సభ్యులు ఏర్పాటుచేసిన పీర్ల వద్ద దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నవాబ్ భాయ్, అంబాదాస్, నవీన్, మధు, నరసింహ, ప్రసాద్, రాజు, శ్రీకాంత్, తదితర నాయకులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్: మొహరం పండుగను సూరారం 129 డివిజన్ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం ముస్లింలు ప్రత్యేకంగా ఉపవాసదీక్షలు చేపట్టారు. షాపూర్ నగర్, సూరారం విలేజ్ మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. సాయంత్రం పీర్లను పురువీధుల గుండా ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, ఎస్.ఐ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు టాక్ లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పిల్లలు, పెద్దలు కోలాటాలు, ఆటపాటలతో డప్పు చప్పుళ్ల మధ్య షాపూర్ నగర్ చోటు బాబా పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐలు ఏం పవన్, వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జగద్గిరిగుట్ట: త్యాగాలకు ప్రతీకగా మొహర్రం (పీర్ల) పండుగ నిలుస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం మొహరం పండగ పురస్కరించుకొని గాజులరామారం డివిజన్ బేకరీ గడ్డలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీర్ల పండుగకు ఎంతో విశిష్టత ఉందని తెలంగాణ రాష్ట్రంలో పీర్ల పండుగ పేరుతో హిందూ ముస్లింల సంస్కృతి సాంప్రదాయాలకు, ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లాల్ మహమ్మద్, బేకరీ గడ్డ ప్రెసిడెంట్ గఫర్, కాంగ్రెస్ యువ నాయకులు విశాల్ వాసులు పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 సూరారం డివిజన్ కృష్ణ నగర్ వాసులు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ మోర్చా ఎక్స్యూటివ్ మెంబెర్ కృష్ణ మూర్తి వీణ ఎండీ అజమ్ కేంద్ర రాష్ట్ర వైఫల్యాల పై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై కృష్ణ నగర్ వాసులు మోహన్ రెడ్డి, అబ్బాస్, లక్ష్మణ్ ముదిరాజ్, భాను ప్రసాద్ లు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పాడి రైతుకు ఆర్థిక సహాయం అందజేసిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామానికి చెందిన పిట్ల శంకర్ గేదెలు ఇటీవల కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ శనివారం ఆయన కార్యాలయంలో పిట్ల శంకర్‌కు లక్ష రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణ యాదవ్, గోపాల్ రెడ్డి, ఆనంద్ కుమార్, భరత్ కుమార్, పాక్స్ డైరెక్టర్ వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ జనరల్ సెక్రెటరీ కొల్తూర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజి పైపు లైన్ నిర్మాణ పనుల కోసం మేయర్‌కు వినతి

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ స్వతంత్ర కార్పొరేటర్ బి.వెంకట రామయ్య శనివారం మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డిని కలిసి డివిజన్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజ్ పైపు లైన్ నిర్మాణ పనుల మంజూరి కొరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ కార్పొరేషన్ పరిధిలో మౌళిక సదుపాయాలు కల్పించడానికి ఎల్లపుడూ కృషి చేస్తామని తెలియజేశారు.



అల్వాల్ సర్కిల్ నూతన ఉపకమిషనర్‌గా వి. శ్రీనివాస్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అల్వాల్ పట్టణ అభివృద్ధికి తాము చేస్తున్న కృషికి ప్రజలందరి సహకారం అవశ్యమన్నారు. ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి అల్వాల్ పట్టణ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఆయన కోరారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను అల్వాల్ సర్కిల్ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి అభినందించారు.

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ పాత పోస్ట్ ఆఫీసు దగ్గర వర్షానికి డ్రయినేజ పొంగి ఓవర్ ప్లో అవడంతో తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని చెట్టు వీరింగడని తొలగించాలని కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే స్పందించి శాని టేషన్ సబ్బందిని పిలిపించి క్లీనింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్ రైజర్ శీనివాస్, రాములు, యాదగిరి అధ్యక్షుడు సత్యమూర్తి, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉమాపతి పాల్గొన్నారు.



నవతెలంగాణ-మల్కాజిగిరి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు, రెయిన్ కోట్స్ అందజేత



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం శనివారం ఉషోదయ కాలనీ పార్కులో లయన్స్ క్లబ్ ఆఫ్ ,లయన్స్ క్లబ్ హెరిటేజ్ సంయుక్త ఆధ్వర్యంలో హరితహారం, రెయిన్ కోట్స్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి హాజరై ప్రారంభించారు. అనంతరం అందులో 500 లకు పైగా మొక్కలను లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి నాటారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ 50 మంది సిబ్బందికి రెయిన్ కోట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ గాజులరామారం, పీఎస్‌టీ సతీష్ బాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రంజిత్ కుమార్, రాజేష్, జీవన్, రమేష్ బాబు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలం కారణంగా రోడ్లకి ఇరువైపుల పూలు, పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ శంభీపూర్ రాజు సహకారంతో అందజేస్తున్నటువంటి గొడుగులు, బ్యాగులను శనివారం జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో పూల, పండ్ల వ్యాపారులకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ మహిళా అధ్యక్షు రాలు బింగి ఇందిరా గౌడ్, యూత్ నాయకులు కొలుకుల జైహింద్ స్థానిక నాయకులు పి.వెంకట్ రెడ్డి, పాపులు గౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఇన్‌చార్జి వేమూరి శంకర్ గౌడ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



జన సేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి వేమూరి శంకర్ గౌడ్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం డివిజన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రెటరీ, కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని యువకులను, పవన్ కళ్యాణ్ గారి అభిమానులను, వీర మహిళలను జనసేన పార్టీలోకి ఆహ్వానించి యూత్ వింగ్, శక్తివంతమైన వీర మహిళ విభాగాలను నియమిస్తామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నాలాలపై, ట్రాఫిక్ సమస్యలపై, వంద పడకల హాస్పిటల్ పై , ప్రభుత్వ పాఠశాల కొంకు పోరాడడం జరిగిందన్నారు. ప్రజల ఆశీస్సులతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన జెండా ఎగర వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





బండి సంజయ్ కుమార్‌కి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమిస్తూ శనివారం బీజేపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించడంతో శనివారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, నాయకులు కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. రెండోసారి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన డి.కె.అరుణకు, కరీంనగర్ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బండి సంజయ్ కుమార్‌కు కాంతారావు శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ బీసీ వికాస్ సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, బీసీ సమాజ్ జర్నలిస్ట్ ఫోరం సభ్యులు తేళ్ల హరికృష్ణ బీజేపీ శ్రేణులు వద్దేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మణిపూర్‌లో ప్రధానమంత్రి రాజీనామా చేయాలి



- ప్రజా సంఘాల నాయకులు డిమాండ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మణిపూర్‌లో హింసకాండను ఆపలేని ప్రధానమంత్రి రాజీనామా చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ హింసకాండను నిరసిస్తూ శనివారం జేఎన్‌టీయూ ప్రగతి నగర్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో మణిపూర్ హింసను ఆపాలని కోరుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఎం శంకర్, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎం చంద్రశేఖర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు, ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు బాబు నాయక్, వెంకటేశ్వరరావు, మహేష్ రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. మణిపూర్ హింసకు ముఖ్యమంత్రి వీరేంద్ర సింగ్‌ను మాత్రమే బలి పశువును చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. రాష్ట్రాల్లో కూడా బీజేపీకి అధికారాన్ని కట్టబెడితే ఆయా రాష్ట్రాల వ్యవహారాలను తాను నేరుగా నియంత్రిస్తానని చెప్పుకుంటున్న పెద్దమనిషి మణిపూర్‌లో తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ పరిస్థితిని ఎందుకు నియంతించలేకపోతున్నారన్నారు. నగ్నంగా ముగ్గురు మహిళలను ఊరేగింపు చేసి లైంగికదాడి చేసి హత్య చేశారని తెలిపారు. ఇలాంటి ఎన్నో ఘటనలు జరుగుతున్నాయని అక్కడి సీఎం అందుకే ఇంటర్నెట్ కట్ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై ఏమాత్రం మాట్లాడటం లేదని, వెంటనే ప్రధాన మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు బాలు, నరసింహ చారి, వీరారెడ్డి, శ్రీను, కృష్ణ , మల్లేష్ , అశోక్, జ్యోతి, రాజు పాల్గొన్నారు.

బాలానగర్: మణిపూర్‌లో ఆదివాసీ గిరిజన కుకీ తెగకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని, దీనికి బాధ్యత వహిస్తూ బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని దళిత సంక్షేమ సంఘం జా తీయ ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన మహి ళలను నగ్నంగా ఊరేగించి లైంగిక వాడి చేసి హ త్య చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పోలీ సులు చూస్తుండగానే మహిళల ను ఊరేగించడం సభ్య సమాజం తలదించుకునే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో కేంద్ర ప్రధాన మంత్రి, హెూంమంత్రి అమిషా, ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, దేశంలో ఎక్కడో ఒకచోట చిర్చు రగులుతూనే ఉండాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు భావిస్తున్నాయని ఆరోపించారు. మణి పూర్ వంటి కొండ ప్రాంతాల్లో సంపదను కార్పొరేట్ శక్తుల పరం చేయడానికే ఈ తరహా విద్వేశాలను బీజేపీ రెచ్చగొ డుతున్నదని విమర్శించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



జగద్గిరిగుట్ట: మణిపూర్‌లో క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ గారు అన్నారు. మణిపూర్‌లో క్రైస్తవుల పై జరుగుతున్న హింసకాండను నిరసిస్తూ శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని చివరి బస్ స్టాప్‌లో క్రైస్తవ సోదరులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు హేయమైన చర్య అని అభివర్ణించారు. మణిపూర్‌లో దాడులను ఆపి శాంతిని నెలకొల్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి: మణిపూర్ ఘటనకు నిరసనగా కూకట్‌పల్లిలో క్రిస్టియన్‌లతో శాంతి ర్యాలీ తీస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, క్రిస్టియన్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం చాలా ప్రశాంతంగా ఉండేదని అన్ని కులాలు, మతాలవారు ప్రశాంతంగా జీవించేవారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలను అన్ని కులాలను సమానంగా చూసే ముఖ్యమంత్రి కేసీఆర్ తమ పార్టీ ఎంపీలతో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా పార్లమెంటులో సైతం నిరసన వ్యక్తం చేసి మోడీపై అవిశ్వాస తీర్మానం సైతం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇలాంటి ఘటనలు పురావృతం అయితే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నుండి కార్యకర్త వరకు ప్రధానమంత్రి మోడీపై తిరుగుబాటు చేస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర రావు.. క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు డేవిడ్ పాల్గొన్నారు.



ఈపీఎస్ 95 పెన్షన్ లేకపోతే ఓటు వేసేది లేదు: టాప్ర



నవతెలంగాణ-మల్కాజిగిరి

దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 75 లక్షల మంది ఈపీఎస్ 95 పెన్షన్ దారులకు పూరట కలిగేలా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే కనీస పెన్షన్ రూ. 9000కు పెంచాలని, తదనుగుణమైన కరువుభత్యం ప్రకటించాలని "తెలంగాణ అల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్"(టాప్రా) రాష్ట్ర అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్ భవన్‌లో టాప్రా మల్కాజిగిరి ఏరియా కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా టాప్రా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా శాఖ అధ్యక్షుడు వి. చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి టి. బాలగంగాధరరావులు పాల్గొన్నారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ అనేక లోసుగులతో ఉన్న ఈపీఎస్ 1995 చట్టాన్ని అడ్డుపెట్టుకుని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ కేంద్ర కార్యాలయం వారు కలసి దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్లు అయిన ఈపీఎస్ పెన్షన్ దారులను పెడదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. టాప్రా జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా పెన్షన్ దారుల సమస్యల పై పోరాటం చేస్తుందని, ప్రస్తుతం ఈపీఎస్ పెన్షన్ దారుల సమస్య చాలా దారుణంగా ఉందని ఈ ఎన్నికల సమయంలో తాము కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచడానికి కార్యక్రమాలు తీవ్రం చేస్తున్నట్లు అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలగంగాధరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఈపీ ఎస్ పెన్షన్ దారులు నెలకు రూ. 1000 పెన్షన్ పొందుతున్నారని, అందుచేత కేంద్ర ప్రభుత్వం వారు గౌరవప్రదంగా జీవించడానికి కనీస పెన్షన్ తొమ్మిది వేలకు పెంచాలని అన్నారు. టాప్రా రాష్ట్ర కమిటీ సభ్యుడు, మల్కాజిగిరి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు టి. నిరంజన్ మాట్లాడుతూ తాను స్టేట్ ప్రభుత్వ పెన్షన్ దారుడిని అయినా ఈపీఎస్ పెన్షన్ దారుల దయనీయ స్థితి తనను కలసివేసిందని అన్నారు. సమావేశం ప్రారంభంలో టాప్రా మల్కాజ్ గిరి ఏరియా కమిటీ అధ్యక్షుడు ఆర్. అశోక్ అతిథులకు స్వాగతం పలికి, సమావేశానికి అధ్యక్షత వహించారు. ఏరియా కమిటీ కార్యదర్శి జి. ఆర్. విజయకుమార్ టాప్రా ఏరియా కమిటీ కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు. వారు మాట్లాడుతూ రాబోయే జనరల్ ఎన్నికలలో పాల్గొనే ప్రతి రాజకీయ పార్టీ తమ తమ మేనిఫెస్టోలో ఈపీఎస్ పెన్షన్ దారుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదుపరి "జాగో ఈపీఎస్ 95 పెన్షనర్స్", "నో హైయ్యర్ పెన్షన్ నో వోట్" (ఈ. పీ. ఎస్. 95 పెన్షన్ దారుడా మేలుకో!, పెన్షన్‌లో పెంపుదల లేకపోతే వోటు వేసేది లేదు) అనే స్టిక్కర్‌ను విడుదల చేశారు. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్టిక్కర్‌ను పంపిణీ చేశారు. ప్రతి ఈపీఎస్ పెన్షన్ దారుడు తమ ఇంటి ముందు ఈ స్టిక్కర్ ప్రదర్శించాలని, పెన్షన్ దారులు అందరూ ఐక్యమత్యంతో పోరాటం సాగించాలని సమావేశం పిలుపునిచ్చింది. ఏరియా కమిటీ కోశాధికారి నర్సింగరావ్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

ముంపు ప్రాంతాల్లో సరుకులను అందజేసిన గాంధీ



- అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గురుగోవింద్ సింగ్ నగర్, పీజేఆర్ నగర్ ఫేస్ 1 కాలనీలలో గల వరద ముంపు ప్రాంతాలలో ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ పర్యటించి అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జగద్గిరిగుట్ట సి.ఐ క్రాంతి కుమార్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి యోగ క్షేమలు తెలుసుకొని నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టామని, ఎవరు అధైర్య పడకూడదని, మీకు అన్ని విధాలుగా అండగా అండగా ఉంటామన్నారు. లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ముంపు ప్రాంతాలు మునిగిపోకుండా ముందస్తు చర్యలో భాగంగా అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలని, మాన్ సున్ ,ఎమర్జెన్సీ టీమ్స్‌లు అన్ని పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, జీహెచ్ఎంసీ అధికారులు, ఎఈ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సమ్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాశినాథ్ యాదవ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్టీల పేరుతో సత్యనా రాయణ, అతని కుమారుడు మల్లికార్జున్ దాదాపు మూడు కోట్ల రూపాయలు మోసం చేశారని 115 మంది బాధితులు మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని మల్కాజిగిరి ఇన్స్పెక్టర్ రవికుమార్ బాధితులకు హామీ ఇచ్చారు.

నవతెలంగాణ-మల్కాజిగిరి

సహనానికి, త్యాగనిరతికి ప్రతీక ఈ మొహర్రం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్, బ్రహ్మ శంకర్ నగర్ చౌరస్తా లో టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి నేతత్వంలో బీఆర్ఎస్ రహమత్ నగర్ డివిజన్ సినియర్ నాయకులు తంగెళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మొహర్రం సందర్భంగా షర్బత్‌ను ఏర్పాటు చేసి, డివిజన్ మైనారిటీ నాయకులు మహమద్ శెర్ అలం, మహమద్ అహ్మద్‌ల ద్వారా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా తంగెళ్లపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ మొహర్రం అంటే త్యాగానికి ప్రతీక, సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం అన్నారు. మహమద్ జలాల్,సల్మాన్,నదీమ్ బోడ రవి కిరణ్, విఘ్నేష్, రాహుల్, ఆకాశ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు



నవతెలంగాణ-బేగంపేట్

మణిపూర్‌లో రెండు నెలలుగా అల్లర్లు జరుగుతున్నాయని, వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అల్లర్లను ఆపాలని ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షులు శావల జోసెఫ్, బిషప్ ధన్ రాజ్ కోట, ప్రభుదాస్ కోరారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లపై శనివారం హరి హర కళాభవన్ లో ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థన చేశారు. గతం నుంచి ఇలాంటి సంఘటన జరుగుతున్నా కేంద్రంగాని, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు.

తెలుగు భాష పరిరక్షణ సినారేకు నివాళి

- మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు



నవతెలంగాణ-కల్చరల్

కొన్ని సంవత్సరాలుగా ఎన్నో ప్రాంతీయ భాషలు అంతరించిపోతున్నాయని, తెలుగు భాష పరిరక్షణ కు ప్రభుత్వం కట్టుబడాలని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సి.హెచ్.విద్యా సాగర రావు అన్నారు. సినారె కు నివాళిగా ఈ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ నిర్వహణ లో సినారె 92వ జయంతి సందర్భంగా విఖ్యాత హిందీ కవి జావీద్ అక్తర్‌కు సినారే పేరిట విశ్వంభర పురస్కారం ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విద్యాసాగర రావు పాల్గొని ట్రస్ట్ పక్షాన రూ. ఐదు లక్షల చెక్కు, జ్ఞాపిక ప్రశంసా ఫలకం బహు కరించి మాట్లాడారు.అక్షర సేద్యం చేసిన సినారె విశ్వంభర కావ్యంలో మానవుడు భౌగోళం ల సంబంధాలను తాత్వికం గా చెప్పారన్నారు. ఆయన కవిత్వం కాలానుగుణంగా సమన్వయంగా మానవీయత సిద్ధాంతంగా కవిత్వం రాసారని అన్నారు. అక్తర్ వామపక్ష భావజాలం కల వారని ఆయన సలీం తో కలసి రాసిన నాటి సినిమాలు దీవార్ షోలే వంటివి మరుపు రాని వన్నారు. సినారె జ్ఞాన కేంద్రం తన గ్రామంలో నిర్మిస్తున్నామన్నారు. మనిషి మట్టి లో కలిసి పోతారు కానీ అక్షరం నక్షత్రమై ప్రకాసిస్తుందని అన్నారు. వ్యవ సాయ శాఖామంత్రి నిరంజన్ రెడ్డి సినారే రచించిన సమవ్యం వ్యాస సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ జావీద్ అక్తర్ ప్రగతి శీల మానవతా వాది సినారే అభ్యుదయ మానవతావాది అన్నారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వీ.రమణ సినారె పురస్కారం జాతీయ స్థాయి లో ఏర్పాటు చేసి జావీద్ అక్తర్ ని ఎంపిక చేయటం దేశం ను ప్రతిబింబిస్తే సినారె రూపు మాట పాట తెలుగుకు ప్రతి రూపం అని అభివర్ణించారు. పురస్కార గ్రహీత అక్తర్ మాట్లాడుతూ భాష మనుష్యులమధ్య సంబంధాలు కోసం కాగా అదే భాష విభేదాలకు కారణం అవుతోందన్నారు. వచనం లో కంటే అంతరంగ భావాలు కవితలో చెబితే హృదయానికి తాకుతుంది అన్నారు. సాంకేతిక యాంత్రిక కాలంలోను కవిత్వం మానవీయ విలువల పెంపునకు అవసరం అన్నారు. కవిత్వంలో సంగీతం సంగీతంలో కవిత్వం ఉంటుందని విశ్లేషించారు. సినారే కవిత్వంను తాను ఉర్దూ లో అనువదిస్తానని తెలిపారు. ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య స్వాగతం పలికిన కార్యక్రమంలో దీపక్ మహన్, సినారే మనువడు లయ చరణ్, మనుమ రాలు మనస్విని, వై.లక్ష్మీ ప్రసాద్ పాల్గొనగా పత్తి పాక మోహన్ వ్యాఖ్యానం చేశారు దీపికా రెడ్డి శిష్యులు సినారె గీతాలకు నృత్యాభి నయం ఆకట్టుకుంది

వర్షాకాలంలో వ్యాధులతో అప్రమత్తం

- సెంచురీ ఆస్పత్రి వైద్యుల సూచన
- ఆంజనేయస్వామి ఆలయంలో ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలనీ, ముఖ్యంగా నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవడం, తాగునీరు కలుషితం కాకుండా వేడిచేసి చల్లార్చి తాగడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సెంచురీ ఆస్పత్రి వైద్య నిపుణులు సూచించారు. రామచంద్రాపురంలోని ఎల్ఐజీ కాలనీలో గణపతి సచ్చిదానంద ఆశ్రమం సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో.. 20వ చాతుర్మాస దీక్ష సందర్భంగా



సెంచురీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ప్రాంత వాసులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేయడంతో పాటు, అవసరమైన వారికి మందులు, ఇన్‌హేలర్లు కూడా ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరంలో సెంచురీ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ఆర్థోపెడిషియన్ డాక్టర్ కె.సజిత్, ఈఎన్‌టీ వైద్యనిపుణుడు డాక్టర్ కె.చైతన్య, కన్సల్టెంట్ పల్మనాలజిస్టు డాక్టర్ భరత్ తదితరులు పాల్గొని, హాజరైన ప్రజలందరికీ వివిధ వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలంలో నీళ్లలో జారిపడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, అలాంటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి అవసరమైతే ఎక్స్ రే తీయించుకోవాలని డాక్టర్ సజిత్ చెప్పారు. చెమ్మ ఎక్కువగా ఉండటం వల్ల చెవుల్లోకి నీళ్లు చేరితే వెంటనే తగువిధంగా శుభ్రం చేసుకోవాలనీ, గోరువెచ్చటి నీళ్లు తాగడం మంచిదని డాక్టర్ చైతన్య తెలిపారు. ఆస్థమా లాంటి సమస్యలు ఉన్నవారు వర్షాలకు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ భరత్ సూచించారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన దాదాపు 150 మంది వరకు శిబిరానికి హాజరై, వైద్యుల సూచనలు తెలుసుకోవడంతో పాటు వివిధ వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకెళ్లారు.

మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాదాపు మూడు నెలల నుంచి మణిపూర్ రాష్ట్రంలో మైతి, కుకీ రెండు జాతుల మధ్య ఘర్షణలను నిలువరించడంలో మణిపూర్ బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని విమర్శించారు. ఆ ఘర్షణలను బీజేపీ రాజకీయం కోసం ఉపయోగించుకుంటున్నదని ఆరోపించారు.మణిపూర్ అల్లర్లకు బాధ్యత వహిస్తూ దేశ హెూంశాఖ మంత్రి అమిత్ షా, ఆ రాష్ట్ర సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేయాలని, మహిళలపై ఆకత్యాలకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.మణిపూర్ లో శాంతిని నెలకొల్పేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ లోని వెంకటరెడ్డి నగర్ కాలనీ వాసులు శనివారం కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్‌ను ఆమె నివాసంలో కలిశారు. ఈ సంద



ర్భంగా కాలనీ వాసులు వారి గల్లీలో సమస్యలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గల్లీలో రోడ్డు మొత్తం పాడైపోయిందని, గుంతలు ఏర్పడ్డాయని, వర్షపు నీరు డ్రయినేజీ నీరు ఆగి చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. మంచినీటిలో కలుషిత జలాలు కలుస్తున్నాయని, డ్రయినేజీలు మరమ్మతులు చేయించాలని కోరారు.కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి త్వరలో అధికారులను తీసుకొచ్చి అన్ని పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య, పారుపల్లి హనుమంతరావు, పీసరి శంకర్, మల్లికార్జున గౌడ్, శశిధర్ ,బాస్కర్ ,శ్యామ్, శ్రీనివాస్,రాకేష్, జావేద్ ,బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన జియాగూడ ఆరె కటిక సంఘం నాయకులు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఆరెకటిక సంఘం జియాగూడ అధ్యక్షులు టి నర్సింగ రావు, ఆరెకటిగా చర్మకా సంఘం అధ్యక్షులు వీ శశికాంత్ రావు, ప్రధాన కార్యదర్శి పి దర్శన్ కుమార్ తదితరులు శనివారం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసి జియాగూడ స్లాటర్ విషయమై ఆయనకు వినతి పత్రం అందించారు. నూతన కమెలా నిర్మాణ విషయమై వివరించారు. గత కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యథా స్థానంలోనే ఐదు కమేళాలను నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించిందని, దానికి అనుగుణంగా నాలుగు స్లాటర్ అన్నారు. కానీ జియాగూడ స్లాటర్ హౌస్ నిర్మించలేదని... 2012లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారి క్లియరెన్స్ వల్ల నిర్మించడానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. కానీ నేటికీ నిర్మాణ దశ విషయంలో రాష్ట్ర ప్రభుత్వము చొరవ చూపడం లేదని చెప్పారు. 2020లో జియాగూడ డబుల్ బెడ్ రూమ్ ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు సంబంధిత మున్సిపల్ మంత్రి కే తారక రామారావు జియాగూడ స్లాటర్ నిర్మిస్తామని, రూ. 30 కోట్లతో ఆధునిక కబేలా నిర్మించి ఆరె కటిక కుల వత్తుల, మహిళా వితంతువులు, దళితులు, మైనారిటీ వారు దీనిపై ఆధారపడి జీవిస్తున్న అందరిని ఆదుకుంటామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఎన్నోసార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ తాత్సారం చేస్తూ నేటికీ శంకుస్థాపన దిశగా ముందుకు సాగడం లేదు అన్నారు. ఇప్పటికైనా మంత్రి కేటీఆర్ వెంటనే జియాగూడ స్లాటర్ నిర్మాణాన్ని ప్రభుత్వ వ్యయంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించాలన్నారు. దీనిపై ఆధారపడి జీవిస్తున్న 5000 కుటుంబాలని ఆదుకోవాలని రేవంత్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించి రేవంత్ రెడ్డి త్వరలోనే జియాగూడ కమేళాను సందర్శిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాంలో నాయకులు కే సుభాష్, జి జ్ఞానేశ్వర్, డి హరి కిషన్, కేఎన్ మనోజ్ కుమార్, వి సత్యం, కేఎన్ ప్రేమ్ కిషోర్, జి నరేష్, కే సాయి, ఎం గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు డిప్యూటీ మేయర్ నివాళులు

నవతెలంగాణ-ఓయూ

తార్నాక ఉప్పర్ గూడ నివాసి వెంకటేష్ శర్మ(44)కు శుక్రవారం రాత్రి ఫిట్స్ రావడంతో వెంటనే హాస్పిటల్ తరలించగా హఠాత్తుగా గుండెపోటు వచ్చి పరిస్థితి విషమించి మృతి చెందారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్



మోతె శ్రీలత శోభన్ రెడ్డి, మోతె శోభన్ రెడ్డిలు వెంకటేష్ శర్మ నివాసానికి వెళ్లి వారి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ. వెంకటేష్ శర్మ చాలా మంచి వ్యక్తి అని, అందరితో సరదాగా, కలివిడిగా కలిసిపోయే వ్యక్తి అన్నారు. ఆయన 2004లో బీఎస్పీ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారని... తరువాత వెంకటేష్ శర్మ తన సమక్షంలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరి ఉద్యమంలో తనతో పాటు అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారన్నారు. మంచి అనుచరుడిని కోల్పోయానని భావో ద్వేగంతో మాట్లాడారు. అనంతరం శ్రీలత శోభన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఓదార్చుతూ తాము ఎల్లవేళలా మీ కుటుంబానికి, పిల్లలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉద్యమ సహచర్లతో పాటు ఉప్పర్ గూడా నివాసులు, వెంకటేష్ శర్మ స్నేహితులు, పాల్గొన్నారు.

'సాధ్యం కాని డిమాండ్స్‌తో వర్గీకరణ ఆగింది'

నవతెలంగాణ-ఓయూ



గత 30 సంవత్సరాలుగా మాదిగ దండోరా నాయక త్వంలో ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లను వర్గీకరించాలని చేస్తున్న న్యాయమైన డిమాండ్ నెరవేరకపోవడానికి ప్రధాన కారణం సాధ్యం కానీ డిమాండ్లే అని ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయశాఖా ధిపతి ప్రొ. డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. భారత రాజ్యాంగం అధికరణ 341 సవరించాలంటే పార్లమెంటు ఉభయ సభల్లో రెండో వంతు మెజారిటీ, 50 శాతం రాష్ట్రాల్లో అసెంబ్లీ తీర్మానం జరగాలని, అది ప్రస్తుత రాజకీయాల పరంగా సాధ్యం కానీ పరిస్థితి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యా ఉద్యోగ రంగంలో జోనల్ పద్ధతి ద్వారా ప్రాంతాల మధ్య పంపిణీ న్యాయం జరిగినట్టే షెడ్యూల్ కులాల మధ్య రిజర్వేషన్ల అసమానతలు రూపుమాపాలంటే జనాభా దామాషా పద్ధతిలో జిల్లాను యూనిట్ చేసుకొని 371డి అధికరణను రాష్ట్రపతి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా సవరించి ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లను ఇరు రాష్ట్రాల్లో జోనల్ పద్ధతి ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఆ దిశగా మాదిగ మాల నాయకులు ఎవరికి నష్టం జరగని ఈ పద్ధతి ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

భక్తులకు మంచినీరు, పాలు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

పాత బస్తీలో శనివారం నిర్వహించిన బీబీ కా ఆలం ఊరేగింపు సందర్భంగా లతామా ఫౌండేషన్ ద్వారా భక్తులకు మంచి నీరు, పాలు అందించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ మాధవి లత, లతామా ఫౌండేషన్ వారు ఏనుగు అంబారీపై ఉన్న బీబీ కా ఆలం కు దట్టీ సమర్పించారు. పత్తర్ ఘట్టీ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక ద్వారా ఊరేగింపులో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్లేవర్డ్ మిల్క్‌తో పాటూ ఇతరత్రా పానీయాలను అందించారు. ఈ సందర్భంగా మాధవి లత మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో పవిత్రమైన మొహరం సందర్భంగా నిర్వహించే ఈ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణపై కేంద్ర మంత్రి వ్యాఖ్యాలను స్వాగతిస్తున్నాం'



నవ తెలంగాణ-బంజారాహిల్స్

రాజ్యసభలో ఎస్సీ వర్గీకరణ పై కేంద్ర మంత్రి నారాయణస్వామి వ్యాఖ్యల్ని స్వాగతిస్తున్నామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ జీ చెన్నయ్య అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు రాజ్యసభలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ ఏడు రాష్ట్రాలు మాత్రమే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయని 14 రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పడాన్ని మాల ప్రజా సంఘాల జేఏసీ స్వాగతిస్తుందన్నారు. ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని గౌరవించాలన్నారు. లేదంటే స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల మధ్య చిచ్చుపెట్టి విభజించి పాలించాలని చూస్తే కిషన్ రెడ్డి ఎక్కడ పోటీ చేసినా అక్కడ 200 మందితో నామినేషన్లు వేసి ఆయనను ఓడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ కాదని మన సోదరులు తెలుసుకోవాలన్నారు. బీజేపీగానీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చే ఏ పార్టీనైనా వచ్చే ఎన్నికలో బొంద పెడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ చైర్మెన్ లు మన్నే శ్రీధర్ రావు,గోపోజు రమేష్,కన్వీనర్లు బైండ్ల శ్రీనివాస్, బంగి ఆనంద్రావు, కమల్, రాకేష్ ఎల్లస్వామి, గోకుల కళ్యాణ్, బూరుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల ప్రజల సహజీవనానికి తెలంగాణ ప్రతీక



- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

అన్ని మతాలు, కులాల ప్రజల సహజీవనానికి తెలంగాణా ప్రాంతం ప్రతీకగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో అంబర్ నగర్ చిల్లా, వారసిగుడా ప్రాంతాల్లో మొహర్రం ను పురస్కరించుకొని షర్బత్ పంపిణీ శిబిరాల్లో డిప్యూటీ స్పీకర్ పాల్గొని షర్బత్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సంప్రదాయాలను తాము సంపూర్ణంగా గౌరవిస్తామని పేర్కొన్నారు. స్థానిక నిర్వాహకులతో పాటు మైనారిటీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ పనుల్లో నిర్లక్ష్యం తగదు



- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

బాక్స్ డ్రైన్ పనుల్లో అలసత్వం వహించొద్దని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హెచ్చరించారు. తార్నాక డివిజన్ గోకుల్ నగర్‌లో నూతనంగా వేస్తున్న బాక్స్ డ్రైన్ పనులను టీటీయూసీ వ్యవస్థాపక అధ్యక్షులు శోభన్ రెడ్డితో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికులకు ఎలాంటి ఆటంకాలు

అడ్డగుట్టలో 100 పడకల ఆస్పత్రి నిర్మించాలి

- ప్రభుత్వ భూముల సంరక్షణకు కృషి చేయాలి
- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. వెంకటేష్



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్ట డివిజన్ పరిధిలో వెంటనే 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేయాలని, డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల సంరక్షణ కోసం కషి చేయాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. వెంకటేష్ కోరారు. అడ్డగుట్టలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను ఉపయోగించాలనిచ భూ కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజానికం అడ్డగుట్టను కష్టపడి 1978-79 సంవత్సరాలలో ఏర్పాటు చేసుకున్నప్పుడు భవిష్యత్తు అవసరాల కోసం జి.ఎం అంజయ్య లాంటి వ్యక్తులు, అనునిత్యం పేదల పక్షాన ఉన్న కమ్యూనిస్టు పార్టీల నాయకులు కొంత భూమిని మిగిలించి పెట్టారని గుర్తు చేశారు. అలాంటి భూమిని మిగిల్చారు కాబట్టే అద్దె (కిరాయి) భవనాలలో ఉన్న ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ హైస్కూలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సంస్థలను సొంత స్థలాల్లో ఏర్పాటు చేయించుకోగలిగామన్నారు. అడ్డగుట్టలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటర్, డిగ్రీ కాలేజీలు, కళ్యాణ మండపం, ప్రభుత్వ హైస్కూల్‌కు ఆటంకంగా ఉన్న ఎమ్మార్వో ఆఫీస్‌కు కూడా స్థలం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మారేడుపల్లి మండల పరిధిలోని సర్వే 74, 844/1లలో 603 ఎకరాల ప్రభుత్వభూమి ఉంటే సొసైటీల పేరుతో కబ్జాచేసి ఇండ్లు నిర్మించుకున్న వారు కొందరైతే, ఆ భూములు మావి అని కబ్జా చేయడానికి కొంతమంది ప్రభుత్వ అధికారులను, కొంతమంది స్థానిక రాజకీయ నాయకులను లోపరచుకొని కబ్జాలకు సిద్ధమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాళ్ళ నివాసం కోసం 50- 60 గజాల ఇంటి స్థలం కోసం ప్రభుత్వాన్ని అడిగి గుడిసెలు వేసుకుంటే అరెస్టులు, జైలు పాలు చేసిన రెవెన్యూ అధికారులు, పోలీసులు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు భూ కబ్జాదారులకు ఇండ్లు నిర్మించుకోడానికి పర్మిషన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వ భూములను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం పేదల కోసం పోరాడుతున్న సీపీఐ(ఎం).. అడ్డగుట్టలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ విషయంలో, ప్రజా సమస్యల పరిష్కార విషయంలో, మీ మద్దతు, మీ సహాయ సహకారాలు అందించాలని కోరుతుందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అడ్డగుట్టలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలు రెండు సార్లు శంకుస్థాపన చేశారని, ఆ స్థలంలోనే ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. మారేడుపల్లి మండల జనాభా 2 లక్షల పైన ఉందని మండల కేంద్రం అయినా అడ్డగుట్టలో జనాభాకు అనుగుణంగా 100 పడకల ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని కోరారు. 2004 లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో మహీంద్రాహిల్స్‌లో 4 ఎకరాల ప్రభుత్వ భూమిలో లేని పేదవారికి "రాజీవ్ గృహకల్ప" నిర్మిస్తానన్నా భూమిని పేదల ఇండ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆ భూములను ప్రభుత్వ ప్రజల అవసరాల కోసం వినియోగించేలా చొరవ చూపాలని కోరారు .కార్యక్రమంలో జోన్ కార్యదర్శి అజయ్ బాబు,నేతలు ఆర్.మల్లేష్, టి.మహేందర్, ఆర్.విరలక్ష్మి, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

మానసిక సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి



- డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

నవతెలంగాణ-బంజారా హిల్స్

ప్రస్తుత జీవనశైలీలు అనుసారంగా మానసిక సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, ఐసీజీసీ చైర్మెన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గచ్చీబౌలిలోని టెలికాం నగర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో నూతనంగా నిర్మించిన ఇండ్లాస్ చైల్డ్ గైడెన్స్ క్లీనిక్(ఐసీజీసీ) ను ఏఐజీ హాస్పటల్ చైర్మెన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి ప్రారంభిస్తారని, ఆయనతోపాటు ప్రముఖ రచయిత, దర్శకులు యండమూరి వీరేంద్రనాథ్,రెయిన్‌బో హాస్పటల్‌కు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు సి.జి.విల్సన్, విశ్రాంత పోలీస్ అధికారి డాక్టర్ డి.టి.నాయక్, వైబ్రంట్ లీవింగ్ ఎండీ శ్రీదేవి జాస్తి, తదితరులు హాజరవుతారని వెల్లడించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు లోగోను ఆవిష్కరించారు.

అనంతరం డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐసీజీసీని ఈ నెల 30న ఆదివారం ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పిల్లల్లో సాధారణంగా వచ్చే ఆటిజం, ఏడీహెచ్‌డీ(హైపర్ యాక్టీవీటి), చదువులో లోపాలు(లెర్నింగ్ డిసిబిలిటీస్), పరీక్షలంటే భయం, సెల్‌ఫోన్, ఇంటర్నెట్, బెట్టింగ్‌కు అతిగా అలవాటు పడడం, డ్రగ్స్‌కు, మద్యపానానికి బానిసవడం, స్కూల్ ఫోబియా, ఎదుగుదలలో లోపాలు, ప్రవర్తనా సమస్యలు, చిన్న వయసులోనే ప్రేమోన్మాదం, ఆత్మహత్యా తలంపులు, మొండితనం, కోపం, పెద్దలకు ఎదురుతిరిగే మనస్తత్వం, నిద్రలో పక్క తడపడం, ఉచ్చారణ దోషాలు(స్పీచ్ సమస్యలు) తదితర అన్ని రకాల మానసిక సమస్యలకు సంబంధించి అత్యాధునిక వైద్య చికిత్సలు ఐసీజీసీలో అందుబాటులో ఉంటాయని చెప్పారు.

ప్రముఖ పిల్లల మానసిక వైద్య నిపుణులు విశాల్ ఇండ్ల మాట్లాడుతూ గడచిన నాలుగు దశాబ్దాలకు పైగా మానసిక వైద్య రంగంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా మానసిక వైద్య సేవలు ఇండ్లాస్ తరఫున ముంబయ్, విశాఖపట్నం,విజయవాడ వంటి మహానగరాల్లో అందిస్తున్న ఈ సేవలను ఇకపై హైదరాబాద్‌లో కూడా విస్తరించి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇండ్ల స్వప్న, ఐసీజీసీకి సంబంధించిన పలువురు వైద్య నిపుణులు, చైల్డ్ సైక్రియాటిస్టులు, సైకాలజిస్టులు, స్పీచ్ థెరపిస్టులు, తదితర చికిత్సా నిపుణులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో పదేండ్ల చిన్నారికి అరుదైన ఆపరేషన్



- వైద్య బృందాన్ని అభినందించిన సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కోఠిలోని ప్రభుత్వ (చెవి ముక్కు గొంతు) ఈఎన్‌టీ ఆస్పత్రిలో శనివారం అరుదైన చికిత్స నిర్వహించారు. హేమలత (10) నల్గొండ జిల్లాలోని నిడమలురు మండ లం ముప్పారం గ్రామం నుంచి తీవ్రమైన శ్వాస ఇబ్బందితో ఆస్పత్రికి వచ్చారు. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారికి శ్వాసనాళంలో అంటే "కెరీనా" అనే ప్రాంతానికి కొంచెం ఎగువ ప్రాంతంలో ఒక పులిపిరి లాంటిది.. దాన్ని వైద్య పరిభాషలో "పాపిల్లోమా" ఉన్నట్టు గుర్తించారు. అలాంటి ఒక పులిపిరి లాంటిది ఎక్కడైతే రెండు ఊపిరి తిత్తులకు ఆక్సిజన్ అందించడానికి గాలి గొట్టం. "ట్రేకియా" రెండుగా విడిపోతుందో అక్కడికి కొద్దిగా ఎగువ ప్రాంతంలో ఈ "పాపిల్లోమా" అనే పులిపిరి పెరిగిందని చెప్పారు. అది రెండు ఊపిరితిత్తులకు కూడా ఆక్సిజన్ అందకుండా అడ్డం పడుతుందన్నారు వాస్తవానికి ఇలాంటి పాపిల్లోమాలు స్వరపేటికలో వస్తాయి కానీ పాప విషయంలో అది "కెరీనా" ప్రాంతంలో పుట్టింది. ఇది ప్రాణానికి ప్రమాదకర ప్రమాదకరమైన గుర్తించి ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి నేతత్వంలో ఆపరేషన్ చేసి ఆ పాపిల్లోమాను తొలగించారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. పాప ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న వైద్యులు డాక్టర్ రవి శంకర్, డాక్టర్ సత్య కిరణ్, డాక్టర్ ఆశీష్, , డాక్టర్ మీనా, మత్తు డాక్టర్ డాక్టర్ ఉమా. ప్రొఫెసర్, డాక్టర్ నిఖిల. స్వప్న, రత్న నర్సులు, బాలు, గోపాల్, శ్రీశైలం పాల్గొన్నారు. ఈ ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్య బృందాన్ని హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి. శంకర్ అభినందించారు





నేటి పిల్లలు విభిన్నంగా ఆలోచిస్తున్నారు

- సినీ నిర్మాత అల్లు అరవింద్

నవతెలంగాణ-బంజారాహిల్స్

నేటితరం పిల్లల ఆలోచనలు సజనాత్మకతకు తోడు విభిన్నంగా ఉంటున్నాయని వాటిని అర్థం చేసుకోవడం ఒక్కోసారి కష్టంగా ఉంటున్నా లోతైన అర్థం ఉంటుందని సినీ నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు మారుతి కూతురు హియా దాసరి గీసిన చిత్రాల ప్రదర్శన వేడుక శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హెూటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి హాజరైన ఆయన చిత్రాలను వీక్షించి హియాను అభినందించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న హియా దాసరి కామిక్ స్టోరీస్‌లోని జోకర్, బ్యాట్‌మెన్, తదితర క్యారెక్టర్లను ఇతివత్తంగా చేసుకొని బ్లాక్ అండ్ వైట్ మోడ్‌లో ది నోయిర్ రెండిజ్‌వోజ్ పేరుతో ఆర్ట్‌షో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హియా మాటాడుతూ తాను 71 చిత్రాలు గీసానని ఈ చిత్రాలన్నీ వేయడానికి 8 నెలల సమయం పట్టిందని అన్నారు. తన ప్రతిభ వెనుకాల తన తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అంశాలపై తన చిత్రాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరో ఆనంద్ దేవరకొండ, సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్, నిర్మాత ఎస్‌కేఎన్, హీరోయిన్ వైష్ణవి, విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- దెబ్బతిన రోడ్లకు మరమ్మతులు చేయాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీవైఎఫ్ఐ నాయకులు అంబర్ పేట నియోజకవర్గంలో పర్యటించి వరదకు దెబ్బతిన్న రోడ్లు, నాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా భారీ వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా వరదలతో నష్టపోయినటువంటి కుటుంబలను ప్రభుత్వం ఆదుకోవాలని, వరదలతో ప్రాణాలు కోల్పోయినటువంటి కుటుంబాలకు రూ. 20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కోల్పోయినటువంటి వారికి ప్రభుత్వమే ఇండ్లు కట్టించాలని కోరారు. రోడ్లు ఎక్కడ పడితే అక్కడ గుంతల మయంగా మారిందన్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి నాసి రకమైన రోడ్లను వేయడం వల్లే తొందరగా రోడ్డు దెబ్బతింటున్నాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో గల్లీలలో నాలాల కోసం, సీసీ రోడ్డు నిర్మాణాల కోసం తవ్వినటువంటివి ఎక్కడపడితే అక్కడ వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావేద్, జిల్లా ఉపాధ్యక్షులు అస్మి బాబు, శ్రీనివాస్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజుల స్కీం పునరుద్ధరించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల రియంబర్స్ మెంట్ స్కీమును పునరుద్ధించాలని, గత రెండు సంవత్సరాల ఫీజుల బకాయిల రూ. 5 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకష్ణ అధ్యక్షతన విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ విద్యార్థులు మహాదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ 2008లో బి.సి. సంక్షేమ సంఘం పోరాడి ఫీజుల రియంబర్స్మెంట్ స్కీము పెట్టించినపుడు కాలేజి కోర్సుల మొత్తం ఫీజులను మంజూరు చేసే విధంగా ప్రభుత్వం జి.ఓ. నెం. 18 జారీ చేసిందని తెలిపారు.2013 వరకు పూర్తి ఫీజులు మంజూరు చేశారన్నారు. ఇంజనీరింగ్ / మెడిసిన్ / యం.బి.ఎ./ యం.సి.ఎ./ పి.జి./ డిగ్రీ తదితర కోర్సుల ఫీజులను ఎంత ఉంటే అంత మొత్తం ట్యూషన్ ఫీజులు, స్పెషల్ ఫీజలు ప్రభుత్వం భరించేదని... 2014లో ప్రభుత్వం పూర్తి ఫీజుల స్కీముకు పరిమితులు విధిస్తూ ఇంజినీరింగ్ కు 35 వేలు మాత్రమే మంజూరు చేస్తామని, ఇతర కోర్సులకు పరిమితి విధిస్తూ జి.ఓ.లో మార్పులు చేశారని గుర్తు చేశారు. చాలా ఇంజనీరింగ్, యం.బి.ఎ., యంసి.ఎ., కాలేజీలలో రూ. 35 వేల కంటే ఎక్కువ ఫీజులు పెంచారని, పి.జి కి రూ. 20 వేల కంటే ఎక్కువ, డిగ్రీకి రూ. 10 వేల కంటే ఎక్కువ ఫీజులు పెంచారని చెప్పారు. పెంచిన ఫీజులు కట్టలేక బి.సి విద్యార్థులు ఆర్థికం గా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, మైనార్టీ ముస్లింలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఫీజులు మంజూరు చేస్తూ జి.ఓ. జారీచేసిందని కాని బి.సి.లు ఉద్యమాలు చేస్తుంటే కూడా బి.సి. విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడంలేదన్నారు. ఎందుకింత బి.సి.ల పట్ల చిన్న చూపని ధ్వజమెత్తారు. బీసీ విద్యార్థుల కు పూర్తి ఫీజుల స్కీం పునరుద్ధరించకపోతే వచ్చే ఎన్నికలలో ఓడిస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణనీల వెంకటేష్, సుధాకర్, అనంతయ్య, రాజ్ కుమార్, నంద గోపాల్, నాగరాజు, భాస్కర్ ప్రజాపతి, మల్లేష్, మోడి రాందేవ్, అరవింద్, నిఖిల్ పటేల్ ,



'రాష్ట్రాన్ని మరో మణిపూర్ చేస్తారా'

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్టాని బీజేపీ మరో మణిపూర్‌గా మార్చాలని చూస్తుందని గిరిజన శక్తి రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ శివ కుమార్ తేజావత్ ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఐక్యంగ ఉంటున్న గిరిజనల మధ్య చిచ్చు పెడుతున్నారని తెలిపారు. మరోసారి రాజకీయ ప్రయోజనాల కోసం ఎంపీ సోయం బాబురావు లంబాడాలను గిరిజనుల జాతి నుంచి తొలిగించాలని కేంద్ర మంత్రికి లేఖ రాయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బీజేపీ నాయకులను తండాలలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించక పోతే రాబోయే కాలంలో వారి అన్ని కార్యక్రమాలను అలాగే వారి పార్టీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

జీవో నెంబర్ 46 పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు



- ఎస్సై కానిస్టేబుల్ అభ్యర్థులు

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ లో ప్రవేశ పెట్టిన జీవో నెంబర్ 46 పట్ల జరుగుతున్న అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని పలువురు పోలీస్ అభ్యర్థులు పేర్కొన్నారు. ఈ 46 జీవో వల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. శనివారం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సేవ్ 46 జీవో అంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ కొందరు కావాలని జీవో 46ను రద్దు చేయాలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. కొంతమంది అభ్యర్థులు స్వలాభం కోసం జీవో రద్దు కోరడం జరుగుతుందన్నారు. అన్ని జిల్లాల అభ్యర్థులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో తీసుకువచ్చినట్టు తెలిపారు. దీనిని రద్దు చేస్తే కొన్ని జిల్లాల అభ్యర్థులకే న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న అభ్యర్థులు ఈ జీవోను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణంలో అవకతవకలు

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ - అడిక్ మెట్

హుస్సేన్ సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో అవకతవకలు జరుగుతున్నాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని దోబీఘాట్, అరుంధతినగర్, సబర్మతినగర్ బస్తీల్లో సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ నగర నేత ఎ. వినయ్ కుమార్ తదితరులతో కలిసి పర్యటించి వరదనీటి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. కోట్ల రూపాయలు వెచ్చించి ప్రణాళికలేకుండా కడుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణంలో అన్నీ అవకతవకలే జరుగుతున్నాయని విమర్శించారు. నాణ్యత లేకపోవడంతో వరదనీటి సమస్య బస్తీలకు తప్పడంలేదని ఆరోపించారు. ఒక్క ఇటుక కూడా పోదని చెప్పిన బీఆర్ఎస్ నాయకులు ఈ బస్తీలలో ఇండ్లు కోల్పోతున్నవారికి ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇండ్లు పోతున్న బాధితులకు నష్టపరిహారం, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇప్పించే విషయంలో కూడా ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంలేదని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మించినా సమస్య పరిష్కారం కాకపోవడంపై ఎవరు సమాధానం చెబుతారని ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసీ కమిషనర్ గాంధీనగర్ డివిజన్ లో పర్యటిస్తే కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ బస్తీలలో వర్షపు వరదనీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించకపోతే బస్తే ప్రజలతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయి. చంద్, నాయకులు శ్రీకాంత్, సత్తిరెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, సురేష్, ముత్యాలు, చంటి, ప్రకాష్ బస్తీల ప్రజలు పాల్గొన్నారు.

పేద,అణగారిన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ.

నవతెలంగాణ-బంజారా హిల్స్

అసంఖ్యాక సంక్షేమ పథకాలు, పేదరిక నిర్మూలన, జాతీయ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ మిషన్, కనీస గ్రామీణ ఉపాధి హామీ, సామాజిక అభ్యున్నతి, అందరికి విద్యా వంటి అనేక అభివద్ధి పథకాలు కాంగ్రెస్ పార్టీయే ప్రవేశపెట్టి అమలు చేసిందని, పేద,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ నిబద్ధతతో పనిచేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ పేర్కొన్నారు. ఎస్ఆర్ నగర్ లో డా. కోట నీలిమ కాంగ్రెస్ శ్రేణులతో కలసి శనివారం పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఎస్ఆర్ నగర్ డివిజన్ వాసుల సమస్యలు పరిష్కరానికి కషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా డా. కోట నీలిమ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ధ్వంసమైన రహదారులు, పొంగిపొర్లుతున్న నాలాలు, డ్రయినేజీ లు, మౌలిక సదుపాయాల లేమితో బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ నాశనం అవుతుందని అన్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ వరద నీటితో నిండిపోవడం, మ్యాన్ హెూల్ గుంతల మరణాలు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సనత్ నగర్ నియోజకవర్గంలో ఎలాంటి అభివద్ధి పనులు జరగడంలేదని, కనీస సౌకర్యాలు లభించక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందుతున్నారని, సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ పాలన ఉంటుందని పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు గుర్తుచేసుకొని, మళ్ళీ కాంగ్రెస్ ను ఆదరిస్తున్నారన్నారు. ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించి పటిష్టంగా సంక్షేమ పథకాలు అందజేస్తామని, ఎన్నికల ముందే కాంగ్రెస్ హామీల గ్యారెంటీ కార్డులను కూడా అందజేస్తామని డా. కోట నీలిమ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, హక్కు సంస్థ వాలంటీర్లు సుదీర్ కుమార్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకల్లో పాల్గొన్న క్రిశాంక్

నవతెలంగాణ-కంటోన్మెంట్



మొహర్రం పుష్కరించుకొని తెలంగాణ ఖనిజాభివద్ధి సంస్థ చైర్మెన్ మన్నే క్రిశాంక్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని కాకాగూడ, రసూల్‌పురా, బోయినపల్లి, బాలంరాయిలోని ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పీర్ల ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. నాజర్, అమర్, ఫహీం, ముక్తార్, చోటు, ఇలియాస్, అమెర్, సబీరా, జరీనా, యూనస్, సబేర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వల్లారపు శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు బౌద్ధ నగర్‌లో ఆయన నివాసంలో ఘనంగా కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులు నిర్వహించారు. పలువురు ఆయనతో కేక్ కట్ చేయించి బొకేలు, దండలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం అభివృద్ధి కోసం, సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో అండగా ఉంటూ ప్రజా సమస్యలపై ఉద్యమిస్తా అన్నారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసిన వారికి ధన్యవాదాలు చెప్పారు.



పలు ప్రాంతాల్లో మొహరం వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

రసూల్‌పూరా, కార్ఖానా, సిక్ విలేజ్, తాడ్బండ్ ప్రాంతాల్లో జరిగిన మొహరం వేడుకల్లో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత నివేదిత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు ఈ సంద ర్భంగా ముస్లింలు వారిచే ప్రత్యేక పూజలు చేయించి సన్మా నించారు. అలాగే ముస్లిం మహిళలు స్వాగతం పలికారు

మొహర్రం పండుగ సందర్భంగా శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో సిఖ్ విలేజ్, తాడ్ బండ్, కాకాగూడ లోని పలు పీర్లను ఘనంగా ఏర్పాటు చేశారు ఈ పీర్లను పలు రాజకీయ పార్టీ నేతలు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష ముస్లిం సోదరులకు మొహర్రం పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో పీర్లకు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. తెలంగాణాలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను అందరూ కలిసి మెలసి ఆనందంగా జరుపుకోవాలని చెప్పారు ఖాజా, దావుద్, సలీం, అన్వర్, సుభాన్, షార్ఫు, తాజ్, నసీర్, గౌస్, అహ్మద్, ఇనౌస్ తదితరులు పాల్గొన్నారు.




మాజీ మంత్రి ముఖేష్ గౌడ్‌కు నివాళి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ సంస్మరణ సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించిన ప్రజా ఏక్త పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్. పార్టీ నాయకులు ఎంకే సరేందర్. ధర్మేందర్ తివారి. సురేష్ గౌడ్ రామ్ సింగ్ ఓజా తదితరులు ఉన్నారు.



గత మూడు నెలలుగా మణిపూర్ మండిపోతున్నది. సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోజువారి కూలీలు జీవనోపాధిని కోల్పోయారు. తిండికి దూరమయ్యారు. మహిళలు అనేక రకాలుగా హింసకు గురవుతున్నారు. పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. అల్లర్లతో కొందరు ప్రాణాలు కోల్పోయారు. అక్కడ మహిళలను నగ్నంగా నడిపించి సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. దేశంలో మహిళల పరిస్థితి ఏంటని ఆవేదన మొదలయింది. ఈ అల్లర్లను అదుపు చేయాల్సిన పాలకులు మౌనంగా ఉండడం ప్రజల్లో మరింత ఆందోళనకు గురి చేస్తున్నది. ఇటువంటి దారుణ పరిస్థితుల్లో మణిపూర్ మహిళలు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ రాష్ట్ర ఐద్వా కార్యదర్శి **ఆషా బాలా** మానవికి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు...



బలౌతుంది మహిళలు, పిల్లలే



మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉంది?

మహిళల పరిస్థితి అయితే దారుణంగా ఉంది. రోజు వారి జీవనోపాధి కోల్పోయారు. మహిళలపై ఆధారపడ్డ కుటుంబాలు మా దగ్గర చాలా ఉన్నాయి. వీరు సంపాదిస్తే తప్ప కుటుంబం గడవదు. ముఖ్యంగా ఇండ్లల్లోనే ఉండి చేతి వృత్తులు చేసుకుని వాటిని అమ్ముకుని బతికేవారు మణిపూర్‌లో ఎక్కువ మంది ఉంటారు. వీరంతా మహిళలే. అలాగే రాష్ట్ర రాజధాని అయిన ఇంఫాల్‌లోని ఇమామ్ మార్కెట్లో చాలా దుకాణాలు మహిళలే నిర్వహిస్తారు. తమ అడవి ఉత్పత్తులను తెచ్చుకొని అమ్ముకుని జీవిస్తారు. అల్లర్ల వల్ల ఆ దుకాణాలన్నీ మూతబడ్డాయి. లైంగిక దాడులతో మహిళలు అడవులు దాటి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దాంతో మహిళలు తమ ఆదాయాన్ని పూర్తిగా కోల్పోతున్నారు. ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ఒక్క పూట తిండి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉద్యోగాలు చేసే వారికి కొంత వరకు వేతనం వస్తుంది. వీరికి ఆర్థిక ఇబ్బంది లేకపోయినా మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భార్యా, భర్తలిద్దరూ ఉద్యోగానికి వెళితే తప్ప ఇల్లు గడవదు. అయితే పిల్లలకు పాఠశాలలు లేవు. వారి పిల్లలు ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో రెండు నెలల నుండి చదువులు లేక పిల్లల భవిష్యత్ ఏమవుతుందో అనే ఆందోళన తల్లిదండ్రుల్లో వుంది.

ఇప్పుడు గొడవలు కాస్త తగ్గాయని అంటున్నారు... అది నిజమేనా..?

అది కేవలం బయట ప్రచారం మాత్రమే. అల్లర్లను అదుపు చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. సాయంత్రం అయితే చాలు ఎక్కడ కాల్పులు జరుగుతాయో అర్థం కాక భయం గుప్పెట్లో బతుకుతున్నాం. రాత్రిపూట అందరం గుంపులు గుంపులుగా వచ్చి కూర్చుంటున్నాం.

కుకీ మహిళలపై లైంగిక దాడి జరిగిందని తెలిసి దేశం మొత్తం ఆవేదన చెందింది. అక్కడి మైతీ ప్రజలు ఎలా స్పందించారు?

పెద్ద ఎత్తున ఆందోళన చేశాం. నిజానికి మాకు కూడా ఈ విషయం చాలా ఆలస్యంగా తెలిసింది. మే 3వ తేదీన ఘర్షణలు ప్రారంభం అయ్యాయి. ఈ ఘటన ఆ తర్వాతి రోజే జరిగింది. ఆ ప్రాంతం చాలా దూరంగా ఉంటుంది. అలాగే మా దగ్గర ఇంటర్‌నెట్ కట్ చేశారు. అసలు మా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏం జరుగుతుందో కూడా మాకు తెలియదు. సోషల్ మీడియాలో వచ్చిన తర్వాతనే మాకూ తెలిసింది. ఘటన జరిగిందని తెలిసిన వెంటనే ఐద్వాగా మేము స్పందించాం. లైంగిక దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని, వాళ్ళకు న్యాయం చేయాలని కార్యక్రమాలు, ప్రదర్శలు చేశాం. ఈ కార్యక్రమంలో కుకీలు, మైతీలు అందరూ ఐక్యంగా పాల్గొన్నారు. మహిళలందరూ జాతులతో సంబంధం లేకుండా ఆందోళనలో పాల్గొన్నారు. ఇది మహిళల సమానత్వానికి, మాపై జరుగుతున్న హింసకు, ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం కాబట్టి ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు కేవలం రెండు జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణ అంటున్నారు. ఇది నిజమేనా..?

రెండు జాతుల మధ్య గొడవ జరుగుతున్న మాట వాస్తవం. కానీ అల్లర్లు చేస్తున్నవారు మాత్రం చాలా తక్కువ మంది. వారిని కూడా బిజేపీ నాయకులు రెచ్చగొడుతున్నారు. నిజానికి కుకీలు, మైతీలు ఇద్దరూ మణిపూర్ ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. మహిళలపై జరిగిన దాడిని ఖండిస్తూ అందరూ బయటికి రావడమే దీనికి ఓ ఉదాహరణ. సామాన్య ప్రజలు ఎవ్వరూ హింసను కోరుకోవడం లేదు. మైతీలు కూడా అల్లర్లపై పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. శాంతిని కోరుతూ జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఐద్వాగా మీరు చేస్తున్న ప్రయత్నం..?

జాతులతో సంబంధం లేకుండా అందరినీ ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే చాలా మంది ఇల్లు తగల బెట్టారు. సాధారణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణీ స్త్రీలు సరైన ఆహారం లేక అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రసవమైన మహిళలకు వైద్య సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. వారి వేదన చూస్తుంటే కండ్ల నుండి నీరు కారుతుంది. ఇలా ఇబ్బందులు పడుతున్న వారిలో మైతీలు కూడా చాలా మంది ఉన్నారు. కేవలం కొంత మంది సృష్టిస్తున్న విద్వేషాల వల్ల మా మణిపూర్ ఇలా తగలబడుతుంది. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి కానీ, ప్రధాని కానీ స్పందించడం లేదు. కావాలనే ఈ అల్లర్లు కొనసాగేలా చేస్తున్నారు. రాజకీయ లబ్ది తప్ప ప్రజల ప్రాణాలతో, మహిళల సమస్యలతో వారికి ఎలాంటి సంబంధం లేదు. మాతో పాటు రాష్ట్రంలో వామపక్ష పార్టీలు కూడా శాంతి నెలకొల్పడం కోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. మిగిలిన రాజకీయ పార్టీలతో చర్చించారు. కాల్పులు నివారించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో పరిస్థితి అదుపులోకి రావడం లేదు.

కుకీలు అభద్రతా భావంలో ఉన్నారని ప్రచారం జరుగుతుంది, ఇది నిజమేనా..?

నిజమే, ప్రస్తుత పరిస్థితుల్లో ఐద్వాగా కార్యక్రమాలు చేయడం మాకూ కష్టంగా మారింది. మైతీలు, కుకీలు, ముస్లింలు మా కమిటీల్లో ఉన్నారు. అల్లర్లపై అవగాహన కల్పించేందుకు కుకీ కమిటీ సభ్యులకు మేం ఫోన్లు చేస్తున్నాము. కానీ వాళ్ళు మాతో మాట్లాడేందుకు భయపడుతున్నారు. గతంలో కుకీలు ఐద్వాలో లేరు. చాలా కష్టపడి వాళ్ళలో నమ్మకం కల్పించి సంఘంలోకి తీసుకొచ్చాము. రెండు కమ్యూనిటీల మధ్య ఐక్యత తీసుకు వచ్చేందుకు చాలా ప్రయత్నం చేస్తున్నాం. మైతీలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయనే విషయం దేశం మొత్తం తెలిసిందే. ప్రస్తుతం కుకీలు అభద్రతా భావంలో ఉన్నారు. ఒకరు తప్పు చేస్తే ఆ జాతి మొత్తం తప్పుడు జాతి అని ప్రచారం చేస్తున్నారు. అది సరైనది కాదు. అలాగే రెండు మతాల మధ్య జరుగుతున్న గొడవలుగా పాలకులు ప్రచారం చేస్తున్నారు. అసలు రాష్ట్రంలో ప్రజలు వెనకబాటుకు కారణాలేంటో గుర్తించాలి. వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోవాలి. అప్పుడే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

– సలీమ



ఇవి తింటే అనారోగ్యాలే...!

ఉరుకుల పరుగుల జీవితంలో ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించడం మర్చిపోతున్నాం. కానీ ఆరోగ్యంగా ఉండాలన్నా, ఇన్‌ఫెక్షన్లతో సమర్థవంతంగా పోరాటం చేయాలన్నా రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండటం చాలా ముఖ్యం. ఇలాంటి ఆహారం శరీరానికి పోషణ అందించి, మనం పని చేయడానికి శక్తిని అందించేలా చేస్తాయి. అటువంటి ఆహారమే హానికరమైన వైరస్‌లు, బ్యాక్టీరియా, క్రిములు, ఇన్‌ఫెక్షన్‌ల నుంచి మనల్ని రక్షిస్తుంది. రోగనిరోధక శక్తిని మెరుగు పరుస్తుంది. అయితే కొన్ని ఆహార పదార్థాలు పరిమితికి మించి నిత్యం తింటుంటే ఆరోగ్యానికి, రోగనిరోధక వ్యవస్థకు హాని కలుగుతుంది. వీటికి వీలైనంత వరకు దూరంగా ఉండాలి. మరి మనం తినకూడని ఆ ఆహార పదార్థాలు ఏమిటో తెలుసుకుందాం?

- కెఫిన్ ఉన్న పానీయాలు ఎక్కువగా తీసుకుంటే.. శరీరం ఐరన్, కాల్షియం వంటి ఖనిజాలను గ్రహించే సామర్థ్యం కోల్పోతుంది. రోగనిరోధక వ్యవస్థకు ఇవి చాలా ముఖ్యం. కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే నిద్రకు భంగం కలుగుతుంది. ఇది కాలక్రమేణా రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది.



- పంచదార ఎక్కువగా తింటే రోగనిరోధక శక్తి బలహీనపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను కలిగిస్తుంది. అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. NCBI నివేదిక ప్రకారం, స్వీట్లు ఎక్కువగా తినడం వల్ల అధిక బరువు, గుండె, డయాబెటిస్ వంటి సమస్యలు ఎదురవుతాయి.
- నిల్వ చేసే మాంసంను క్యూరింగ్, సాల్టింగ్, స్మోకింగ్, డ్రైయింగ్, క్యానింగ్ పద్ధతి ద్వారా భద్రపరుస్తారు. ఇటువంటి మాంసంలో సంతృప్త కొవ్వు, సోడియం, రసాయనాలు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తాయి. సాసేజ్‌లు, హాట్ డాగ్‌లు, సలామీ వంటి ప్రాసెస్ చేసిన మాంసాలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.
- శుద్ధి చేసిన పిండి పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. అలాగే వైట్ బ్రెడ్, మైదా, ఆలూ చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.
- ఆల్కహాల్ ఎక్కువగా తాగితే.. రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. తద్వారా ఇన్‌ఫెక్షన్లు వచ్చే ముప్పు ఎక్కువ అవుతుంది. ఆల్కహాల్ ఊపిరితిత్తులను రక్షించే రోగనిరోధక కణాలను ప్రభావితం చేస్తుంది. ఊపిరితిత్తుల నుంచి శ్లేష్మం తొలగించే సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తుంది. ఇన్‌ఫెక్షన్‌ల నుంచి శరీరాన్ని రక్షించే.. తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేసే శరీర సామర్థ్యానికి కూడా ఆటంకం కలిగిస్తుంది. కాబట్టి దీనికి పూర్తిగా దూరంగా ఉండడం ఆరోగ్యానికి చాలా మంచిది.

యూసీసీ అమలు చేస్తే ఎన్డీఏకు గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

ఎన్డీఏ వ్యవస్థాపక సభ్యురాలు. అంటే దానర్థం మేము ప్రతి విధానాన్నీ సమర్థిస్తామని కాదు. ఏదైనా ఒక విషయం మిజో ప్రజలకు వ్యతిరేకంగా ఉంటే మా పార్టీ దానిని పూర్తిగా వ్యతిరేకిస్తుంది' అని ఆయన ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. యూసీసీని ఎంఎన్ఎఫ్ వ్యతిరేకిస్తోందని, కేంద్ర ప్రభుత్వం దానిని తమ ప్రజల మీద రుద్దితే ఎన్డీఏ నుండి వైదొలుగుతామని ఆయన చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం అంతవరకూ తెచ్చుకోదని భావిస్తున్నామని అన్నారు.ఎన్డీఏ కూటమి వివేకవంతంగా, పరిణితితో ఆలోచిస్తుందని అనుకుంటున్నామని అంటూ యూసీసీ వంటివి దానికి ఏ మాత్రం ఉపయోగపడవని జోరాంతంగా అన్నారు. ఎన్డీఏ నుండి ఎంఎన్ఎఫ్ వైదొలిగేటంతగా తీవ్ర నిర్ణయాలను తీసుకోబోరన్న నమ్మకం ఉన్నదని చెప్పారు. మిజోల ఆచార వ్యవహారాలకు రాజ్యాంగపరంగా రక్షణ లభిస్తోందని, యూసీసీని అమలు చేస్తే దానిని విఘాతం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మణిపూర్‌లో కుకీలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రస్తావిస్తూ 'గాయం చాలా లోతైనది. అది మానడం చాలా కష్టం. కేవలం ఏదో ఒక మాత్ర ద్వారా అది మానదు. దానిని కూలంకషంగా పరిశీలించాల్సి ఉంటుంది' అని చెప్పారు. ఇదిలావుండగా మణిపూర్ ఆంతరంగిక వ్యవహారాలలో జోరాంతంగా జోక్యాన్ని నిరసిస్తూ ఇంఫాల్‌లో ఆయన దిష్టిబొమ్మలను తగలబెట్టారు. మణిపూర్ వ్యవహారాలలో జోరాంతంగా జోక్యం చేసుకోరాదని రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కూడా స్పష్టం చేశారు. దీనిపై జోరాంతంగా స్పందిస్తూ 'మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా నిరాశ్రయులైన వేలాది మంది కుకీలు మా రాష్ట్రంలోకి వస్తున్నారు. ఇది నాకు ఇబ్బందికరం. అందుకే మేము జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం' అని చెప్పారు. కుకీల వలసలను నివారించడంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సరిగా స్పందించడం లేదని ఆయన విమర్శించారు. అలా అని ఎన్డీఏపై తనకేమీ కోపం లేదని అన్నారు. వలస వస్తున్న వారి విషయంలో కేంద్రం తీసుకుంటున్న చర్యలు సరిగా లేవని మాత్రమే చెబుతున్నానని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. మణిపూర్, కేంద్రం కలిసి కుకీలు, మైతీలతో చర్చలు జరిపి సమస్యను రాజకీయంగా పరిష్కరించాలని జోరాంతంగా సూచించారు.

త్వరలో రుణమాఫీ.?

(మొదటిపేజీ తరువాయి)

హామీనిచ్చారు. అప్పట్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్...తాను అధికారంలోకి వస్తే రూ.రెండు లక్షల లోపున్న రుణాలను మాఫీ చేస్తామంటూ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. కానీ రైతులు కారు పార్టీ హామీనే నమ్మి ఓట్లేశారు. ఆ క్రమంలో సీఎం చెప్పినట్టు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసేందుకు వీలుగా సర్కారు జీవోను జారీ చేసింది. ఇది గడిచి నాలుగున్నరేండ్లు అయింది. అయితే రూ.35 వేల లోపున్న రుణాలను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసింది. తద్వారా సుమారు 45 లక్షల మంది రైతులు లబ్ధిపొందారని అధికారులు ప్రకటించారు. అయితే రూ.35 వేల పైబడి, రూ.లక్ష లోపు రుణమున్న వారికి మాత్రం అప్పులు మాఫీ కాలేదు. వీరి రుణాల మాఫీ కోసం ప్రస్తుత బడ్జెట్‌లో రూ.6,500 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కానీ నిధులను విడుదల చేయలేదు. ఇది ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోందని అధికార పార్టీ గ్రహించింది. ఈ నేపథ్యంలోనే రుణమాఫీ ప్రక్రియ ఊపందుకుంటోందని తెలిసింది. ఇది పూర్తయితే... దాంతోపాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, తద్వారా భూగర్భ జలాల పెరుగుదల, రైతు బంధు, రైతు బీమా తదితరాంశాలను ఎన్నికల సభల్లో ఏకరువు పెట్టటం ద్వారా అన్నదాతల మనస్సులను మరోసారి గెలుచుకోవాలనే పక్కా ప్లాన్‌తో బీఆర్ఎస్ బాస్ ముందుకెళుతున్నారు. అది కూడా కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేయకముందే, రుణమాఫీ అంశాన్ని లేవనెత్తక ముందే రుణమాఫీని ప్రకటించి, అమలు చేయటం ద్వారా ఆ పార్టీ విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది ఆయన స్ట్రాటజీగా ఉండబోతోందని తెలిసింది.

ఐఐపీఎస్ డైరెక్టర్‌పై కేంద్రం వేటు

(మొదటిపేజీ తరువాయి)

సాకు చెప్పింది. ఐఐపీఎస్ సంస్థ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తుంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు తయారు చేయడం, ప్రభుత్వం నిర్దేశించే ఇతర పనులు చేపట్ట డం దాని పని. జేమ్స్‌కు శుక్రవారం సాయంత్రం సస్పెన్షన్ లేఖ పంపారని అధికార వర్గాలు ధృవీకరించాయి. జేమ్స్ సస్పెన్షన్‌కు ప్రభుత్వం చెబుతున్న కారణం ఏదైనా వాస్తవాలు మాత్రం మరోలా ఉన్నాయి. ఐఐపీఎస్ గతంలో చేసిన సర్వేలలో వెల్లడైన అంశాలపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రాజీనామా చేయాల్సిందిగా ఆయనను కోరింది. అయితే అందు కు జేమ్స్ నిరాకరించారని తెలుస్తోంది.2018లో ముంబయి కేంద్రంగా ప్రార ంభించి న ఐఐపీఎస్‌కు జేమ్స్‌ను డైరెక్టర్‌గా నియమించారు. ఆ సంస్థకు మం చి గుర్తింపు లభించడానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. హార్వర్డ్ సెంటర్ నుండి పోస్ట్ డాక్టరల్ డిగ్రీ (జనాభా–అభివృద్ధి) పొందిన జేమ్స్ గతంలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఐఐపీఎస్‌లో చేరకముందు ఆయన అనేక నాయకత్వ బాధ్యతలు సైతం నిర్వర్తించారు.

ఇబ్బంది పెట్టిన సర్వేలు

ఐఐపీఎస్ నిర్వహించిన ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 సర్వేలో బయటపడిన వాస్తవాలు ప్రభుత్వానికి అసౌకర్యాన్ని కలిగించాయి. బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జన జరగని దేశంగా భారత్‌ను ప్రధాని మోడీ 2019 అక్టోబర్ 2న ప్రకటించారు. అయితే సర్వేలో దానికి విరుద్ధమైన సమాచారం లభించింది. దేశంలోని 19% కుటుంబాలు ఇప్పటికీ బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జన చేస్తున్నారని ఆ సర్వేలో తేలింది.

ఒడిషా, జార్ఖండ్, బీహార్ వంటి రాష్ట్రాలలో 30% జనాభాకు మరుగుదొడ్లే లేవని తేల్చేసింది. గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నదని, బీహార్‌లో దాదాపు సగం మందికి మరుగుదొడ్లే లేవని కఠోర సత్యాన్ని బయటపెట్టింది. పౌష్టికాహార సూచికలను మెరుగుపరచేందుకు మోడీ ప్రభుత్వం 2018లో ప్రారంభించిన 'పోషణ్ అభియాన్' పథకం పనితీరు కూడా పేలవంగానే ఉన్నదని ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 సర్వే నిగ్గు తేల్చింది. 2015–16తో పోలిస్తే 2019–21 మధ్యకాలంలో పిల్లలలో రక్తహీనత పెరిగిందని తెలిపింది.

మోడీ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చేయించిన వినియోగ వ్యయ సర్వే కూడా విమర్శలకు గురైంది. ఈ సర్వే ఫలితాలతో ప్రభుత్వం విభేదించింది. ఆ తర్వాత 2019 జనవరిలో వచ్చిన నిరుద్యోగ సమాచారాన్ని కూడా పక్కనపెట్టి దానిని ఎన్నికలు ముగిసిన తర్వాతే విడుదల చేసింది. ప్రభుత్వ చర్యకు నిరసనగా జాతీయ గణాంకాల కమిషన్ తాత్కాలిక ఛైర్మన్ పీసీ మోహనన్ సహా పలువురు సభ్యులు రాజీనామా చేశారు. పది సంవత్సరాలకు ఒకసారి చేయాల్సిన జనగణనను కూడా ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తోంది. నూట యాభై సంవత్సరాలలో మొట్టమొదటిసారిగా జనగణన వాయిదా పడడం గమనార్హం.ఏదేమైనా సర్వేలలో బయటపడుతున్న వాస్తవాలను బహిర్గతం చేయకుండా తొక్కిపట్టడం వల్ల ప్రభుత్వ విశ్వసనీయత పైన, చిత్తశుద్ధి పైన అనుమానాలు తలెత్తుతున్నాయి. విధానపరమైన నిర్ణయాల పైన ప్రభావం పడితే ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయే ప్రమాదమూ ఉంది.

బీజేపీకి కష్టకాలమే

(మొదటిపేజీ తరువాయి)

పాలిత ప్రాంతాలకు విస్తరించి ఉన్నదన్న వాస్తవాన్ని మరవకూడదు. అదీకాక ఈ కూటమిలోని భాగస్వామ్య పక్షాలు 11 రాష్ట్రాలలో అధికారంలో ఉన్నాయి. మరో ముఖ్యమైన విషయమేమంటే ఒకప్పటి 'థర్డ్ ఫ్రంట్'లో మాదిరిగా భాగస్వాములు కలగూరగంపలా లేరు. ఇందులో కాంగ్రెస్ కూడా ప్రధాన భాగస్వామిగా ఉంది. తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా చేతులు కలిపితే 'ఇండియా' కూటమి మరింత బలోపేతం అవుతుంది.

సంఘటితమవుతున్న ముస్లింలు

2019 ఎన్నికలలో బీజేపీకి ఘన విజయం లభించడానికి ప్రధాన కారణం అప్పుడు ప్రతిపక్షాల ఓట్లు చీలిపోవడం. ఇది బీజేపీకి బాగా కలిసొచ్చింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉత్తరప్రదేశ్‌నే తీసుకుంటే అక్కడి ముస్లిం ఓట్లు సమాజ్‌వాదీ, బీఎస్పీ, మజ్లిస్ పార్టీల మధ్య చీలిపోవాలని బీజేపీ కోరుకుంటోంది. అయితే ముస్లిం ఓట్లు సంఘటితమవుతున్నాయని కర్నాటక ఫలితాలు నిరూపించాయి. బీజేపీని ఓడించగల సత్తా ఉన్న పార్టీనే వారు ఎంచుకొని గంపగుత్తగా ఓటేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ పరిణామం అతిపెద్ద కూటమి అయిన 'ఇండియా'కు కలిసొచ్చే అవకాశం ఉంది. దేశ భద్రత, భౌగోళిక రాజకీయ పరిస్థితులు 2019లో మాదిరిగా లేవు. పొరుగుదేశాన్ని బూచిగా చూపి ఓట్లు దండుకునే ఎత్తుగడలు ఇప్పుడు ఫలించవు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్ బలహీనపడుతోంది. పైగా అంతర్గత రాజకీయ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ పరిస్థితులలో కవ్వింపు చర్యలకు, వాటిని బూచీగా చూపి రాజకీయ లబ్ది పొందేందుకు అవకాశాలు లేవు.

ఇబ్బంది లేదు కానీ...

తాజాగా మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. దీనితో మోడీ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు కానీ ప్రతిపక్షాల మధ్య ఐక్యత మరింత గట్టి పడుతుంది. ఇలాంటి తీర్మానాలు గతంలో విజయం సాధించిన దాఖలాలు లేవు. ఇందిరా గాంధీ తన 16 సంవత్సరాల పాలనలో 15 అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొన్నారు. బొటాబొటీ మెజారిటీలతో నెట్టుకొస్తున్న ప్రభుత్వాలపై విశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టిన సందర్భాలలో మాత్రమే రాజకీయ వాతావరణం వేడెక్కుతుంది. వాజ్‌పేయి నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వాలు రెండు సార్లు విశ్వాస పరీక్షల్లో ఓటమి చెందగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలు రెండుసార్లు గట్టెక్కాయి. వీటిలో మొదటిది అణు ఒప్పందంపై ఆయన ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం కాగా రెండోది రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐలకు సంబంధించినది.

అవిశ్వాసం ఎందుకంటే...

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానం ఇందుకు బాట వేసింది. అయితే మోడీ–షా ద్వయాన్ని తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. తిమ్మిని బమ్మి చేసే ఎత్తుగడలు వేయడంలో వారికి వారే సాటి. ఇండియా కూటమి వాటిని తిప్పికొట్టి బీజేపీ వ్యతిరేక ఓటును సంఘటితపరిస్తే లోక్‌సభ ఎన్నికలలో అనూహ్య విజయాలను సొంతం చేసుకోవడం కష్టమేమీ కాదు.

వ్యవ సాయం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

తక్కువగా ఉంటుంది. ఇప్పటి వరదల కారణంగా 10 లక్షల ఎకరాలకుపైనే పంట నష్టం జరిగింది. వీటిపై అధ్యయనం చేసి, బాధిత రైతులకు సాయం చేసి వారిని నిలబెట్టాలి.

ఇంకా ఏంచేయాలి ?

అత్యవసర నిధులు విడుదల చేయాలి. కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇవ్వాలి. రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, సాగునీటి, ఎన్‌డీఆర్ఎఫ్ శాఖలు సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలి. నిర్వాసితులను ఆదుకోవాలి. అప్రమత్తంగా ఉండాలి. వరదల పట్ల ప్రజలు, రైతుల్లో ఎప్పటికప్పుడు చైతన్యం కల్పించాలి.

అప్రమత్తత అంటే ?

ప్రాజెక్టులతోపాటు ఇతర నీటి వనరుల్లో వాతావరణ శాఖ సలహాలు, సూచనల మేరకు నీటి నిల్వలను తగ్గించాలి. దురాక్రమణకు గురైన నదులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని నీరువెళ్లే మార్గాలను నిర్మించాలి. ఎక్కడిక్కడ సరఫరాకు తగిన షెడ్లను ఏర్పాటు చేయాలి. బస్తీ, గ్రామ దవాఖానాల్లో సిబ్బంది, మందులను విస్తృతంగా స్టాక్ చేయాలి. ముఖ్యంగా ఏజెన్సీలో గిరిజనులను వరద కష్టాలు, నష్టాల నుంచి రక్షించాలి.

వ్యవసాయానికి కావాల్సిన సహాయమేంటి ?

తొలుత తొలకరి ఆలస్యం కావడంతో వానాకాలం పంటల సాగు ఆలస్యమైంది. దింతో ఇప్పటికే రైతులు రెండుసార్లు విత్తారు. ఇప్పటి భారీ వానలతో పరిస్థితి తలకిందులైంది. వరదలనేపథ్యంలో నష్టపోయిన రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలి. పాత రుణ బకాయిలను రీషెడ్యూల్ చేయాలి. అప్పుల కిస్తులను వసూలు చేయకుండా వాయిదా వేయాలి. వరదల నుంచి బయటపడటానికి గ్రామాల్లో తగిన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు అవసరం. గణాంకాలు సేకరించి జరిగిన నష్టాన్ని వాస్తవికంగా అంచనా వేయాలి. ఆమేరకు రైతులకు సర్కారు సాయం చేయాలి.

బుద్ధదేవ్ భట్టాచార్యకు తీవ్ర అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

లేదని ఉడ్‌ల్యాండ్స్ విడుదల చేసిన బులిటెన్‌ను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కార్డియాలజిస్టులు, పల్మోనాలజిస్టుల పర్యవేక్షణలో భట్టాచార్యకు వైద్యం కొనసాగుతోందని తెలిపారు. కాగా రాష్ట్ర గవర్నరు ఆనంద్ బసు ఆస్పత్రికి వెళ్లి బుద్ధదేవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా బుద్ధదేవ్ ఆరోగ్యస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టాలన్నారు. బ్లీచింగ్ పౌడర్, సోడియం హైపోక్లోరైడ్, దోమల నివారణ మందుల పిచికారి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు డీ–వాటరింగ్ పంపులను వినియోగించాలని చెప్పారు. ప్రజలు తాగునీటిని కాచి వడపోసుకొని వినియోగించాలనే అవగాహనా కార్యక్రమలు చేపట్టాలన్నారు. సురక్షిత తాగునీరు సరఫరా కోసం మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకొని, పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేస్తూ, తాగునీటి క్లోరినేషన్‌ను చేపట్టాలని ఆదేశించారు. పట్టణాల్లోని బస్తీ దవాఖానాల్లో వైద్యారోగ్యశాఖ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి సంస్థల సహకారంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. శిధిలావస్థలో ఉన్న పురాతన భవనాలను తొలగించాలనీ, విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోవాలని అన్నారు.

ఖమ్మంలో అక్టోబర్‌లో టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభ



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో అక్టోబర్ మూడోవారంలో జరగనున్నాయి. టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్ కుమార్ అధ్యక్షతన శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం రవీందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. దీంతో విద్యారంగం రోజు రోజుకూ సంక్షోభంలో కూరుకుపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కామన్ సర్వీస్ రూల్స్, పండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్ కోర్టుల్లో నానుతున్నాయని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు పాలకుల దయా దాక్షిణ్యాల పరిధిలోకి వెళ్లిందని పేర్కొన్నారు. పీఆర్సీ గడువు గతనెల 30తో ముగిసినప్పటికీ ఐఆర్ ఊసేలేదు విమర్శించారు. నూతన పీఆర్సీని వేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల వేలాది మంది ఉపాధ్యాయులు బాధితులుగా మారారని తెలిపారు. విద్యారంగానికి నిధుల కేటాయింపులు రోజురోజుకూ తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. పదోన్నతులు, నియామకాలు చేపట్టక పోవడం వల్ల పర్యవేక్షణ అధికారులు, ఉపాధ్యాయుల్లేక పాఠశాలలు కునారిల్లుతున్నాయని తెలిపారు. ప్రజానుకూల విద్యను ప్రయివేటీకరణను బలోపేతం చేయడం కోసమే జాతీయ విద్యావిధానం–2020ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ప్రధాన అంశంగా ఉచిత నిర్బంధ విద్య కామన్ స్కూల్ విధానం, శాస్త్రీయ విద్య విద్యారంగ సమస్యలపై ఖమ్మం పట్టణంలో అక్టోబర్ మూడో వారంలో మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు.



లాల్‌రెమ్సియామి హ్యాట్రిక్

ఇంగ్లాండ్‌పై 3-0తో భారత్ గెలుపు

బార్సిలోనా (స్పెయిన్) : భారత హాకీ స్టార్, స్ట్రయికర్ లాల్‌రెమ్సియామి హ్యాట్రిక్‌తో రెచ్చిపోయింది. మూడు గోల్స్‌తో లాల్‌రెమ్సియామి మెరువగా ఇంగ్లాండ్‌పై భారత్ 3-0తో ఘన విజయం సాధించింది. స్పానీశ్ హాకీ ఫెడరేషన్ శత వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ హాకీ టోర్నీలో స్పెయిన్ సహా ఇంగ్లాండ్, భారత్ పాల్గొంటున్నాయి. టోర్నీ తొలి రెండు మ్యాచుల్లో టీమ్ ఇండియా అమ్మాయిలు డ్రా దాటి ముందుకెళ్లలేకపోయారు. ఇంగ్లాండ్‌తో తొలి మ్యాచ్ 1-1తో, స్పెయిన్‌తో తొలి మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిశాయి. శనివారం జరిగిన మరో మ్యాచ్‌లో లాల్‌రెమ్సియామి మెరుపులతో టోర్నీలో భారత్ తొలి విజయం నమోదు చేసింది. ఇంగ్లాండ్‌కు గోల్ అవకాశాలు లభించినా.. భారత డిఫెన్స్‌ను ఛేదించలేదు. 13, 17, 56వ నిమిషంలో గోల్స్ కొట్టిన లాల్‌రెమ్సియామి పాయింట్ల పట్టికలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపింది. కెప్టెన్ సవిత, నేహా గోయల్, దీప్ గ్రేస్ ఎక్కాలు రాణించారు. నేడు జరిగే మరో మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ తలపడనుంది.

ఓపెనర్లు మెరిసినా..!

- మిడిల్ ఆర్డర్ తడబాటు
- భారత్, విండీస్ రెండో వన్డే


భారత బ్యాటర్లు తడబాటుకు గురయ్యారు. యువ ఓపెనర్లు ఇషాన్ కిషన్ (55), శుభ్‌మన్ గిల్ (34) మంచి ఆరంభం అందించినా.. మిడిల్ ఆర్డర్ విఫలమైంది. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోగా.. కుర్ర క్రికెటర్లు కరీబియన బౌలర్లను ఎదుర్కొనేందుకు ఇబ్బంది పడ్డారు.

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్



భారత యువ ఓపెనర్ ఇషాన్ కిషన్ (55, 55 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్థ సెంచరీతో మెరిశాడు. తొలి వన్డేలో స్వల్ప ఛేదనలో మెరిసిన కిషన్.. రెండో వన్డేలోనూ అదే ఫామ్ కొనసాగించాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (34, 49 బంతుల్లో 5 ఫోర్లు) తోడుగా ఓపెనింగ్ వికెట్‌కు శుభారంభం అందించాడు. ఓపెనర్లు మెరిసినా.. సంజు శాంసన్ (9), అక్షర్ పటేల్ (1), హార్దిక్ పాండ్య (7), సూర్యకుమార్ యాదవ్ (24, 25 బంతుల్లో 3 ఫోర్లు), రవీంద్ర జడేజా (10, 21 బంతుల్లో) విఫలమయ్యారు. మిడిల్ ఆర్డర్ కుప్పకూలటంతో భారత్ ఒత్తిడిలో పడింది!.

కిషన్, గిల్ జోరు : టాస్ నెగ్గిన ఆతిథ్య వెస్టిండీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోగా భారత జట్టుకు హార్దిక్ పాండ్య సారథ్యం వహించాడు. కొత్త బంతితో కరీబియన్ పేసర్లు కవ్వించినా..స్వింగ్‌తో సవాల్ విసిరినా.. యువ ఓపెనర్లు అద్భుతంగా బదులిచ్చారు. పవర్‌ప్లేలో 49/0తో మెరుగ్గా ఆడిన ఓపెనర్లు.. ఆ తర్వాత ఆకట్టుకున్నారు. ఇషాన్ కిషన్ ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 51 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. వరుసగా రెండో వన్డేలో కిషన్ అర్ధ సెంచరీతో కదం తొక్కినా.. భారీ స్కోరు దిశగా సాగలేకపోయాడు. ఐదు ఫోర్లు బాదిన శుభ్‌మన్ గిల్ సైతం జోరు మీద కనిపించాడు. 90/0తో భారీ స్కోరు దిశగా సాగిన టీమ్ ఇండియా.. ఏడు పరుగుల వ్యవధిలోనే ఓపెనర్లు సహా మూడు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ మోటీ ఓవర్లో గిల్ వికెట్ కోల్పోగా.. రోమారియో షెఫార్డ్ బంతికి ఇషాన్ కిషన్ పెవిలియన్ బాట పట్టాడు. నం.4 బ్యాటర్ అక్షర్ పటేల్ (1) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. అందివచ్చిన చాన్స్‌ను సంజు శాంసన్ (9) సైతం సద్వినియోగం చేసుకోలేకపోయాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్య (7) వికెట్ నిలుపుకోలేదు. సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా కాసేపు క్రీజులో నిలిచినా.. ఆ భాగస్వామ్యం ఎంతో సేపు కొనసాగలేదు. 34 ఓవర్లలో 154 పరుగులకు ఏడు వికెట్లు కోల్పోయిన భారత్.. 200 పరుగుల మార్క్ చేరుకునేందుకు తంటాలు పడుతోంది. విండీస్ బౌలర్లలో షెఫార్డ్ మూడు, మోటీ రెండు వికెట్లు పడగొట్టారు.



ఛెత్రి లేకుండా ఆసియా క్రీడలకు?

- భారత ఫుట్‌బాల్ సమాఖ్య వింత వైఖరి

న్యూఢిల్లీ : ర్యాంకింగ్స్ కారణంగా భారత ఫుట్‌బాల్ జట్టును ఆసియా క్రీడలకు దూరం చేయవద్దని, టీమ్ ఇండియా సాకర్ టీమ్ హాంగ్జౌ క్రీడల్లో మెరిసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించటంతో.. ఎట్టకేలకు ఫుట్‌బాల్ జట్టును సైతం ఆసియా క్రీడలకు ఎంపిక చేశారు. కానీ, ఆసియా క్రీడలకు జట్టును ఎంపిక చేసే అంశంలో భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) వింత వైఖరి అవలంభించింది. భారత ఫుట్‌బాల్ పతాకధారి సునీల్ ఛెత్రి సహా సీనియర్ డిఫెండర్ సందేశ్ జింఘాన్, గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సందూలను జట్టులోకి ఎంపిక చేయలేదు. సునీల్ ఛెత్రి లేకుండా ఆసియా క్రీడలకు భారత ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేయటం పట్ల అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం అండర్-23 ఆటగాళ్లనే పంపించాలి. కానీ ముగ్గురు ఆటగాళ్లకు ఈ వయో పరిమితి ఉండదు. దీంతో సహజంగానే జాతీయ జట్టులోని ముగ్గురు స్టార్, సీనియర్ ఆటగాళ్లను ఎంపిక చేస్తారనే అనుకున్నారు. కానీ ఏఐఎఫ్ఎఫ్ ఈ ముగ్గురు పేర్లు లేకుండానే ఆసియా క్రీడల జట్టు జాబితాను సమర్పించింది. అభిమానుల ఆగ్రహంతో ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తాత్కాలిక సీఈవో కళ్యాణ్ చౌబె నష్ట నివారణ చర్యలు చేపట్టారు. సునీల్ ఛెత్రి సహా ముగ్గురు సీనియర్ ఆటగాళ్లకు ఆసియా క్రీడలకు ప్రత్యేక అక్రిడిటేషన్ మంజూరు చేయాలని హాంగ్జౌ క్రీడల నిర్వహణ కమిటీకి లేఖ రాశారు. దీనిపై ఆసియా క్రీడల మేనేజింగ్ కమిటీ స్పందించాల్సి ఉంది. నిర్వాహకులు అనుమతించకుంటే సునీల్ ఛెత్రి లేకుండానే ఆసియా క్రీడల్లో భారత ఫుట్‌బాల్ పోటీపడాల్సి ఉంటుంది.

షూటర్ల పసిడి గురి

- తొలి రోజే మూడు స్వర్ణాలు సొంతం
- వరల్డ్ యూనివర్శిటీ క్రీడలు 2023



చెంగ్డు (చైనా) : ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడల్లో టీమ్ ఇండియా అత్యుత్తమ ప్రదర్శన చేసింది. గత పోటీల్లో ఓవరాల్‌గా నాలుగు పతకాలు సాధించిన భారత్.. ఈ సారి తొలి రోజు పోటీల్లోనే ఏకంగా నాలుగు పతకాలు కైవసం చేసుకుంది. భారత స్టార్ షూటర్లు ఈసారి వరల్డ్ యూనవర్శిటి క్రీడల బరిలో నిలువటంతో పసిడి మోత మోగింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మను భాకర్ పసిడి పతకం సాధించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఎలవేనిల్ వలరివన్ సైతం గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలోనూ మన షూటర్లు సత్తా చాటారు. మను భాకర్, అశోక్ పాటిల్, యశస్వి సింగ్ త్రయం స్వర్ణం దక్కించుకుంది. ఇక జూడోలోనూ భారత అమ్మాయి ఓ పతకం సాధించింది. మహిళల 57 కేజీల విభాగంలో యామిని మౌర్య మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. మూడు పసిడి, ఓ కాంస్య పతకంతో నాలుగు మెడల్స్ సాధించిన టీమ్ ఇండియా పాయింట్ల పట్టికలో నాల్గో స్థానంలో కొనసాగుతుంది. చైనాలోని చెంగ్డులో జరుగుతున్న ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడలు ఆగస్టు 8న ముగియనున్నాయి.

ప్రపంచ డెఫ్ టెన్నిస్ టోర్నీకి భవాని



హైదరాబాద్ : ప్రతిష్ఠాత్మక ప్రపంచ డెఫ్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌నకు రాష్ట్రానికి చెందిన యువ క్రీడాకారిణి భవాని కేడియా ఎంపికైంది. గ్రీసులోని హెర్సోనిసోస్ వేదికగా సెప్టెంబర్ 23-29న జరిగే మెగా టోర్నీ కోసం త్రివేడ్రంలో నిర్వహించిన జాతీయ సెలక్షన్స్ ట్రయల్స్‌లో భవాని సత్తాచాటింది. మహిళల సింగిల్స్ సెమీస్‌లో 6-4, 6-4తో క్రితి లాటాపై భవాని అద్భుత విజయం సాధించింది. గతేడాది బ్రెజిల్ డెఫ్ ఒలింపిక్స్‌లో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భవాని ఈసారి కచ్చితంగా పతకం గెలుస్తానని విశ్వాసం వెలిబుచ్చింది. టెన్నిస్‌లో నిలకడగా రాణిస్తున్న భవాని..సెయింట్ ఆన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది.

ఎంపికైన క్రీడాకారులు : పర్థీవ్ శేఖర్, ధనంజయ దూబే, శివాజీ, అర్షిత్, జాఫ్రిన్ షేక్, భవానీ కేడియా

పది వేదికల్లో పొట్టి ప్రపంచకప్



న్యూఢిల్లీ : 2024 టీ20 ప్రపంచకప్ తేదిలను ఐసీసీ ప్రాథమికంగా ఖరారు చేసినట్టు తెలుస్తోంది. కరీబియన్, యుఎస్‌ఏ సంయుక్తంగా ఆతిథ్యం అందిస్తున్న ఈ పొట్టి ప్రపంచకప్ పది స్టేడియాల్లో జరుగనుంది. జూన్ 4న ఆరంభ మ్యాచ్‌తో మొదలై, జూన్ 30న టైటిల్ పోరుతో ముగియనుంది. దీనిపై ఐసీసీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. త్వరలోనే పూర్తి వివరాలతో 2024 టీ20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం కనిపిస్తుంది.

లక్ష్యసేన్ నిష్క్రమణ

- సెమీస్‌లో ఓడిన యువ షట్లర్
- జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్



టోక్యో (జపాన్) : భారత బ్యాడ్మింటన్ యువ షట్లర్, కెనడా ఓపెన్ చాంపియన్ లక్ష్యసేన్ నిరాశపరిచాడు. బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో వరుసగా మూడో టోర్నీలో సెమీఫైనల్స్‌కు చేరుకుని సత్తా చాటిన లక్ష్యసేన్.. జపాన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టలేకపోయాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో శనివారం జరిగిన సెమీఫైనల్లో లక్ష్యసేన్ మూడు గేముల పోరాటంలో పరాజయం పాలయ్యాడు. ఐదో సీడ్, ఇండోనేషియా షట్లర్ జొనాథన్ క్రిస్టీ 21-15, 13-21, 21-16తో లక్ష్యసేన్‌పై పైచేయి సాధించాడు. 68 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన సెమీస్ సమరంలో చివరి వరకు లక్ష్యసేన్ రేసులోనే నిలిచాడు. తొలి గేమ్‌లో 12-11తో ముందంజలో నిలిచినా.. లక్ష్యసేన్ జోరు కొనసాగించలేదు. చివర్లో లయ కోల్పోయాడు. తొలి గేమ్ చేజార్చుకున్నాడు. కానీ రెండో గేమ్‌లో లక్ష్యసేన్ గొప్పగా పుంజుకున్నాడు. విరామ సమయానికి 11-4తో భారీ ఆధిక్యంలో నిలిచాడు. ద్వితీయార్ధంలోనూ దుమ్మురేపి ఏకపక్షంగా రెండో గేమ్‌ను గెల్చుకున్నాడు. సెమీఫైనల్ ఫైట్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. విరామ సమయానికి 7-11తో వెనుకంజ వేసిన లక్ష్యసేన్.. ద్వితీయార్ధంలో అంచనాలను అందుకోలేదు. సహజంగా వెనుకంజలో నిలిచినా.. ప్రత్యర్థిని గేమ్ పాయింట్ వద్ద నిలబెట్టి విజయాలు సాధించిన రికార్డు లక్ష్యసేన్ సొంతం. కానీ జపాన్ ఓపెన్‌లో లక్ష్యసేన్ ఆ ప్రదర్శన పునరావృతం చేయలేకపోయాడు. 21-16తో మూడో గేమ్‌ను, ఫైనల్స్ బెర్త్‌ను జొనాథన్ క్రిస్టీ దక్కించుకున్నాడు. మరో సెమీఫైనల్లో నాల్గో సీడ్ కొడాయ్ నరొక (జపాన్)పై టాప్ సీడ్ విక్టర్ అక్సెల్సన్ (డెన్మార్క్) 21-11, 21-11తో అలవోక విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 తైజు యింగ్‌పై కొరియా స్టార్ అన్ సె యంగ్ 21-17, 21-12తో గెలుపొందగా, మరో సెమీస్‌లో గ్రెగోరియ (ఇండోనేషియా)పై హీ బింగ్జియావో (చైనా) 13-21, 21-19, 21-9తో పైచేయి సాధించింది. నేడు మహిళల సింగిల్స్ ఫైనల్లో యంగ్‌తో హీ బింగ్జియావో తలపడనుంది.

నవచిత్రం

అన్నా చెల్లెళ్ళ బంధం హైలెట్‌గా భోళాశంకర్



కీర్తి సురేష్, చిరంజీవి

అన్నా చెల్లెళ్ళ అనుబంధం నేపథ్యంలో ఇప్పటికే ఎన్నో సినిమాలు వచ్చి, ప్రేక్షకుల విశేష ఆదరణతో విజయవంతమైన చిత్రాలుగా నిలిచాయి. అలాగే బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మా 'భోళాశంకర్' సినిమా సైతం ప్రేక్షకుల మనసుని గెలుచుకుంటుందనే నమ్మకం ఉంది' అని అంటున్నారు మేకర్స్.

చిరంజీవి తాజాగా నటించిన మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవి సోదరిగా కీర్తి సురేష్ కనిపించనున్నారు.

రామబ్రహ్మం సుంకర ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. రెండు రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌కు ట్రిమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటి వరకు 14.5 మిలియన్ వ్యూస్‌తో ట్రైలర్ వీడియో టాప్ ట్రెండింగ్‌లో ఉంది. చిరంజీవి స్వాగ్, అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, పవర్ ఫుల్ డైలాగ్ డెలివరీ అభిమానులు, మాస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే ఈ సినిమాలో యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఉంటాయని ట్రైలర్ ద్వారా అర్థమైంది. అలాగే ఫ్యామిలీ ఆడియన్స్‌కి నచ్చే అంశాలూ ఈ సినిమాలో పుష్కలంగా ఉన్నాయి. అన్న చెల్లెళ్ళ బంధం సినిమాకు ప్రధాన ఆకర్షణ. అన్నా చెల్లెలుగా చిరంజీవి, కీర్తి సురేష్‌ల సీక్వెన్స్‌లు సినిమాకు బలంగా నిలుస్తాయి. వీరిద్దరూ బ్యూటీఫుల్ కెమిస్ట్రీని పంచుకున్నారు. ఈ రెండు పాత్రల మధ్య హ్యూమర్, డ్రామా, భావోద్వేగాలు ఉంటాయి. కాబట్టి, ఈ సినిమా కేవలం ఒక వర్గం ప్రేక్షకులకు పరిమితం కాదు. మాస్, యూత్, ఫ్యామిలీస్‌ని సమానంగా ఆకట్టుకునే సినిమాగా ఉంటుంది. ఈ సినిమా నుంచి ఇప్పటివరకు విడుదలైన ప్రతి కంటెంట్ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా సినిమా ఉంటుందని మేకర్స్ దీమా వ్యక్తం చేశారు. అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం, డడ్లీ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఆగస్టు 11న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

పవర్‌ఫుల్ బిగ్ బుల్

రామ్ పోతినేని, పూరీ జగన్నాథ్‌ల క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'డబుల్ ఇస్మార్ట్'. వారి గత బ్లాక్‌బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ కొద్ది రోజుల క్రితం ముంబైలో ఒక ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించడంతో ప్రారంభమైంది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ సినిమా కోసం రామ్ స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు.



సంజయ్ దత్

శనివారం మేకర్స్ ఒక బిగ్ అప్‌డేట్‌తో సర్‌ప్రైజ్ చేశారు. బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ ఇందులో ఫుల్ లెంగ్త్ రోల్ పోషిస్తున్నారు. ఆయన పాత్రను బిగ్ బుల్‌గా పరిచయం చేస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. స్టన్నింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సంజయ్ దత్ వైపు గన్స్ గురిపెట్టినట్లు కనిపిస్తున్నాయి. దీంతో ఇందులో ఆయన పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో నటిస్తున్నట్లు పోస్టర్ చెప్పకనే చెప్పింది. రామ్, సంజయ్‌దత్‌లను తెరపై కలిసి చూడటం అందరికీ ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. ఈ సినిమా కోసం పని చేస్తున్నందుకు తన ఆనందాన్ని పంచుకున్నారు సంజయ్ దత్. 'డైరెక్టర్ ఆఫ్ ది మాసెస్ పూరీ జగన్నాథ్, రామ్‌తో కలసి సైన్స్ ఫిక్షన్ మాస్ ఎంటర్‌టైనర్ 'డబుల్ ఇస్మార్ట్'లో బిగ్ బుల్ పాత్ర చేయడం ఆనందంగా, చాలా గర్వంగా ఉంది. 2024 మార్చి 8న సినిమా విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని ట్వీట్ చేశారు.

క్రేజీ కాంబోలో కాంత

రానా, దుల్కర్ సల్మాన్ ఓ సినిమా కోసం జతకట్టారు. రానా స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మించనున్న ఈ మల్టీ లింగ్వల్ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించనున్నారు.

దుల్కర్ సల్మాన్ బర్త్‌డే నేపథ్యంలో మేకర్స్ ఆసక్తికరమైన పోస్టర్‌తో సినిమా టైటిల్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'కాంత' అనే ఆసక్తికర టైటిల్ పెట్టారు. సహ నిర్మాతగా వ్యవహరించడంతో పాటు దుల్కర్ సల్మాన్ ఈ చిత్రంలో లీడ్ రోల్ పోషించనున్నారు.





రానా, దుల్కర్ సల్మాన్

ఈ సినిమాతో అసోసియేట్ అవ్వడానికి చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్న రానా ఇది ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని భరోసా ఇచ్చారు.

ఈ చిత్రం గురించి ఆయన మాట్లాడుతూ,'చాలా అరుదుగా మంచి సినిమా పవర్ గుర్తు చేసే కథ మనకు కనిపిస్తుంది. 'కాంత' మమ్మల్ని ఒకచోట చేర్చిన ప్రాజెక్ట్. సూపర్ ట్యాలెంటెడ్ దుల్కర్ సల్మాన్, వేఫేరర్ ఫిలిమ్స్‌తో ఈ ప్రయాణాన్ని ప్రారంభించడం పట్ల ఆనందంగా ఉంది. తన పుట్టినరోజు సందర్భంగా రాబోయే సరికొత్త ప్రపంచానికి సంబంధించిన టైటిల్ రివీల్ చేశాం. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది' అని తెలిపారు.



చచ్చినా చావని ప్రేమిది..

విష్ణు వర్షిణి క్రియేషన్స్ బ్యానర్ పై హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'సందేహం'. 'షి బిలీవ్డ్' అనేది ట్యాగ్ లైన్.

సత్యనారాయణ పర్చా నిర్మాతగా లవ్ అండ్ ఎంగేజింగ్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

'ఊరికి ఉత్తరాన' ఫేమ్ సతీష్ పరమవేద దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సుమన్ వూటుకూరు హీరోగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ సినిమా నుంచి 'చచ్చినా చావని ప్రేమిది' అనే లిరికల్ సాంగ్‌ను దర్శకుడు దశరథ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ లిరికల్ సాంగ్‌ను విడుదల చేయటం చాలా హ్యాపీగా ఉంది. పూర్ణాచారి పాటను అద్భుతంగా రాశారు. పాట వింటుంటే చాలా క్యాచీగా ఉంది. నిర్మాత సత్యనారాయణ, హీరో సుమన్, హెబ్బా పటేల్ ఎంటైర్ టీమ్‌కు అభినందనలు' అని అన్నారు. "ఈ పాట చాలా బావుంది. సినిమా మంచి విజయాన్ని సాధించాలి. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ పాటకు పూర్ణాచారి రాసిన అత్యద్భుతమైన సాహిత్యం అందర్నీ అలరిస్తోంది' అని మన చౌదరి చెప్పారు.

ఆ హీరోలందరూ నాకు స్ఫూర్తి

ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్, గోపీచంద్ .. వీళ్లే నా రోల్స్ మోడల్స్ అని అంటున్నారు 'భారతీయన్స్' చిత్ర హీరో నిరోజ్ పుచ్చా. టెన్నిస్ క్రీడాకారుడైన ఆయన మిత్రుల ప్రోత్సాహంతో నటుడిగా సినీ రంగ ప్రవేశం చేశారు. ఇటీవల విడుదలైన 'భారతీయన్స్'తో ఆయనకు నటుడిగా మంచి గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో నిరోజ్ పుచ్చా మీడియాతో మాట్లాడుతూ, 'ఇష్టపడి ఈ రంగంలోకి వచ్చాను. కష్టపడితే ఇతర హీరోలా మాదిరిగానే ఎదగ వచ్చు అని నమ్మాను. మంచి అవకాశం వస్తే హీరోగానే కాకుండా విలన్‌గానూ నటించడానికి సిద్ధంగా ఉన్నా. 'భారతీయన్స్' లాంటి పాన్ ఇండియన్ సినిమాలో తొలి అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. గురువు దీనరాజ్, నిర్మాత శంకర్ నాయుడుకి థ్యాంక్స్. మిస్టర్ పులావ్ ఔట్ లెట్స్‌తో వ్యాపార రంగంలో ప్రవేశించాను. దీన్ని వైజాగ్‌లో మొదట ప్రారంభించాను. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఫ్రాంచైజీల రూపంలో విస్తరించాను. దీనివల్ల నాకో గ్రూప్ ఏర్పడింది. అందులో ఉండే నవీన్ వర్మ అనే వ్యక్తి నుంచి సినిమా ప్రతిపాదన వచ్చింది. నీ స్క్రీన్ ప్రెజన్స్ చాలా బాగుంటుంది. మనం కలిసి సినిమా చేద్దాం అన్నాడు. అలా 2019లో నా జర్నీ షార్ట్ ఫిలింతో ప్రారంభమైంది. ప్రస్తుతం విజయ్ అనే డైరెక్టర్‌తో ఓ యాక్షన్ సినిమా చేస్తున్నాను. దీనికి ఇంకా పేరు పెట్టలేదు. ఇందులో నెగటివ్ పాత్ర చేస్తున్నాను. ఇది సెప్టెంబరులో విడుదలవుతుంది. ఏ పాత్రనైనా చేసేందుకు రెడీగా ఉన్నా. ముఖ్యంగా నెగటివ్ రోల్స్‌కి రెడీగా ఉన్నా' అని అన్నారు.



నిరోజ్ పుచ్చా

ఫ్యామిలీ మొత్తం చూడదగ్గ చిత్రం

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా రూపొందిన చిత్రం 'కృష్ణ గాడు అంటే ఒక రేంజ్'. శ్రీ తేజస్ ప్రొడక్షన్ ప్రై.లి బ్యానర్ పై పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పిఎస్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి ఈ సినిమాను నిర్మించారు. రాజేష్ దొండపాటి దర్శకుడు. ఈ చిత్రం ఆగస్ట్ 4న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత పెట్లా రఘురామ్ మూర్తి మీడియాతో మాట్లాడుతూ, 'ఉద్యోగరిత్యా సాఫ్ట్ వేర్ అయినా కూడా నాకు సినిమాలంటే చాలా ఇష్టం. ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా ఇది. మా సినిమాలో హీరో గొర్రెల కాపరిగా పని చేస్తాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోతాడు. అతని తండ్రి కల ఏంటి?.. ఆ కలను నెరవేర్చే ప్రయత్నంలో ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో సినిమా కథ ఉంటుంది. మా హీరో రిష్వి తిమ్మరాజులో కాస్త వెరైటీ, కొత్త స్పార్క్ కనిపించింది. హీరోయిన్ పాత్ర కోసం చాలా మంది ఆడిషన్స్ చేశాం. చివరకు విస్మయని తీసుకున్నాం. దర్శకుడు రాజేష్ అద్భుతంగా సినిమాని తెరకెక్కించాడు. ఇండస్ట్రీలో నిర్మాతగా దిల్ రాజు, అరవింద్, రామానాయుడు అంత ఎదగాలని అనుకుంటున్నాను. సిరివెన్నెల సీతారామశాస్త్రి వంటి క్రియేటివ్ వ్యక్తుల వల్లే నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. వారే నాకు స్ఫూర్తి. సినిమా విడుదల విషయంలో దిల్ రాజు, బెక్కెం వేణుగోపాల్ సాయం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమాని రిలీజ్ చేయడమే అతి పెద్ద విజయంగా అనిపిస్తోంది' అని తెలిపారు.



పెట్లా రఘురామ్ మూర్తి

దర్శకుడు ప్రసాద్ కన్నుమూత



ఎన్.ఎస్.ఆర్.ప్రసాద్

పలు చిత్రాలతో అభిరుచిగల దర్శకుడిగా పేరొందిన ఎన్.ఎస్.ఆర్. ప్రసాద్ (49) ఇకలేరు.

గత కొంత కాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డి గూడెంకి చెందిన ప్రసాద్ సినిమాలపై మక్కువతో సినీ రంగ ప్రవేశం చేశారు. తొలుత రచయితగా పలు చిత్రాలకు పని చేశారు. ఆ తర్వాత ఆర్యన్ రాజేష్ హీరోగా మూవీ మొఘల్ డా॥ డి.రామానాయుడు నిర్మించిన 'నిరీక్షణ' చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయం అయ్యారు. సీతారామ్‌గా పరిశ్రమ వర్గాలకు బాగా సుపరిచితుడైన ప్రసాద్ ఆ తర్వాత శ్రీకాంత్‌తో 'శత్రువు', నవదీప్‌తో 'నటుడు' చిత్రాలకు దర్శత్వం వహించారు. తాజాగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'రెక్కి' సినిమా విడుదల సన్నాహాల్లో ఉంది. దర్శకుడు ప్రసాద్ మృతి పట్ల పరిశ్రమలోని పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

సుక్మాలో ఎదురుకాల్పులు

- ఆరుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మరణించి ఉండొచ్చు.. లేదా గాయాలపాలై ఉండొచ్చని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు మృతదేహాలు లభ్యం కాలేదన్నారు. చింతగుఫా, కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలోని చోటేకేద్వాల్ గ్రామ సమీపంలోని డివిజనల్ కమిటీ మెంబర్, కిష్టారం ఏరియా కమిటీ ఇన్‌ఛార్జి రాజుతోపాటు 30 నుంచి 35 మంది మావోయిస్టులు సమావేశమైనట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడ పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య గంట పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురి నుంచి ఆరుగురు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చు.. లేదా గాయపడి ఉండొచ్చు అని పోలీసులు పేర్కొన్నారు. అయితే వారిని మావోయిస్టులు అడవుల్లోకి లాక్కెళ్లి ఉండొచ్చని, ఆచూకీ కోసం కూంబింగ్ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ - ఇల్లంతకుంట


(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూరు గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. రైతు పత్తెము తిరుపతి(39) తన ఎకరం భూమికి తోడు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాడు. ఈ క్రమంలో సరిగా పంట దిగుబడి రాక చేసిన అప్పులు రెండింతలయ్యాయి. కొన్నిరోజుల కిందట పెద్ద కూతురు వివాహం చేయగా అందుకు మరికొంత అప్పు చేశాడు. అప్పులు రూ.10లక్షల వరకు పెరగడంతో తీర్చలేనని ఆందోళనకు గురయ్యాడు. వ్యవసాయ భూమి వద్ద శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.

బిజినెస్

ఏఐతో ఉద్యోగాలు ఊడటం ఖాయం

చాట్‌జిపిటి సృష్టికర్త శామ్ ఆల్ట్‌మన్



న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఏఐ) వల్ల ఉద్యోగాలు ఊడటం ఖాయమని చాట్‌జిపిటి సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. ఏఐతో ఉద్యోగాలు ప్రమాదంలో పడుతాయని స్వయంగా ఆల్ట్‌మన్ పేర్కొనడం ఆందోళకరం. గతేడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చిన చాట్‌జిపిటి అనూహ్య ఆదరణ సొంతం చేసుకుందన్నారు. మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అలాగని ఏఐ టూల్స్ అన్నీ పరిపూర్ణం కావన్నారు. వాటికీ కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. అట్లాంటిక్ సంస్థకు ఇచ్చిన ఇంటర్యూలో ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. మానవాళిపై ఏఐ ప్రభావం పూర్తిగా సానుకూలంగా ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. ఏఐ గణనీయమైన పురోగతిని చూపించినప్పటికీ, ఇది సమాజానికి సవాళ్లను కూడా విసురుతోందన్నారు. ఉపాధి మార్కెట్‌కు అంతరాయం కలగకుండా సానుకూలంగా ఉపయోగించేలా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. చాట్‌జిపిటి కంటే మరింత శక్తివంతమైన ఏఐని సృష్టించే సామర్థ్యం ఓపెన్ ఏఐకి ఉందని ఆల్ట్ మాన్ వెల్లడించాడు. కానీ ఆ టూల్స్ ఇప్పట్లో విడుదల చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఊహించని పరిణామాలను ఎదుర్కోవడం కష్టంగా ఉందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల భారత్ కూడా ఉత్సాహంగా ఉండటం ప్రశంసనీయమన్నారు. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్స్‌కు సపోర్ట్ ఇవ్వడానికి ఓపెన్‌ఏఐ ప్రణాళికలను రూపొందించామన్నారు. కృత్రిమ మేధ కేవలం మానవ ప్రయత్నాలకు తోడ్పడుతుందని, ఉద్యోగాలను భర్తీ చేయదని కొద్ది మంది నిపుణులు అభిప్రాయపడుతుండగా.. ఆల్ట్‌మన్ మాత్రం ఉద్యోగాలు ఖచ్చితంగా ప్రభావితమవుతాయని స్పష్టం చేయడం ఆందోళకరం.

ఆన్‌లైన్ గేమింగ్‌పై రిపీట్ టాక్సేషన్

ఆ పరిశ్రమ వర్గాల ఆందోళన

హైదరాబాద్ : ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం పన్ను విధించడం సహేతుకం కాదని ఆ రంగం పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన దానిలో రిపీట్ టాక్సేషన్ పద్ధతి ఉందని తెలిపింది. ఆగస్ట్ 2న జిఎస్‌టి కౌన్సిల్ భేటీ అయ్యే అవకాశం ఉన్నందున తమ ఆందోళనలను పరిగణలోకి తీసుకోవాలని కోరింది. ప్రతీ గేమ్‌పై పన్ను విధించడం ద్వారా పరిశ్రమ బలహీనపడే అవకాశం ఉందని, ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. రిపీట్ టాక్సేషన్ వల్ల 50-70 శాతం వరకు పన్ను పడే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ పూర్తి విలువపై 28 శాతం జిఎస్‌టి అనేది పరిశ్రమకు మరణశాసనంగా మారుతుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఏంజెల్ వన్ 'స్మార్ట్ ఇన్వెస్టింగ్ సూపర్ యాప్' ఆవిష్కరణ



న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఏంజెల్ వన్ లిమిటెడ్ కొత్తగా స్మార్ట్ ఇన్వెస్టింగ్ సూపర్ యాప్‌ను ఆవిష్కరి ంచినట్లు వెల్లడించింది. ఇది ఇన్వెస్టర్ల సంపద సృష్టి ప్రయాణంలో డేటా, సాంకేతికత శక్తిని ప్రభావితం చేయడానికి మద్దతును ఇవ్వనుందని పేర్కొంది. వేగం, భద్రత, నమ్మదగిన అనుభవం లక్షణాలను కలిగి ఉందని తెలిపింది. సూపర్ యాప్ కస్టమర్ సెంట్రిసిటీని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందని తెలిపింది.

ఓలా ఎస్1 స్కూటర్ ఉత్పత్తి నిలిపివేత

బెంగళూరు : ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ తన ఎస్1 స్కూటర్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు ప్రకటించింది. 2021లో విడుదల చేసిన ఈ మోడల్‌ను తాజాగా అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ఈ నిర్ణయానికి కారణంపై స్పష్టతనివ్వలేదు. దీంతో ఇకపై ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో మోడల్స్ మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి.

హాస్టల్ వసతిపైనా 12% జీఎస్‌టీ..!

న్యూఢిల్లీ : ప్రయివేటు హాస్టల్లో ఉండే విద్యార్థులు, ఉద్యోగులపై ఇకపై అదనంగా భారం పడొచ్చు. హాస్టల్‌లో నివాసానికి చెల్లించే అద్దెపై 12 శాతం జిఎస్‌టి వర్తిస్తుందని అథారిటీ ఆఫ్ అడ్వాన్స్ రూలింగ్ (ఎఎఆర్) బెంగళూరు, లక్నో బెంచ్‌లు రెండు వేర్వేరు కేసుల్లో స్పష్టం చేశాయి. పేయింగ్ గెస్ట్ (పిజి), హాస్టళ్లు, గృహ వసతి కిందకు రావని.. అవి వాణిజ్యపరమైనందున జిఎస్‌టి నుంచి మినహాయింపు ఉండదని ఎఎఆర్ కర్ణాటక బెంచ్ తాజాగా తెలిపింది. రోజుకు రూ.1000 కంటే తక్కువ అద్దె వసూలు చేసే హాస్టళ్లకు 2022 జూలై 17 వరకు మాత్రమే జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇచ్చినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో ఇకపై హాస్టళ్లపై 12 శాతం జిఎస్‌టి వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఆగస్ట్ 2న జరగనున్న జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారో వేచి చూడాలి.

సాగులో రైతులు.. ధరణిలో రియల్టర్లు..

- రూ. వెయ్యి కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమికి గాలం
- 76.24 ఎకరాల 'బిల్లా దాఖలా' భూములపై పెద్దల కన్ను

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఏండ్ల తరబడి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ఆ భూములపై హక్కులు కల్పించేందుకు.. రెవెన్యూ రికార్డుల సమస్యలు అడ్డొస్తాయి. కానీ బడాబాబులకు మాత్రం ఎలాంటి రికార్డులు లేకున్నా పనులు జరిగిపోతున్నాయి. రికార్డుల్లో లేని 'బిల్లా దాఖలా' భూమిపై కన్నేసిన పెద్దలు ఏకంగా సర్వే నెంబర్ సృష్టించి రూ.వెయ్యి కోట్ల విలువ గల భూమిని కొట్టేసేందుకు కుట్రలు చేశారు. ప్రస్తుతం రూ.500 కోట్ల విలువ గల భూమిని వినాయక డెవలపర్స్ పేరున రిజిస్ట్రేషన్ అయింది. ఏండ్ల కొద్దిగా పెండింగ్‌లో ఉన్న భూములు ఎలా రిజిస్ట్రేషన్ అవుతున్నాయని రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా.. తమకు తెలియదని స్లాట్ బుక్ అవడంతో రిజిస్ట్రేషన్ చేస్తున్నామని రెవెన్యూ అధికారులు చెప్పడం గమనార్హం.

ఎలాంటి రికార్డులు లేకుండా 21 ఎకరాలు రిజిస్ట్రేషన్

తమకూ పట్టాలివ్వాలని రైతుల ఆందోళన



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల-కొండకల్ రెవెన్యూ గ్రామాల మధ్య 'బిల్లా దాఖలా(రెండు గ్రామాల సరిహద్దు)' పేరుతో 76.24 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ఎన్నో ఏండ్లుగా మెకిలా, కొండకల్ గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్నారు. అయితే ఈ భూములకు పట్టాలివ్వాలని రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో అసైన్డ్ భూములుగా పట్టా పాసు పుస్తకాలు ఇచ్చారు. కానీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నమోదు చేయలేదు. రైతులను మభ్యపెట్టేందుకు నాటి ప్రభుత్వం డమ్మీ పాసుపుస్తకాలు ఇచ్చి రైతుల నోరు మూయించిందన్ని విమర్శలున్నాయి. ఇటీవల కొంత మంది రైతుల నుంచి ఈ భూములను కొనుగోలు చేసి ఈ భూములకు సర్వేనెంబర్ 555ను సృష్టించి ధరణిలో స్లాట్ బుక్ చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి భూమి బదిలీ చేయాలంటే.. లింక్ డాక్యుమెంట్ ఉండాలి. దాని ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ సర్వేనెంబర్ 555 నెంబర్‌కు ఎలాంటి డాక్యుమెంట్స్ లేవు.

మా భూమికి పట్టా ఇవ్వాలి



మాజీ సైనికుడి కోటాలో మా నాన్నకు ప్రభుత్వ 'బిల్లా దాఖలా' నాలుగు ఎకరాల భూమి ఇచ్చారు. ఆ భూముల్లో వ్యవసాయం కూడా చేసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాసు పుస్తకాలు వస్తున్నాయంటే కొన్ని డబ్బులు కూడా ఖర్చు పెట్టుకున్నాం. కానీ పట్టాలు, పాసు పుస్తకాలు రాలేదు. వినాయక డెవలపర్స్‌కు రిజిస్ట్రేషన్ చేసిన మాదిరిగా మా భూములకు కూడా పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలి.

- అహ్మద్ పాషా, బాధిత రైతు

సర్వే నెంబర్ 555/10, ఖాతా నెంబర్ 60850 వినాయక డెవలపర్స్‌కు, పంతం మల్లమ్మ అనే వ్యక్తి నుంచి ఈ నెల 12వ తేదీన 10 గుంటల భూమి బదిలీ అయింది. పంతం మల్లమ్మకు ఎలాంటి డాక్యుమెంట్ లేకుండా ఆమె పేరు నుంచి వినాయక డెవలపర్స్‌కు ఎట్లా భూమి బదిలాయించారని రెవెన్యూ అధికారులను అడిగితే వారి దగ్గర సమాధానం లేదు. సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డు రిపోర్టు ప్రకారం చేశామంటూ దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు.

మా పేర్లు కూడా రికార్డుల్లో పొందుపర్చండి

ప్రస్తుతం సాగులో ఉన్న రైతులు తమ పేర్లు కూడా ధరణిలో పొందుపర్చి పాసు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కొంత మంది రైతుల నుంచి వినాయక డెవలపర్స్‌కు పట్టా చేసిన విధంగా తమ భూములకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కొలను గోపాల్‌రెడ్డి రెండెకరాలు, పెంటరెడ్డి ఎకరం, గుత్త నర్సింహారెడ్డి ఎకరం, పాషా మాజీ సైనికుడు నాలుగు ఎకరాలు.. ఇలా మొత్తం 55 మంది రైతులు ఎన్నో ఏండ్లుగా ఈ భూములను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇందులో కొంత భూమిని జీవీకే సంస్థ కబ్జా పెట్టింది. దీనిపై రైతులు పదేండ్లుగా తమ భూమి కోసం పోరాటం చేస్తున్నారు. ఆ సమస్య కోర్టు దాకా వెళ్లింది. కోర్టు తీర్పు కోసం రైతులు వేచిచూస్తున్నారు.

ఈ భూములకు సర్వే చేయించి.. తహసీల్దార్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా పాత రికార్డులను పరిశీలించి ఏడీ రిపోర్టు జారీ చేశారు. దీని ఆధారంగా కలెక్టర్ సూచన మేరకు సీసీఎల్ఏ ఈ భూములకు క్లీయరెన్స్ కూడా ఇచ్చినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అప్పటికే ఈ భూములపై కన్నేసిన బడా నేతలు, రియల్టర్లు, వ్యాపారులు పహణీలు, పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే నంబర్, ఖాతానంబర్లు లేవనే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఇబ్బంది ఉంటే తాము చూసుకుంటామని నమ్మబలుకుతున్నారు. తక్కువ ధరకు 21 ఎకరాలకుపైగా కొల్లగొట్టారు. అలాగే ఎలాంటి సపోర్టింగ్ డాక్యుమెంట్లు సమర్పించకుండానే 'ధరణి'లో స్లాట్ బుక్ చేసి గుట్టుగా రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. అయితే రైతులకు పట్టాలు ఇవ్వడానికి సాధ్యం కానీ పని.. బడా వ్యాపారులకు పట్టా ఎట్లా చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది.

సర్వే శాఖ సర్వే రిపోర్టు ఉంది

సర్వే నెంబర్ 555 రికార్డుల్లో లేదన్న విషయం వాస్తవం. కానీ సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డు వారి దగ్గర ఉన్న పాత రికార్డుల్లో ఉందని రిపోర్టు ఇవ్వడంతో సర్వే నెంబర్‌ను ధరణిలో పొందుపరిచారు. దాని ప్రకారం స్లాట్ బుక్ అవుతుంది. దాని ప్రకారమే రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చింది.

- నయిమొద్దీన్, శంకర్‌పల్లి తహసీల్దార్

సహాయక చర్యలు కొనసాగించండి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అధికారుల్ని ఆదేశించారు. శనివారంనాడాయన వరద అంశాన్ని పర్యవేక్షించారని ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు చర్యల వల్లే పెద్దగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, సహాయ, పునరావాస చర్యలపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గోదావరి పరివాహకంలో మూడో ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు అప్రమత్తతపై ఈఎన్సీలు, చీఫ్ ఇంజనీర్లకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారని వివరించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పరిస్థితిని పర్యవేక్షిస్తూనే ఉన్నారని వివరించారు. ఫోన్లో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నారన్నారు. హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగునీరు. మందులను అందించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అధికారయంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మంత్రులను ఆదేశించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీ పరిధిలో పురపాలక శాఖ ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారని వివరించారు. వైద్య సేవలపై మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ చేసి పరిస్థితి అడిగి తెలుసుకున్నారనీ, సీఎం ఆదేశాలతో ఇప్పటికే వైద్యశాఖలో ఉద్యోగుల సెలవులు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు భద్రాచలం ప్రాంతంలో ఏరియల్ సర్వే చేసిన మంత్రి అక్కడి పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారని చెప్పారు. ముంపు ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 12వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం, వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి సత్యవతి రాథోడ్‌ను ఫోన్లో ఆదేశించారన్నారు. ఆ మేరకే మంత్రి మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు, ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారని తెలిపారు. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో ఇన్‌ఫ్లో ను ముందస్తు అంచనా వేసి, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

ప్రజలను మోసం చేసే పనిలో మాజీ సీఎంలు

చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి శిష్యుడు కిషన్‌రెడ్డి : మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవ తెలంగాణ-గజ్వేల్



తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి సమైక్యాంధ్ర మాజీ ముఖ్యమంత్రులు రంగంలోకి దిగినట్టు ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులకు హెూంమంత్రి మహ్మద్‌అలీతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శిష్యుడు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, మరోపక్క మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి శిష్యుడు బీజేపీ అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రజలను మోసం చేసే పనిలో నిమగ్నమయ్యారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బీజేపీ రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి వేలాదిమంది రైతుల చావుకు కారణమైందన్నారు. మూడు పంటలు పండాలని సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలను కడుపులో పెట్టుకొని చూసు కుంటున్నారని చెప్పారు. తెలంగాణ ప్రజాసంక్షేమంపై ముందుచూపుగా ఎవరు ఆలోచిస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి సమైఖ్యాంధ్ర మాజీ సీఎంలు ఓర్వలేకపోతున్నారన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. గజ్వేల్ ఏసీపీ కార్యాలయానికి రూ.2.84 కోట్లు కాగా, గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి రూ.16.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి శాంతియుతంగా ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ బడ్జెట్లో పోలీస్ శాఖకు రూ.9,500 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ శ్వేత, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మెన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ రోజా శర్మ, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్, గజ్వేల్ స్పెషల్ అధికారి ముత్యంరెడ్డి, ఎంపీపీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అదృశ్యమైన 87 శాతం మంది మహిళలు, బాలికలను కనిపెట్టాం

- రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ షికా గోయెల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అదృశ్యమైన పిల్లలు, మహిళల్లో 87 శాతం మందిని కనిపెట్టి వారి సొంత గూటికి చేర్చటం జరిగిందని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ షికా గోయెల్ వెల్లడించారు. ఇందులో 95 శాతం మంది మహిళలు ఎలాంటి వ్యవస్థీకృత నేరాల బారిన పడలేదని ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహిళలు, బాలికల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించిన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా భద్రత విభాగం షీ టీమ్‌ల ద్వారా వందలాది మంది బాలబాలికలను, మహిళలను రక్షించటం జరిగిందని ఆమె తెలిపారు. ప్రధానంగా షీటీమ్స్ ఏర్పాటుతో మహిళలు భద్రతపరంగా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఆచూకీ లభించిన 87 శాతం మంది పిల్లలు, మహిళలు మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీకి గురి కావటం, వేశ్య వృత్తికి లాగబడటం, ఇసుక బట్టీలలో అక్రమంగా పని చేయించటం, హెూటళ్లలో బాల కార్మికులుగా పని చేయటంతో పాటు ఇతర వ్యవస్థీకృత నేరాల బారిన పడలేదని ఆమె వివరించారు.

2021లో 86 శాతం మంది పిల్లలు, 87.5 శాతం మంది మహిళల మిస్సింగ్ కేసులను శోధించి వారిని సొంత గూటికి చేర్చటం జరిగిందని, 2022లో 81 శాతం పిల్లలను, 81 శాతం మహిళలను కనిపెట్టటం జరిగిందని ఆమె తెలిపారు. కాగా, మహిళలు అదృశ్యం కావటానికి గృహ హింసలు, అదనపు కట్నం కోసం వేధింపులు, మానసిక క్షోభలు వంటివి కారణం కాగా పిల్లలు కనిపించకుండా పోవటానికి విహార యాత్రల్లో తప్పిపోవటం, పరీక్షలల ఫెయిలైన కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోవటం, కొన్ని సందర్భాల్లో ఇండ్లలో తల్లిదండ్రుల ఆగ్రహానికి గురైన స్థితిలో ఇంటి నుంచి వెళ్లిపోవటం వంటి కారణాలున్నాయని ఆమె తెలిపారు. కాగా, తప్పిపోయినవారిని గుర్తించటంలో ఫేషియల్ రికగ్నిషన్, దర్పణ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని అన్నారు. అలాగే, ఏడాదిలో ఆరేసి నెలల పాటు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాలు కూడా మిస్సింగ్ కేసులను ఛేదించటంలో ఎంతగానో దోహదపడుతున్నాయని ఆమె తెలిపారు. అదృశ్యమైన కేసులను ఛేదించటంలో జాతీయ స్థాయి సగటు పిల్లలకు సంబంధించి 60, మహిళలకు సంబంధించి 50 కాగా.. రాష్ట్రంలో అది 87 శాతానికి మించిందనీ, ఇది రాష్ట్ర పోలీసులు మిస్సింగ్ కేసులలో సాధించిన విజయానికి ఉదాహరణ అని షికాగోయెల్ తెలిపారు.

ఓర్వలేకనే రాష్ట్ర సర్కార్‌పై విమర్శలు

- క్రిస్టియన్ల అభివృద్ధికి కేసీఆర్ నిరంతర కృషి
- మైనార్టీల కోసం ఈ ఏడాది రూ. 2,200 కోట్ల నిధులు
- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్రిస్టియన్ల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని చూసి ఓర్వలేకనే విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. క్రిస్టియన్ సమాజం బీఆర్ఎస్ పార్టీకి దగ్గరవుతున్నదనే కారణంతోనే ఇలాంటి ప్రచారానికి తెరలేపాయని పేర్కొన్నారు. క్రిస్టియన్ల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చినట్టు వివరించారు. గత ప్రభుత్వాలు క్రిస్మస్ వేడుకలను కేవలం 40 లేదా 50 మంది నాయకులు, మత పెద్దలను పిలిచి తేనేటి విందు ఇచ్చి మమా అనిపించుకునేవారని ఒక ప్రకటనలో గుర్తుచేశారు. అందుకు భిన్నంగా సీఎం కేసీఆర్ ప్రతి ఏటా ఎల్బీ స్టేడియంలో దాదాపు 15 వేల మందితో అధికారికంగా వేడుకలు జరపడమే కాకుండా వారితో కలిసి క్రిస్మస్ ప్రేమ విందులో పాల్గొంటున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రతి ఏటా దాదాపు 2.85 లక్షల కుటుంబాలకు క్రిస్మస్ కానుకలు, క్రిస్మస్ వేడుకల కోసం నియోజకవర్గానికి రూ. 2 లక్షలను నిధులు కేటాయించిదని తెలిపారు. గడిచిన తొమ్మిదేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 411 చర్చిలకు గాను రూ. 32.63 కోట్లు కేటాయించారని తెలిపారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులకు రూ. 20 లక్షల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందజేస్తూ వారి ఉజ్వ భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారన్నారు. అలాగే 2 వేల మంది క్రిస్టియన్ మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్ యంత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. క్రిస్టియన్ల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే క్రైస్తవులకు 100 శాతం సబ్సిడీతో రూ. ఒక లక్ష ఆర్థిక సాయం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ కార్పోరేషన్ ఈ నెల 31 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. హ్ట్టూ:?//ఓబీఎ-ఎఎంఎంఎ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ కార్పోరేషన్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

31న నూతన న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ హైకోర్టుకు నియమితులైన ముగ్గురు కొత్త న్యాయమూర్తులు సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. గతంలో జస్టిస్ సుజన కళాసికంతో పాటు న్యాయవాదులు లక్ష్మీ నారాయణ అలిశెట్టి, అనిల్‌కుమార్ జూకంటి పేర్లను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టుకు ప్రతిపాదించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కౌశల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం ఆ పేర్లను ఈ నెల 13న ఆమోదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. కేంద్రం కూడా ఆమోదం చెప్పడంతో శుక్రవారం రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు గెజిట్ ప్రచురణ కూడా జరిగింది. వీరంతా 31వ తేదీ ఉదయం 9.40 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ప్రకటించారు. వీళ్లతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే ప్రమాణస్వీకారం చేయిస్తారు.

బీజేపీలోకి జయసుధ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రముఖ సినీనటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ బీజేపీలో చేరనున్నట్టు తెలిసింది. శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జీ కిషన్‌రెడ్డి ఆమెకు ఫోన్ చేసి, పార్టీలోకి ఆహ్వానించినట్టు సమాచారం. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారనీ, వచ్చే ఎన్నికల్లో ఆమెకు సికింద్రాబాద్ లేదా ముషీరాబాద్ అసెంబ్లీ స్థానాల నుంచి బీజేపీ టిక్కెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

ఆర్‌టిఐ దరఖాస్తుకు 40 వేల పేజీల్లో సమాధానం !



ఇండోర్ : సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద అడిగిన ఓ ప్రశ్నకు అధికారులు ఏకంగా 40 వేల పేజీల్లో సమాధానం ఇచ్చారు. ఆ డాక్యుమెంట్లను తీసుకెళ్లడానికి దరఖాస్తుదారుడు కారును తీసుకురాగా, కారు మొత్తం నిండిపోయింది. అధికారులు తన దరఖాస్తుకు నెలలోపు సమాధానం ఇవ్వకపోవడంతో పేజీకి రూ.2 చొప్పున చెల్లించాల్సిన అవసరం లేకుండాపోయింది. మధ్యప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. ధర్మేంద్ర శుక్లా అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద ఇండోర్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు ఓ దరఖాస్తు చేశారు. కరోనా సమయంలో ఔషధాలు, వైద్య పరికరాలు, ఇతర మెటీరియల్స్ కోసం జారీచేసిన టెండర్లు, బిల్లుల చెల్లింపునకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని అడిగారు. అధికారులు నెలలోపు సమాధానం ఇవ్వకపోవడంతో ఆయన ఫస్ట్ అప్పిలేట్ ఆఫీసర్ శరద్‌గుప్తాను ఆశ్రయించారు. అభ్యర్థనను అంగీకరించిన శరద్‌గుప్తా.. దరఖాస్తుదారుడికి ఉచితంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. 'డాక్యుమెంట్లను తీసుకెళ్లేందుకు నా కారును తీసుకురావాల్సి వచ్చింది. డ్రైవరు సీటు తప్ప కారు మొత్తం డాక్యుమెంట్లతో నిండిపోయింది' అని ధర్మేంద్ర శుక్లా తెలిపారు. నిర్దేశిత సమయంలోగా సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ ఖజానాకు రూ.80 వేలు నష్టం వచ్చేలా చేసిన సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అప్పిలేట్ ఆఫీసర్ శరద్ గుప్తా ఆదేశించారు.



విలాపగీతం

కులం, మతం
రెండు అవిభాజ్య శక్తులై
భారతావని స్తనాలపై
రెండు జెండలుగా విర్రవీగుతూన్నాయి
పైశాచికత్వం పెచ్చుమీరి
వీర మాతను వివస్త్రను
చేసి ఊరేగిస్తూ
ఎండిపోతున్న గుండె నుండి
ఎర్రటి నెత్తుటిపాలని పీల్చి పీల్చి పిప్పిచేసి
మానవ మృగం మానభంగం చేస్తుంటే
అవనితల్లి అచేతనవస్థలో
ఎన్ని సార్లు బుక్కబట్టి ఏడ్చి చచ్చిందో
ఏ నరమేధ నాజిలకు తెలుస్తుంది...

అలనాటి భారతంలో
కంటికి కనిపించని ద్రౌపది ఒక్కరే
కానీ...నేటి నా భారతావనిపై
పాచికలాటలో ప్రతి ఒక్క ఆడది
ఒక్కొ పాంచలిగా ఊరేగింపబడుతుంది
ఆరేళ్ల చిన్నారి నుండి
ఆరు పదుల అమ్మమ్మ వరకు.. ఆడదైతే చాలు
క్షణం క్షణం.. అనుక్షణం
రాకాసి మూకల ఆనవాళ్ళు
ఆమె అణువణువునా
చెరపలేని గుర్తులుగా చెక్కబడుతున్నాయి
అసలే కంప్యూటర్ కాలం కదా
కనులతో కాన్పులు చేస్తు
కసాయి నాయకులు తిరుగుతున్న దేశం నాది..
అందుకే నన్ను క్షమించు తల్లీ
ఈ వైరాగ్యాన్ని వేయి కనులతో
చూస్తున్నందుకు..!!

ఆమె నెలసరి నెత్తుటి గుడ్డల వాసనతో
మత్తులో మునుగుతున్న మురు?ల్లారా
ఒక్కసారి మీ మనోనేత్రాన్ని తెరచి చూడండి
ఈ సారి బ్రతకడానికి కాదు
చావడానికి బ్రతకాలి
మరొక్కసారి మిమల్ని రక్షించడానికి
ఏ అమ్మవారి గర్భం అండగా లేదు
ఎందుకంటే
ఆవిర్భావం..అంతం..
రెండు ఆమె చేతిలోనే ఇమిడి ఉన్నాయి కనుక..

- జి. గోపి, 90528 71896

కేరళ యువ సాహిత్య కెరటం

పుట్టి పెరిగిన చెట్టూచేమే అతడి అక్షరానికి ఆయువు. తనవాళ్ల కలిమిలేములే తన కథలకు ముడిసరుకు. కేరళకు చెందిన ఓ జేసీబీ డ్రైవర్.. ఇష్టమైన పనిని ఎవరైనా మనసు పెట్టి చేస్తారు. అది మనసుల్ని కదిలించేలా ఉంటే.. గుర్తింపు వెతుక్కుని మరీ వస్తుంది. చిన్ననాటి నుంచే తను పుట్టి పెరిగిన మట్టి పరిమళాలు.. ప్రకృతమ్మతో మమేకమైన జీవనశైలి.. కల్మషం లేని బతుకుల్ని కథలుగా చిత్రీంచేవాడు. కథలుగా రాసేవాడు. ఇరవయ్యేళ్లు వచ్చేసరికి ఈ భావాల్నింటికీ అక్షర రూపమిచ్చి కథల సంపుటిగా మలిచాడు. ఆ సాహితీ సౌరభాలు ఎల్లలు దాటి పరిమళిస్తున్నాయి. ఇటీవల కేరళ సాహిత్య అకాడమీ పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించింది. ఈ ఇరవై ఏనిమిదేండ్ల యువ కథా రచయిత కె.అఖిల్ ప్రతిష్టాత్మకమైన సాహిత్య అవార్డు వరించింది. ఈ క్రమంలోనే గీతా హిరణ్య ఎండోమెంట్ అవార్డ్ - 2022కు అఖిల్ ను ఎంపిక చేసింది అకాడమీ. 2020లో ప్రచురితం అయిన చిన్న కథల సంకలనం 'నీలచడయాన్'కు ఈ అవార్డ్ వచ్చింది. కుటుంబ ఆర్థిక సమస్యలతో టీనేజ్ లో ఉన్నప్పుడు రోజూ న్యూస్ పేపర్ వేసేవాడు. రాత్రి సమయాల్లో ఇసుక తవ్వేందుకు వెళ్లి.. అర్ధరాత్రి వరకు అక్కడే పని చేసేవారు. ఆ తరువాత జేసీబీ ఆపరేటర్ గాను పనిచేశాడు. ఇటువంటి క్లిష్ట సమయాల్లోనూ.. వీలు చిక్కినప్పుడల్లా రచనలు చేస్తుండేవాడు. గొప్ప జీవితానుభవం లేకుండా గొప్ప పుస్తకాలు పుట్టవు.. సామాన్యుల నుంచి కూడా అద్భుతాలు ఆవిష్కరణ జరుగుతుందని నిరూపించిన యువ కథకుడి పరిచయం అతడి మాటలలోనే...



పని చేసే సమయంలో ఒంటరితనాన్ని అధిగమించేందుకు సమాజంలో నుంచి గ్రహించిన విషయాల ఆధారంగా తనలో తాను కథలు ఊహించుకునేవాడినని అఖిల్ వెల్లడించారు. తన జీవితంలో చాలా మందిని కలిశానని.. వారి అనుభవాలను, ఇతర అంశాలను గ్రహించానని ఆయన చెప్పుకొచ్చారు. ఈ అవార్డ్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపిన అఖిల్.. ఇది తాను అస్సలు ఊహించలేదని చెప్పారు.

నాకు ఇప్పటికి నమ్మశక్యం కావడం లేదు. ఇంత ప్రతిష్టాత్మకమైన అవార్డు నాకు రావడం అనేది నన్ను ఇప్పటికీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఒక జేసీబీ ఆపరేటర్ జీవితంలోని కష్టతరమైన వాస్తవికత కథే ఇది. ఒక 28 ఏండ్ల సాధారణ యువకుడు అందుకున్న గొప్పవిజయం ఇది. సముచితంగా, సృజనాత్మకత, అద్భుతమైన ప్రయాణం.. జేసీబీ ఆపరేటర్‌గా పనిలో అలసిపోయినప్పుడు, నాకు నేను స్వాంతన చెందడం కోసం ఒక వ్యాపకంగా పెట్టుకున్నాను. నా ఆలోచనలు కథాంశాలను వ్రాయడానికి రాత్రి సమయంలో సమయాన్ని వెతుకుతున్నాను. నా తల్లిదండ్రులు, సోదరుడు, అమ్మమ్మలతో కూడిన ఒక చిన్న కుటుంబం మాది. ఆ కుటుంబ పోషణకే నేను నా చదువుకు స్వస్తీ చెప్పి.. డ్రైవర్ గా మారాల్సి వచ్చింది. కానీ సాహిత్య ప్రపంచం పట్ల నాకున్న ప్రేమ మాత్రం సజీవంగానే ఉంది. నిజం చెప్పాలంటే అంతకంటే ఎక్కువ ప్రేమ పెరిగింది. అదే నేడు ఒక ప్రతిష్టాత్మకమైన సాహిత్య పురస్కారాన్ని పొందడానికి ఈ రోజువారీ వేతన కార్మికుడికి అర్హతను ఇచ్చింది.



నేను రాసిన కథలను ప్రచురించుకోవాలని, నా కథలను అచ్చులో చూసుకోవాలని నాకు చాలా ఆశగా ఉండేది.



అందుకు నా దగ్గర అంత డబ్బు లేదు. అయినా, పబ్లిషర్స్ చుట్టూ తిరిగే వాణ్ని. నాకు అంతగా పేరు లేకపోవడంతో.. అమ్మకాలు జరగవని, చాలా కష్టమని ప్రచురణకర్తలు చెప్పేవారు. విసిగిపోయిన నాకు ఫేస్ బుక్ లో ఓ ప్రకటన కనబడింది. దీంతో మళ్లీ ఆశలు చిగురించాయి. రచయితలెవరైనా పుస్తకాలు ప్రచురణ చేయాలనుకుంటే.. కేవలం రూ.20,000 చెల్లిస్తే తాము ఆ పని చేసి పెడతామని దాని సారాంశం. దీంతో నేను కూడా నా "నీలచడయాన్" రచనను ప్రచురణ చేయాలని నిశ్చయించుకున్నాను. కానీ, నా దగ్గర రూ.10,000 మాత్రమే ఉన్నాయి. అమ్మ రోజూ కూలీకెళ్లి దాచుకున్న మరో 10వేల రూపాయలను నాకు ఇచ్చింది. అలా నా మొదటి పుస్తకం వెలుగు చూసింది. కానీ ఆ పుస్తకాలు ఆన్ లైన్ లోనే అమ్మకాలు జరిగాయని.. బుక్ స్టోర్ లో అందుబాటులో ఉండేవి కావని ఆయన వెల్లడించారు. దీంతో ఆ పుస్తకం సమాజంలో పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది.

అఖిల్ రచించిన పుస్తకాలు

'నీలచడయాన్' పుస్తకాన్ని ప్రముఖ సినిమా రచయిత బిపిన్ చంద్రన్ చదివారు. ఆయనను ఆ కథలు ఆకట్టుకున్నాయి. 'నీలచడయాన్' ఆయన స్పందనను ఫేస్ బుక్ ద్వారా పంచుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆ 'నీలచడయాన్'కు బాగా ప్రాచుర్యం లభించింది. ఆ తరువాత చాలా మంది బుక్ స్టోర్ లలో 'నీలచడయాన్' పుస్తకం కోసం ఆరా తీశారని.. దీంతో ప్రచురించలేమన్న పబ్లిషర్లే పుస్తక ప్రచురణకు ముందుకు వచ్చారు.

- అనంతోజు మోహన్ కృష్ణ





కొత్తగా వచ్చే రచయితలకు పుస్తక పబ్లిషింగ్ కోసం ప్రచురణకర్తలను ఒప్పించడం, పాఠకులను ఆకర్షించడం చాలా కష్టమైన పని. కేరళ సాహిత్య అకాడమీ సేవలు వర్ధమాన రచయితలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. 2021లో 'నీలచడయాన్ - పుస్తకాన్ని రాయడం పూర్తి చేశాను. ఉత్తర కేరళలో ఆచరించిచే 'థెయ్యం' అనే సంప్రదాయం ఆధారంగా ఈ కథ రూపొందిద్దుకుంది. 2022 'తారకంఠన్' అనే రామయణం ఆధారిత పుస్తకాన్ని తీసుకువచ్చాను. ప్రస్తుతం ఈ పుస్తకాలు మాతృభూమి బుక్స్ ద్వారా ప్రచురితం అయ్యాయి. జీవితంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నప్పటికి.. ఈ స్థాయిలో గుర్తింపు పొందడం నిజంగా నాకు చాలా ఆనందాన్ని ఇస్తోంది.

మృత్యుస్పర్శ

పదిలక్షల సూటు వేసుకొని
యాబయారించుల ఛాతి
మొసలికన్నీరు నాయకుడు
పై దుస్తులు ఒలిచాడు
చీరా లాగేశాడు
లో దుస్తులు గుంజేశాడు
ప్రపంచ బహిరంగ మార్కెట్లో
బహిరంగ అసభ్య చేష్టల
ట్రంపు ప్రియుడు
భారతమాతకు జై అంటూనే
భూమంతా
నగ్నంగా తిప్పాడు

యథా నాయక
తథా కార్యకర్త

పై దుస్తులు ఒలిచారు
చీరా లాగేశారు
లో దుస్తులు గుంజేశారు
మతం మార్కెట్లో
మణిపూర్ మాతను
వాళ్ళుపుట్టిన మార్గాన్ని పొక్కిలి చేస్తూ
నగ్నంగా తిప్పారు

వాడు దేశాన్ని
వాళ్ళు దేహాల్ని

రోజూ నలభైవేల అల్పాహారం తింటూ
అంగాంగం అంగట్లో పెట్టినోని
అనుచరులారా!
అమ్మతనాన్ని ఛిద్రంచేయడమే
మగతనం అనుకునే మతమృగాల్లారా!

నడిబజార్లో
ఇనుప గొల్సుల చేతుల్తో
అమ్మల రొమ్ములు పట్టుకున్నోళ్ని
వాళ్ళమ్మ పాలకు బదులు
ఉచ్చపోసి పెంచుంటది

బహిరంగంగా
అమ్మల జననావయవాల్లో
చేతులు ముంచిన వాళ్ళు
పియ్యి తిని పెయ్యి పెంచుంటారు
పందుల్లా!

హిందూ తాలిబన్లారా!
యూదు స్త్రీల నగ్న ఊరేగింపులా
మీరు పాలు తాగిన రొమ్ముల్ని
మీ జనన జననంగాల్ని
మీ తల్లుల్ని మీ చెల్లెళ్ని మీ భార్యల్ని
మీ భారతమాతను నగ్నంగా
ఊరేగించారు
సిగ్గును కాశీలో వదిలి
శరాన్ని గంగలో తోసి

హిందూ నాజీల్లారా!
హిట్లర్ ముస్సోలినిల కుక్కచావులు
ఇవ్వాళ ఇప్పుడే కాకపోవచ్చు
కళ్ళు కాయలు కాసేలా
మీ కోసం ఎదురు చూస్తూనే ఉంటాయి

- వడ్డెబోయిన శ్రీనివాస్



జంట జల నగరాలు !

మేడ్చల్‌లో మేఘాలు ...
ఉప్పల్‌లో ఉరుములు ...
మెహదీపట్నంలో మెరుపులు ...
చిలకలగూడలో చినుకులు ..!

వనస్థలిపురంలో వర్షం ...
కూకట్‌పల్లిలో కుంభవృష్టి ...
ఈసిఐఎల్‌లో ఈదురు గాలులు ...
పీర్జాదిగూడలో పిడుగులు ..!

వారాసిగూడలో వరదలు ...
బేగంబజార్‌లో బురదలు ...
ముషీరాబాద్‌లో మురుగు ...
అల్వాల్‌లో అలుగు ..!

నాగోల్‌లో నాలాల మత్తడి ...
చిక్కడపల్లిలో చిత్తడి ...
చర్లపల్లిలో చెట్లు విరగడం ...
గోల్కొండలో గోడలు ఒరగడం ..!

జగద్గిరిగుట్టలో జలగండం ...
సూరారంలో సుడిగుండం ...
మూసాపేట్‌లో ముసురు ...
తుకారాంగేట్‌లో తుఫాన్ ..!

జంట నగరాలు నీటిలో
నానుతున్నాయి !
ఎడతెరపిలేకుండా వానలు
కురుస్తున్నాయి !!
జంట నగరాలు హై అలెర్ట్‌తో
వణుకుతున్నాయి !!!

- బోనగిరి పాండురంగ

లోతట్టు...

ఏం చేసిందో పాపం
పట్టణాల, మహానగరాల లోతట్టు ప్రాతం
జడివానలు పడి మునిగిపోతుంది
సైక్లోన్ సైతాన్‌కు గజగజ వణికిపోతుంది
లోగుట్టు పెరుమాళ్లకెరుక
తుఫాను వస్తే ఆ నేలంతా ప్రళయమే ఇక
కుండపోతల్లో నిండాతడిసి
కట్టుబట్టలతో కట్టుకన్న ఇండ్లను విడిచి
ఆకలిదప్పుల్తో అల్లాడుతుంది ఆ పల్లం
తడిసిన దేహాలతో
మనసులో ఎన్నో సందేహాలతో
కుటుంబాలు కుదేలయి రోడ్డున పడ్డవి
రవిని కరిమబ్బు కమ్మింది
కవికి ముసురు ముసుగేసింది
పాలకులకు, దళార్లకు కదల అవిటితనం అయింది
ఆ వైపు చూచేనాథుడెవరు? అవసరం ఎవరికి?
ఆ వరదబురదలో తిరుగాడే అపరిచితుడెవరు?
పత్రికలు కొన్ని పతాకశీర్షికలుగా
రాసిమురిపిస్తారు చివరికి
కలుక్కుమంటుంది గుండెలో మనిషన్నవాడికి
రిక్తహస్తం దూరానవున్నవాడిది
ఏం లాభం ?
మదిలో కలతనెలవంక తదియపొడుపు వినా
కలెక్టర్ గారికి కన్నెత్తి చూచే వీలు ఉండదు
మంత్రివర్యులకు ఖాళీ దొరకదు
ఎగువకాలనీవాసులకు కరుణపుట్టదు
కడక్ ఇస్త్రీవాడికి ఆలోచనతట్టదు
ఎన్నికల ప్రచారసమయంలో
హామిల వర్షంలో
లోతట్టు గల్లంతవుతుంది
వరద ముంపు మానవప్రాణుల ఇక్కట్లగురించి
చర్యలపై చిత్తశుద్ధి ఉండదు
తెల్లవారితే
దిగువ వాళ్ల దిగులసలు గుర్తుండదు
వారం దాక బురద ఎండదు
వాన నీటి క్రిమికీటకాలు
ఎంత రక్తం తాగినా వాటి కడుపు నిండదు
బాధితులకు ఓదార్పుగా
అలెగ్జాండర్ దండయాత్రలా అంటువ్యాధులు
బయలుదేరుతాయి
ఈలోపు చిరు ఉపశమనం
పకృతి దయతలుస్తుంది గాలిగా
భానుడు ఉష్ణాన్ని ఉరుముతాడు జాలిగా
పంకంబింకం మరచి బీళ్లుగా వొళ్లు విరుస్తుంది
పునరావసం అపుడు ముంపు శరణార్థులను విడుస్తుంది
శరీరబలవంతులు తడిసిన కొంపల్లోకి
గంపెడు దుఃఖంతో చేరుతారు
బలహీనులు ధవఖానలో దీనంగా మూలుగుతారు
వర్షంవరదలో మునిగిన ఇండ్లు ఎటుచూసిన
వరదనీటికవిత్వపు ఆనవాళ్లు
ప్రతీకంటి నుండి జాలువారు అశ్రుధారలే కనిపిస్తాయి
సర్దుబాటు తత్వానికి, తెలియక చేసిన తప్పులకు
పశ్చాతాప పడడానికి జీవితంలో
గురువు అవసరమే ఉండదు కదా బహుశా
కుదటపడ్డ కొన్నిరోజులకే
పిడుగుపడ్డట్టు వాతావరణశాఖ హెచ్చరిక!
బంగాళాఖాతంలో అల్పపీడనం తీరందాటిందని
రాగల ఇరవైనాలుగు గంటల్లో
గంటకు నూటఇరవై మైళ్ళ వేగంతో వీచు తుఫాన్
గాలులతో కూడిన
భారీవర్షాలని.

- రమేశ్ నల్లగొండ
8309452179

కన్నీళ్ళ సిరా

కన్నీళ్ళను సిరాగా రాసిన కవితలు
కష్టాల తోరణాలను
సాహితీ గుమ్మాన కట్టి వేస్తావి
జనాలను మనవాళ్లను చేస్తావి!

బాధల బావుల నుండి ఉద్వేగాలను తోడేస్తాయి
దశా దిశ లేనివాడికి చేతికి లక్ష్యా కంకణం అవుతావి!

తుప్పు పట్టిన చైతన్య కత్తిని
నిప్పులా కాల్చి పదను పడుతావి
మూలన ఉన్న చేతికర్రను చేదోడుగా నిలుపుతావి!

చిలికిన కన్నీరులో తిలకిస్తే
ఎన్నో రంగులను చూపుతావి
మాటను మౌనం లోంచి వచ్చిన
తూటాలా చేస్తావి!

కవితలు కష్టజీవికి ఇరువైపులా నిలుస్తాయి
అన్యాయాలను అక్రమాలను
సాగకుండా నిలదీస్తాయి!

చీకటి మార్గాన
దివిటీ అయి నడుస్తాయి
సమ సమాజానికి
కొత్త బాటలు వేస్తాయి!

- జగ్గయ్య.జి, 9849525802

అబలకు నిర్వచనం...

అలుపు ఎరుగని శ్రమ జీవి తను
కుటుంబమే తన స్వర్గం అని
భావించే త్యాగ మూర్తి తను
తన వాళ్ల కోసమే తన ఆలోచన,
తన కలలు తన పిల్లల కోసమే
తన ఆవేదన వారి పరివారం కోసమే
తన వారి భవిష్యత్తుకై తన తపన..
తన మనిషి కోసం ఆమె ఆరాధన..
అలుపెరుగని ప్రయత్నం తనది
బాధ తో నిండిన బాధ్యత తనది.
శ్రమిస్తుంది తను గుర్తింపుకై
పరితపిస్తుంది తన వారి కోసమే
ఆశనే ఊరిపిగా మార్చి ఎదురుచూస్తుంది
అనురాగము కోసం పరితపిస్తుంది తను,
అలిసి పోయిన
శక్తిని పుంజుకొని
తనకు తానె అని శ్రమిస్తోంది
పరుల పనులను సూటి పోటీ మాటలను భరిస్తుంది
ఇతరుల మనసుని ఎప్పుడూ బాధించని సబల కానీ ఆమె
ఎప్పుడూ అబలగానే మిగిలిపోతుంది
అణిచి వేతలకు గురి అవుతుంది
అభద్రత భావంతో జీవనం బ్రతుకుతుంది.

అబలకి స్వేచ్ఛగా గగన విహారం చేసేదెప్పుడో
ఆమెకు గౌరవం లభించేదెప్పుడో
స్త్రీ లేకపోతే జననం లేదు.
స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు".
అని గుర్తించేదెప్పుడో కంటి పాపలా పిల్లలను కాపాడుకునే
మాతృమూర్తికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శు
భాకాంక్షలు...

- అనిత దావత్, 9394221927

తాటతీస్తాం

నేనూ ..మనిషినే
నాకూ... మానం ఉంది
మనిషిని ప్రేమించే గుణం ఉంది

బుద్ధి జీవులు
బుద్ధిహీనులు అవుతున్నారు

గడ్డి మేసే జంతు జాలాల కు
శరీర ధర్మం తెలుసు
ఆవు మానాన్ని కాపాడుటకు
తోక ఉంది
కుక్క నక్క జంతువులకు
పక్షులకు శరీర ధర్మం తెలుసు

బుద్ధి ఎరిగిన మానవజాతి
ఒళ్ళు బలిసి కొవ్వెక్కి తిన్నది అరగక

దళిత గిరిజన మహిళలపై
అత్యాచారాలు లైంగిక దాడులు చేస్తున్నారు

అధికార మదంతో రాజకీయ అండతో
మహిళలపై దాడులు చేస్తున్నారు

ఖబర్దార్ తిరగబడతాం
వీరనారి ఝాన్సీ రుద్రమదేవి
చాకలి ఐలమ్మల
రోకలి బండలతో ప్రతిఘటిస్తాం

తాటతీస్తాం చూస్తూ ఊరుకోం
అనుచబడుతున్న వర్గాలు ఏకమై ఏలుకుంటాం
వర్ధిల్లాలి అనుచబడుతున్న వర్గాలు

వర్ధిల్లాలి వర్ధిల్లాలి

- ఆర్కల రాజేష్, 9177909700

